
కథ

# కథా మంజరి

పది కథల సమాహారం



## కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**డిసెంబర్ 2020 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari


సుస్వాగతం


# ఇదీ వరస


| సంఖ్య | విషయం | పేజీ సంఖ్య |
|---|---|---|
| 1. | మా జట్టు | i |
| 2. | కృతజ్ఞతలు | ii |
| 3. | కథా కీయం | iii |
| 4. | ఈ నెల విశిష్ట అతిథి | v |
| 5. | కథా మార్గదర్శి | viii |
| 6. | దీపావళి కథల పోటీ విజేతల గురించి | x |
| | **కథలు** | |
| | | |

| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 1. | తానే నేనై | భాగ్యలక్ష్మి అప్పికొండ | 1 |
| 2. | ఆర్ద్ర చినుకులు | వాణి శ్రీనివాస్ గొర్తి | 7 |
| 3. | అక్కరకు రాని చుట్టం | వసుంధర | 11 |
| 4. | వికృతి .. | సింహ ప్రసాద్ | 16 |
| 5. | ఇది కథ కాదు | మణి వడ్లమాని | 25 |
| 6. | ముఖచిత్రం | పెమ్మరాజు విజయ రామచంద్ర | 30 |
| 7. | ఆకాశం వంగింది | డా. ఎమ్. సుగుణారావు | 37 |
| 8. | ఆకాశానికి గుంజలు | చాగంటి ప్రసాద్ | 44 |
| 9. | నాలుగక్షరం ముక్కలు | కృపాకర్ పోతుల | 51 |
| 10. | ఋణం | డా. లక్ష్మి రాఘువ | 55 |


కథా మంజరి

# ఇంకా మా జట్టు



సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.

బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

# కృతజ్ఞతలు

# SPONSORS


## ఈ సంచిక కు ఆర్థిక సహకారం

## OF THIS ISSUE

కథా మంజరి

**శ్రీ పెదురుముడి రామారావు**

**శ్రీమతి రామలక్ష్మి**



# “కథా” కీయం



ఆలోచన వచ్చి అర్నెల్లు  అయింది. కార్యరూపం దాల్చిన ఐదు నెలల్లో ఐదు సంచికలు ఠంచనుగా వచ్చేసాయి. అందులో ఓ ప్రత్యేక సంచిక కూడా ఉంది.  రచయిత(త్రి)లు, శ్రేయోభిలాషులు, పాఠకులు .. ఇలా అందరూ తలో చెయ్యి వేసి ముందుకు నడిపిస్తున్నారు. అందుకే .. వీరందరి కోసం, ఈ కథా మంజరి నడక  చెప్పాలనిపించింది.

కర్త, కర్మ, క్రియలకు .. ముందు ఇద్దరమే నాంది పలికాం. ఒకరు బెంగుళూరు, ఇంకొకరు విశాఖలో నడక ప్రారంభించాం. ఇద్దరి మధ్య చరవాణి, లాప్టాప్ ల దూరమే ఉంది.  తర్వాత కొందరు మిత్రులతో మాట్లాడి, నామకరణం చేసి జూన్‌లో రంగంలోకి దిగాం. రెండు నెలలు గడిచేసరికి, నేను సైతం అంటూ బొమ్మలు వేస్తానంటూ అనకాపల్లి నుంచి ఆర్టిస్టుగారు వచ్చి కలిసారు.  అలా ముగ్గురం .. బెంగుళూరు, విశాఖపట్నం, అనకాపల్లి లో ఉంటూ కథ నడుపుతున్నాం.

ప్రతి నెలా పదిహేనవ తారీఖు వరకు ఇమెయిల్లో వచ్చే కథలన్నిటిని, వచ్చే నెల విశిష్ట అతిథికి ఇమెయిల్ ద్వారా పంపి, వాటిలో మూడు బహుమతులకు, ఏడు సాధరణ ప్రచురణకు కథలను ఎంపిక చేసి, మూడు రోజుల లోపు ఇవ్వవలసిందిగా కోరుతాం.  వాటితోపాటు ఆయనకి నచ్చిన, లేదా స్ఫూర్తినిచ్చిన .. ఓ కథా మార్గదర్శి మీద వ్యాసం రాసి పంపమని కూడా అడుగుతాం.   ఆయన ఆ పది కథల పేర్లు పంపిన తర్వాత, ఆ కథల్ని ఆర్టిస్టుగారికి పంపుతాం.  మరో మూడు, నాలుగు రోజుల్లో వాటికి బొమ్మలు వేసి, వాటిని స్కాన్ చేసి ఆయన ఇమెయిల్ ద్వారా మాకు పంపుతారు. ఈ లోగా ఆ పది కథలని తప్పుల్లేకుండా చూసి, ఓ వరుసలో ఉంచి, బొమ్మలు రాగానే వాటిని కథల పక్కన చేర్చి, పేజీల్ని తయారు చేసి, మరోసారి తప్పొప్పులు చూస్తాం. ఈలోగా విశిష్ట అతిథిగారు పంపిన కథా మార్గదర్శి మీద రాసిన వ్యాసం, సంపాదకీయం (కథాకీయం), అలాగే విశిష్ట అతిథిగారి పరిచయం .. వీటన్నిటికి పేజీ ముస్తాబులు చేసి, సిద్ధంగా ఉంచుతాం.  మరో వైపు .. ఆ నెల కథలకి నగదు బహుమతులిచ్చే శ్రేయోభిలాషి (లు) తో మాట్లాడి ఆ పైకం  నెలాఖరుకి మాకు చేరేలా ఏర్పాటు చేసుకుంటాం.  అలాగే అన్ని పేజీలు సమకూరాయా .. లేదా అని నిశితంగా ఇద్దరం చూస్తాం. ఇక .. అన్ని సరిపోయాయనే అభిప్రాయంకి వచ్చిన తర్వాత,  పేజీలన్నిటినీ పుస్తకరూపంలోకి తీసుకొచ్చి .. అమ్మయ్యా అని అనుకోకుండా .. ఓ రోజు ముందుగా కథలు ప్రచురిస్తున్న ఆయా రచయిత(త్రి)లకూ, ప్రచురణకు స్వీకరించబడని కథల రచయిత(త్రి)లకు ఇమెయిల్ ద్వారా తెలియచేయడం .. వంటి పనులు ముగిస్తాం. మధ్య మధ్యలో పత్రిక కావాలంటూ అభ్యర్ధనలు పంపిన

కథా మంజరి

పాఠకుల ఇమెయిల్ చిరునామాలను నమోదు చేసే ప్రక్రియ నడుస్తూ ఉంటుంది. ఇక అన్ని విధాలా సంచిక విడుదలకు అనువుగా ఉందనే నిర్ణయానికి వచ్చి, నమోదు కాబడిన ఇమెయిల్ చిరునామాలకు ఒకటో తారీఖు ముందు రోజు రాత్రి, సంచిక చేరవేసే కార్యక్రమం మొదలెట్టి ఓ అరగంటలో ముగిస్తాం. ఒకటో తారీఖు ఉదయానికి పాఠకుల మెయిల్ కి చేరిందా, లేదా చూసుకుంటాం. బహుమతులు పొందిన రచయితల బ్యాంకు ఖాతా వివరాలు అందుకున్న వెంటనే, వారికి ఆ బహుమతులు పంపి, అప్పుడు గుండె నిండా ఊపిరి తీసుకుని, తిరిగి ఆ నెల కార్యక్రమానికి .. భుజం మీద కండువా వేసుకుని ముందుకు నడుస్తాం.

ఇదండీ .. కథా మంజరి స్క్రీన్ ప్లే!!

పత్రిక మొదలు పెట్టిన ఉద్దేశ్యం .. ఒకటి - యువ రచయిత(త్రు)లని ప్రోత్సహించాలనీ, రెండు - చాలా మంచి కథల తయారీకి చెయ్యి అందించాలని. ఏ మాత్రం గమ్యం దిశగా నడిచాం? ఐదు సంచికల వయసున్న పసి పత్రికకి పెద్ద ప్రశ్నే కదా!

***0***

## ఈ నెల విశిష్ట అతిథి



## డా. బొమ్మదేవర నాగకుమారి గారు

ఇంగ్లీషులో Multi-Dimensional person అనే ఓ మూడు పదాల పదం ఉంది. అంటే తెలుగులో బహుముఖ ప్రజ్ఞాశాలి అని అనొచ్చు. అలా వివిధ కోణాల్లో పనిచేస్తూ, అన్నింటిలోనూ నిష్ణాతులుగా పేరు గడించుకున్న అతికొద్ది మందిలో మనం గర్వం చెప్పుకోగల తెలుగు సాహితీ కిరణం డా. బొమ్మదేవర నాగకూమారి గారు!

జంతు శాస్త్రంలో పి.హెచ్.డి సాధించి, వెంటనే దిశ మార్చి జర్నలిజంలో పి.జి. డిప్లొమా చేసారు. ఇంకా చిత్రంగా జోతిష్య శాస్త్రంలో ఎమ్.ఎ. చేసారు. ఇన్ని డిగ్రీలు ఉన్న నాగ కుమారి గారు తప్పకుండా ఓ ప్రొఫెసర్ గా ఉద్యోగం చేస్తూ ఉంటారని అనుకుంటాం. ఆశ్చర్యం.. ఆమెకు ఇంకా ఇష్టమైన జీవిత బంధలకు త్రోవ చూపెట్టే 'మ్యారేజ్ బ్యూరో' నిర్వహిస్తున్నారు. ఇలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలిగారి విషయాలని ఆమె మాటలలో ..

### పరిచయం

నా గురించి చెప్పుకోవాలంటే నేను రచయిత్రి కన్నా ముందు మంచి పాఠకురాలిని అని చెప్పుకుంటాను!

ఇప్పటికీ తలుచుకున్నా, ఈ తరం విద్యార్ధుల్ని చూస్తున్నా చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే నేను నాలుగో తరగతిలో ఉండగానే పుస్తకాలు చదవటం మొదలు పెట్టాను. మా స్కూల్ లైబ్రరీ నుంచి తీసుకుని, నేను చదివిన మొదటి నవల నాకింకా గుర్తుంది. **'ద్వివేదుల విశాలాక్షి'** గారి '**గోమతి**'.

మా అమ్మ దగ్గర్నుంచి నాకీ అలవాటు ఏర్పడిందనుకుంటాను.

మా అమ్మ పుస్తకాలు బాగా చదువుతారు. నేను చిన్నపుడు తరచుగా చూసిన ఒక దృశ్యం ఇంకా బాగా గుర్తుంది. అమ్మ ఓ చేత్తో గరిటె తిప్పుతూనే, మరో చేత్తో పుస్తకం పట్టుకుని చదువుకునేవారు. ఆవిడ చదివే రచనల సృష్టికర్తలు మరో లోకానికి చెందిన వారన్నంతగా వారందర్నీ (చలం, బుచ్చిబాబు, శరత్ చంద్ర, కొకు, లత, యద్దనపూడి, అరికెపూడి మొదలైనవారు) ఆరాధించే వారు. అప్పట్లో టీవీ లేకపోవటం ఓ గొప్ప అదృష్టం అనుకుంటాను.

అలా పుస్తకాలు చదవటం మొదలు పెట్టిన నాకు పుస్తకాల్లో అద్భుత ప్రపంచం కన్పించటం మొదలు పెట్టింది.

నేను చదవటం , ఆలోచించటం ఆరంభించేసరికి యండమూరి వీరేంద్ర నాథ్, మల్లాది వెంకట కృష్ణ మూర్తి బాగా పాప్యులరయ్యారు. వారి రచనలు చదువుతూ పెరిగాను.

వార, మాస పత్రికో, నవలో... ఏది కంటబడినా చదవకుండా వదిలేదాన్ని కాదు. చివరకు మిరపకాయ బజ్జీల పొట్లాం కట్టిన కాగితమైనా సరే జాగ్రత్తగా మడతలు తీసి, సాఫీగా చేసి చదివేదాన్ని. బహుశా ఈ చదివే అలవాటే నన్ను రచయిత్రిని చేసిందనుకుంటాను.

**నేను వ్రాయటం ఎలా మొదలు పెట్టానంటే...?**

నేను అయిదో తరగతిలో ఉండగా, మా స్కూల్లో (శ్రీ రవీంద్ర ఉన్నత పాఠశాల, గద్వాల) ఎమ్ కే పి పార్థ సారధి గారని తెలుగు మాస్టార్ ఉండేవారు.

ఒక రోజు వారు ఒక పెయింటింగ్‌ని బ్లాక్ బోర్డ్ మీద ప్రేలాడ దీసి, ఆ చిత్రానికి తగ్గట్టుగా కథ వ్రాయమన్నారు. ఆ పెయింటింగ్ లో ఇద్దరు చిన్న పిల్లలున్నారు. అబ్బాయ్ నిద్రపోతున్నాడు. అమ్మాయ్ స్కూల్ యూనిఫామ్‌లో ఉంది.

ఆ అమ్మాయికి ఆ అబ్బాయ్ అన్నయ్య అయినట్టు, ఆ అబ్బాయిని నిద్ర లేపుతున్నట్టు ఊహించుకుని, నేను కథ వ్రాసాను. మాస్టార్ మెచ్చుకున్నారు. క్లాస్‌లో అందరూ చప్పట్లు కొట్టారు. ఇక్కడి నుంచే నేనూ వ్రాయాలీ అన్న ఆలోచన మొదలై ఉంటుందనుకుంటా.

ఆ కథని స్కూల్ మ్యాగజీన్‌లో కూడా వేసారు.

ఆ మోటివేషన్‌తో ఏదో ఒకటి వ్రాస్తూ ఉండేదాన్ని!

రేడియోలో శని, ఆదివారాలు వచ్చే బాలానందం, బాల వినోదం తప్పకుండా వింటూ , ఆ కార్యక్రమాలకు చిన్న కవితో, కథో వ్రాసి పంపేదాన్ని!

తర్వాత కాలేజికెళ్ళింతర్వాత కాలేజి మ్యాగజీన్‌లకనీ, యువవాణి ప్రోగ్రామ్‌లకనీ ... సైన్స్ ప్రోగ్రామ్‌ల కనీ ఏదో ఒకటి వ్రాస్తూ ఉండేదాన్ని!

పత్రికలకు ఉత్తరాలు కూడా వ్రాసేదాన్ని!

**నేను మొదటి నవల ఎలా వ్రాసానంటే?**

1985 ప్రాంతంలో ఆంధ్ర భూమి వార పత్రిక అంటే పాఠకుల్లో చాలా క్రేజ్ ఉండేది. తరచుగా ఆ పత్రికకు ఆర్టకల్స్, కథలు వ్రాసి పంపిస్తూ ఉండేదాన్ని!

ఒక సారి కాలేజ్ సెలవుల్లో ఆ పత్రికాఫీస్‌కి వెళ్ళాను. ఆ పత్రిక ఎడిటర్ శ్రీ సి. కనకాంబర రాజుగారు నన్ను ఒక నవల వ్రాయమన్నారు.

"నవలంటే పెద్ద పెద్ద రైటర్స్ వ్రాస్తారు. నా వల్ల ఏమవుతుంది?" అన్నాను.

వారు ఊర్కోలేదు. " నీలో స్పార్క్ ఉంది. నువ్వు వ్రాయగలవ్!" అంటూ ప్రోత్సహించారు.

అలా వ్రాసిందే నా మొదటి నవల **'పయనమయే ప్రియతమా!'** కలం స్నేహం సబ్జెక్ట్ గా వ్రాసాను.

ఆ నవలతో నా ప్రయాణం ఆరంభమయ్యింది.

ఏమీ వ్రాయని రోజు వెలితిగా ఉంటుంది.

చదవని రోజు దిగులుగా, జీవితాన్ని వృధా చేస్తున్నట్టుగా ఉంటుంది.


వ్రాయటమన్నది గొప్ప కళ!

వ్రాయటం గురించి నాకు బాగా నచ్చిన ఒక కొటేషన్

**" చరిత్రలో గుర్తుండిపోయే గొప్ప గొప్ప పనులైనా చెయ్యి లేదా కలకాలం నిలిచిపోయే పుస్తకమైనా వ్రాయి"**

***0***

# కథా మార్గదర్శి



## శ్రీ భమిడిపాటి రామ గోపాలం

"సర్వేజనాః సుఖినోభవంతు" అనే సంస్కృత సూక్తికి 'సర్వే డిపార్ట్మెంట్ వాళ్ళు సుఖంగా భవనాల్లో ఉంటారనే' తాత్పర్యాన్ని తమాషాగా చెప్పగలిగిన రచయిత కీ.శే. భరాగో అనబడే భమిడిపాటి రామగోపాలం గారు. అచ్చంగా తెలుగు కథలని అందించిన మొన్నటి తరం కథకుల్లో చెప్పుకోతగ్గ గొప్ప రచయిత భరాగో. కథని అందంగా వండడమే కాకుండా, చేతి రాతని కూడా అందంగా వడ్డించగల 'వంటొచ్చిన మగాడు' గా గుర్తింపు పొందిన భరాగో గారి "ఇట్లు మీ విధేయుడు" అనే కథాసంకలనానికి 1991 సంవత్సరంలో కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఆయన కథల్లో మధ్యతరగతి మందహాసాలతో పాటు, ఎక్కడో గుండెల్ని పిండే నిజాలూ ఉంటాయి. గతి తప్పిన కరుణ, కఠిన శిక్ష, గమన శ్రమ, వెన్నెల నీడ.. వంటి కథల్ని పాఠకుడు ఏ మూడ్ లో చదివినా సరే, కథ పాత్రలోకి వెళ్ళిపోతాడు. విచిత్రం ఏవిటంటే.. భరాగో సీరియస్ కథలు ఎక్కువగా రాసినా, ఆయనకి హాస్య రచయితగానే ఎక్కువగా గుర్తింపు ఉంది. కారణం .. ఆయన సీరియస్ కథల్లో కూడా, ఎక్కడో ఓ చిన్న చమత్కారం, హాస్యం, చతుర సంభాషణలు.. ఒకదానితో ఒకటి పెనవేసుకొని పాఠకుల్ని కట్టి పడేస్తాయి. ఆయన కథలు.. నిదానంగా, సాఫీగా మొదలై, చదువరులను పూర్తిగా చదివే వరకూ లాక్కెళతాయి. చదివేకా చాలా కాలం పాఠకుడి మస్తిష్కంలో ఉండిపోతాయి. భరాగో గారి కథల్లో ఎక్కువగా గవర్నమెంట్ ఆఫీసుల్లో పని చేసే గుమస్తాలే హీరోగా ఉంటారు. మన చుట్టూ తిరిగే పాత్రలే కనబడతాయి. మన ఇంట్లో మాట్లాడుకునే మాటలే వినబడతాయి. కథలకి, ఆయన రాసే శీర్షికలకు నామకరణం చేయడంలో ఆయనకి ఆయనే సాటి. ఇట్లు మీ విధేయుడు, వంటొచ్చిన మగాడు, తడిసి మోపెడు.. అలా చెప్పుకుంటూ పోతే నాలుగు వందల పేర్లు చెప్పాలి. అయన కథలు చదివాకా "హాస్య రచయిత" అని ఆయనకి ముద్ర వేయడం 'సాహిత్య ద్రోహం' అని కూడా చాలామంది వాపోయారు. భరాగో తన పుస్తకం గురించి స్వయంగా చెప్పుకుంటూ -- "సరదా కథలు " చాలా వాట్లో "నలుగురు కూచుని నవ్వే వేళల నా పేరొకపరి తలచే" వినోదాత్మకత వుందని నా స్ఫురణ. సమాజం లొ తటస్థపడే క్రౌర్యాలూ, సైచ్యాలూ, చీకటి కోణాలూ, నా కథల్లో దృగ్గోచరం కావని ప్రసంసా, అభిసంసా కలిపిన కితాపు నాకిదివరకే దాఖలు పడింది. అది మైనస్ పాయింట్ ఎలాగో, ప్లస్ పాయింటూ అలాగే అని నన్ను నేను ఓదార్చుకుని, నా ఈ స్వ-పుస్తక-ప్రచురణా-వ్యసనాన్ని సమర్ధించుకుని, ఈ "భారీ బడ్జెట్ వెంచర్" లొ దిగేసాను (పుస్తకం స్వయంగా ప్రచురించారు.) సరదాకి (ఏదో) ఆడితె, చాకలిది చీర పట్టుకుపోయిందని

సామెత. ఈ సరదా కథల ప్రచురణ నాకొక వస్త్రాపహరణం కాకుండా వుండాలని, ఈ పుస్తకం, నేనూ బతికి బట్టకట్టాలనీ, నేనే తుమ్ముకుని, నేనే చిరంజీవ అనుకుంటున్నాను" అంటారు. ఇది చాలు అయన హాస్య చతు'రాత'లలో అంతర్లీనంగా ఉండే విషయ విషాదం!!

అలా అని భరాగోగారు కథలతోనే సరిపెట్టలేదు..

"కథనకుతూహలం" పేరుతో ఓ శీర్షికలో కథలు, వ్యాసాలు రాసారు. పత్రికలలో కనబడే వ్యాపార ప్రకటనలకు, రోడ్ల మీద కనబడే హోర్డింగ్స్ మీద ఉండే వ్యాపార ప్రకటనలకు, ఆ కాలంలో వీరే మాటలందించేవారు. సినిమాల "లోనికి" వెళ్ళలేదు గాని, వీరికి సినిమాలోకం అంటే చాలా ఇష్టం. సినిమాల మీద, సినిమా వాళ్లమీద వ్యాసాలు, సమీక్షలు రాసిరాసి.. ఇహ లాభం లేదని, సినిమా పాటలమీద "నూట పదహార్లు" అనే పుస్తకాన్ని రాసి, సినిమా"లోని"వారు చేయలేని సాహసం చేసారు. ఆ విషయమే గొల్లపూడి మారుతీరావు గారు ప్రస్తావిస్తూ.. "ఆయన "నూట పదహార్లు" తెలుగు సినీ సంగీతానికి వెయ్యి నూటపదహార్ల కట్నం. ఏ ఎం.ఫిల్ పట్టాకో, ఏ కమిటెడ్ విద్యార్థో చెయ్యవలసిన పరిశోధన. కాని ఆయన సినీ సంగీతానికి కమిటెడ్ అభిమాని. అందుకని రెండు సార్లు కృషి చేసి తన రుణం తీర్చుకున్నాడు" అన్నారు.

భరాగో గారితో మాట్లాడితే గురజాడ వారి నుంచి గొల్లపూడి వారి వరకు.. నేరుగా వారితో మాట్లాడినట్టే ఉండేది. ఎందరో రచయితల కథా సంకలాలని అందంగా తయారుచేయడమే కాకుండా, ప్రముఖ సంస్థల సావనీర్లను రూపొందించేరు. ఇంకా చెప్పుకోవాలంటే.. ఎన్నో వందల పుస్తకాల మీద నిక్కచ్చిగా అందించిన ఆయన సమీక్షలు అజరామారాలే!

1932 లో జన్మించిన భరాగో.. నాలుగైదు ఉద్యోగాలు చేసినా సరే, ఎక్కువ కాలం సర్వే డిపార్ట్మెంట్ లో ఉన్నా, అదే ఉద్యోగం విశాఖపట్నం పోర్టు ట్రస్టులో చేసి, 1990 లో పదవి విరమణ చేసారు. ఆరు కథా సంపుటాలు, మూడు నవలలు కూడా వెలువరించారు. "ఆరామ గోపాలం" అనే అందమైన పేరుతో తన ఆత్మకథని ప్రచురించారు. భరాగో గారి గురించి చెప్పుకోవలసిన గొప్పతనం ఏమిటంటే.. 75 సంవత్సరాల వయసులో చక్కెర వ్యాధితో పాటు ఆర్థరైటిస్ వ్యాధి వలన రెండు కాళ్లు, చేతి వేళ్లు సహకరించనప్పుడు కూడా ఆయన రచనా వ్యాసంగం ఆగిపోలేదు. చక్రాల కుర్చీలో కూర్చుని, తన రచనల్ని సహాయకులతో కొనసాగించారు. మనస్సుని, మెదడుని తన చెప్పుచేతల్లో పెట్టుకుని, సహకరించని అన్ని అవయవాలతో రాజీపడి, అవరసమైన చోట లొంగదీసుకుని పోరాటం సాగించిన యోధుడు భరాగో. అందుకే.. ఆయన అంటూండేవారు "సాహితీరంగంలో నాకంటే ఘనులు ఉన్నారు. కాని నా ప్రత్యేకత నాకుంది" అని.

అవును.. అలా గర్వంగా చెప్పుకోగలిగే కథా మార్గదర్శి "ఇట్లు మీ విధేయుడు" భరాగో!!

***0***

# దీపావళి కథల పోటీ విజేతల పరిచయం



## "జీవన పోరాటం" రచయిత్రి జాస్తి రమాదేవి

ములకల్లంక గ్రామం, తూర్పుగోదావరి జిల్లాలో జన్మించిన శ్రీమతి రమాదేవి గారు ప్రస్తుతం పాల్వంచ, భద్రాద్రి కొత్తగుడెంలో నివాసం ఉంటున్నారు. వీరి తల్లి తండ్రులు .. కీర్తిశేషులు ముసునూరి రామారావు, రత్నాంబ గార్లు. తన కథాప్రస్థానంలో శ్రీమతి రమాదేవి గారి వందకు పైగా కథలు, కవితలు వివిధ పత్రికల్లో ప్రచురించ బడ్డాయి. వివిధ కథల పోటీలలో పదిహేను సార్లు బహుమతులు కూడా వచ్చాయి. సాహిత్యంలో ఓనమాలు దిద్దించింది అన్నయ్య ముసునూరి సుబ్బయ్య చౌదరి గారని, సాహిత్య ప్రయాణంలో భర్త శ్రీ జే.వి.ఎన్. బాబు గారు తోడుగా నిలిచి, సహకరిస్తున్నారని, శ్రీమతి రమాదేవి గారు ఆనందంగా తెలుపుతున్నారు.

## "దిశా నిర్దేశం" రచయిత గంటి రమాదేవి



"గంటి రమాదేవి" అనే కలం పేరుతో కథలు రాస్తున్న శ్రీ జి యస్. శర్మ గారు 1966 సంవత్సరం నుంచి కథలు రాస్తున్నారు. అలనాటి ఆంధ్రప్రభ వార పత్రిక నుంచి, అన్ని వార, మాస పత్రికలలో వీరి కథలు ప్రచురణ అయ్యాయి. 240 పైగా కథలు, 12 నవలలు రాసిన శ్రీ శర్మ గారు మరో రెండు సంవత్సరాలలో ఎనభై దశాకంలోకి అడుగు పెట్టబోతున్నారు.

## "ఘోష" రచయిత్రి :పొత్తూరి విజయలక్ష్మి



"శ్రీవారికి ప్రేమలేఖ" సినిమా అనగానే గుర్తుకు వచ్చే రచయిత్రి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహితి ప్రపంచానికి చిరపరిచితులే. 200 పైగా కథలు, 20 నవలలె కాకుండా, రేడియో నాటికలు, టి.వి. సీరియళ్ళు రాసారు. మంచి ఆరోగ్యకరమైన హాస్యం, మానవ సంబంధాల పరిమళాలతో వీరి రచనలు నిండుగా ఉంటాయి. సాహితీ శిరోమణి, హాస్య కళాపూర్ణ.. వంటి బిరుదులు, మరెన్నో సత్కారాలు అందుకున్న శ్రీమతి విజయలక్ష్మి గారు మంచి వక్త కూడాను.

***0***

# త్యానే నేనై



భాగ్య లక్ష్మి అప్పికొండ

# తానే నేనై

భాగ్య లక్ష్మి అప్పికొండ



"అక్కా! అత్త మరీ కొత్త పెళ్ళి కూతురిలా తయారవుతున్నట్టు నాకు అనిపిస్తుంది. ఉదయాన్నే జాగింగ్, జిమ్, తర్వాత మొలకలు, ఫ్రూట్ జ్యూస్ లు .. అచ్చు హీరోయిన్ల దినచర్య పాటిస్తుంది!" తన చారెడు కళ్ళను వెటకారంగా తిప్పుతూ విడ్డూరంగా తన తోడికోడలితో చెబుతుంది లత.

"నాకు అదే అనిపిస్తుంది లతా! మావయ్య చనిపోయి ఏడు నెలలు అవుతుందా! అప్పటి నుంచి ఇలానే చేస్తోంది. నాకు తెలిసి ఒక పదిహేను కేజిలు తగ్గినట్టుంది. చాలా అందంగా మారిపోయింది. ఇదిగో తొమ్మిది అవుతోందిగా ఉద్యోగానికి బయల్దేరుతుంది!" అని తన నైటీని పట్టుకొని లాగుతున్న రెండేళ్ళ కొడుకుని ప్రేమగా కసురుకుంటూ చెబుతుంది సునంద.

తన బెడ్రూమ్ లో ఉన్న రాధకి కోడళ్ళు అనే మాటలు వినిపిస్తున్నాయి. కాదు .. కాదు వినబడేలా వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. అవేమీ ఆమె మనసును తాకలేదు. ఆమె కట్టుకున్న పచ్చని చీర పైటకి పిన్ను పెట్టుకునే చోట ఉన్న చిరుగు చూసి, చిన్న నవ్వు ఆమె పెదవులపై పూసింది.

ఇరవై ఏళ్ళ ముందు ఇలానే అద్దం ముందు ముస్తాబై తను హ్యాండ్ బ్యాగ్ పట్టుకొని ముందుకి కదులుతుండగా చిన్న శబ్దం. కోపంగా వెనక్కి తిరిగి చూసేసరికి బిక్క మొహం వేసుకొని, చేతిలో ఉన్న చీర కొంగుని వెంటనే వదిలి "సారీ!" అన్న మాధవ్.

"ఇంకెందుకు ఆ కొంగు పట్టుకుని సరాసరి నాతో పాటు ఆఫీసుకి వచ్చెయ్యండి!" అంది ఆదుర్దా కలగలిసిన విసుగుతో.

"ఎందుకంత కంగారు?" అని మంచం మీద సాగిలపడి తల కింద చేయిపెట్టి చిరునవ్వుతో అడిగాడు.

"మీకంటే ఈ రోజు సెలవు కనుక, ఇలా విష్ణుమూర్తిలా ఫోజ్ కొడుతూ నవ్వుతారు. నేనీరోజు మీటింగ్ ఎటెండవ్వాలి. రిపోర్ట్ సబ్మిట్ చేయాలి!" అని చీరను సర్దుకుంది కంగారుగా.

"నీకేంటి రాధా! నువ్వేదైనా సాధించగలవు!" అని దగ్గరగా వస్తున్న మాధవ్ ని చూస్తూ,

"దూరం అన్నానా దూరం..." చిరుకోపంతో పక్కకి తోసింది తను.

తలుపు తట్టిన శబ్దం విని ఈ ప్రపంచంలోకి వచ్చిన రాధ తలుపు తీసింది. "అత్తమ్మా!! ఆచారి గారు ఈ బ్యాగ్ మీకివ్వమన్నారు!" అని బ్యాగ్ ఇచ్చి వెళ్ళిపోయింది లత.
బ్యాగ్లో ఉన్న చిన్న ఎర్ర పెట్టె తీసింది. అందులో ఒంటిగా నవ్వుతున్న లాకెట్ కనిపించింది. అది ఒంటిదా? తన భర్త కన్నా ముందుగా, మంగళప్రదంగా తన ఎద సింహాసనాన్ని అలంకరించింది. తన బిడ్డలకి తొలి తాయిలం అయింది. ప్రతిరోజు కళ్ళకద్దుకుని చూసుకోకపోయినా, ఏ క్షణము వదలక గుండెల్లో దాచుకున్న మంగళ సూత్రాలు. సూత్రాల మధ్యన ఉన్న నాన్ కోడ్ వారధిగా పక్క పక్కన ఉండేవి కానీ, ఇప్పుడు శాస్త్రీయమో కాదో తెలియక పోయినా, వాటిని రెండింటిని కలిపి లాకెట్ లా చేయించుకుంది. మనిషికి మనో ధర్మానికి మించిన శాస్త్రమేముంది!! మనశ్శాంతికి మించిన స్వావలంబన ఏముంది. ఆమెకి ఇప్పుడు ఆ లాకెట్ వేసుకుంటుంటే తన భర్తను ధరిస్తున్నట్టుగా అనిపించి, అలవాటుగా గుండెల్లో దాచుకుని హ్యాండ్ బ్యాగు తీసుకుని బయటికి వచ్చింది.

"అమ్మా! ఇది నా చిన్నప్పటి చీర కదూ!? నాకెంత ఇష్టమో! ఇదిగో కొంగు చివరన అప్పుడు తెలియక నేనే పసుపు పెయింట్ రాసా, ఇంకా ఆ మరక పోలేదు .. చూడు.." తన పెద్ద కొడుకు వినయ్ పసిపిల్లాడిలా చీర కొంగు చేతిలోకి తీసుకుని మురిపెంగా చూస్తూ అన్నాడు.
"అలాగే కొంగు పట్టుకుని సరాసరి అత్తగారి వెనక ఆఫీసుకెళ్ళిపొండీ!" అని మేలమాడింది లత తన బావగారితో.
పచ్చని చీరకు ప్రాణం పోసిన పదిలమైన జ్ఞాపకాలు తన మదిని తాకినట్టుగా రాధ పగలబడి నవ్వింది. ఆ నవ్వుకి అక్కడ ఉన్న వారంతా జత కలిపారు.
తటపటాయిస్తూనే వినయ్ రాధ దగ్గరగా వచ్చి "అమ్మా!! నువ్వు నాన్న చనిపోయిన దగ్గర నుంచి, అయితే మౌనంగా ఉంటున్నావు లేదంటే నవ్వుతున్నావు. కనీసం కన్నీటి చుక్క అయినా కార్చలేదు. నాకెందుకో భయం వేస్తోంది. నీ బాధ బయటికి పంపించెయ్ అమ్మా!" అన్నాడు.
అది విన్న రాధ వినయ్ భుజం మీద చెయ్యి వేసి, "నువ్వేమీ భయపడకురా నాన్నా!! నేను మామూలుగా ఉన్నాను. ఓదార్చే తోడున్నప్పుడే బాధ బయటికొస్తుంది. తుడిచే చేతులున్నప్పుడే కన్నీరు ఉబికొస్తుంది.." అని చెప్పి రెండు అడుగులు ముందుకు వేసి, "సునందా!! నేను సాయంత్రం రావడం ఆలస్యమౌతుంది. నాకోసం ఏమి వండొద్దు!" మనవడిని ఎత్తుకుని ముద్దుపెడుతూ చెప్పి, ముందుకు నడుస్తూ, వాకిలిలో ఉన్న కొద్దిపాటి స్థలంలో మట్టి పోసి పెంచిన మొక్కలను కనులతోనే పలకరించింది. ఉదయం పూట ఆ పలకరింతకి వాకిలిలో విరబూసిన రంగు రంగుల గడ్డి గులాబీలు నవ్వుతూ బదులు పలికాయి.

స్కూటీపై ఆఫీసుకి వెళ్ళింది. సాయంత్రం ట్రైనర్ దగ్గరికి వెళ్ళింది. డాక్టర్ దగ్గరకి వెళ్ళి హెల్త్ చెకప్ చేయించుకుంది. తనకు కావలసిన బట్టలు, వస్తువులు సిద్ధం చేసుకుంది. ఇంటికి వచ్చే సరికి రాత్రి పది అయింది. ఉదయం ముంగిలిలో నవ్విన గడ్డి గులాబీలు ఇప్పుడు లేవు. పున్నమి చంద్రుని కాంతులకి తెల్లని చంద్రకాంత పువ్వులు మరింత అందంగా నేలపై వెన్నెలలా విరబూసాయి. వాటిని చూస్తుంటే రాధకి మాధవ్ తో ఉన్నప్పుడు తను నవ్విన నవ్వులు గుర్తొచ్చాయి. ఆ పక్కగా, ఎర్ర గులాబి ఒళ్ళంతా ముళ్ళున్నా అందంగా మందహాసం చేస్తుంది. ఆ మందహాసం ఇప్పుడు తను నవ్వే నవ్వులా అనిపించింది. మనమెలా ఆలోచిస్తే మన చుట్టూ ఉన్నవి అలాగే కనిపిస్తాయనుకొని ఇంటి లోనికి వెళ్ళి, సరాసరి తన గదిలోనికి వెళ్ళి తలుపేసుకుంది.

ఉదయం నుంచి రాత్రి వరకు బతుకు హడావిడిలో బాధని గుండె మాటున కట్టి పడేయగలుగుతుంది. గదిలోనికి అడుగు పెట్టిన తర్వాత తెరుచుకునే గుండె తలుపులను ఆపలేక పోతుంది. తన కళ్ళు యధాలాపంగా చూస్తూ, "ఎన్నో పెను ఉప్పెనల తగాదాలకి తీపి తీర్పులు చెప్పిన ధర్మాసనం., తన దాంపత్యాన్ని పండించిన మాగాణి., జ్ఞాపకాల నేలమాళిగ గదిలా అయిపోయింది!" అని నిట్టూరుస్తూ ప్రేమగా మంచాన్ని తడిమింది.

ఎప్పట్లానే తన మనసు కొద్ది నెలల క్రితం మాధవ్ అన్న చివరి మాటలు జ్ఞప్తికి తెచ్చుకుంది. "రాధా!! ఎన్ని బాధలు, సంతోషాలు, జయాపజయాలు పంచుకున్నాం. కాని పదేపదే కోరి, నేను వేడుకున్న మొదటి కోరిక తీరనేలేదు!" అన్నాడు మాధవ్ కినుకుగా.

"అలా అంటారేంటండి!! మొదటి సారి మీరడిగినప్పుడు పెళ్ళైన కొత్త రోజులు, మనమింకా సెటిల్ అవ్వలేదు, తర్వాత ప్రెగ్నెన్సీ, పిల్లలు వాళ్ళ పెంపకం ఎప్పుడూ కుదరలేదు. అన్నీ బాధ్యతలు తీరాయి అనుకుంటే, ఇదిగో మీరిలా...." మాధవ్ కళ్ళలోకి చూస్తూ, తన కళ్ళలోకి పరుగున వస్తున్న నీటిని కనురెప్పల మాటునే అదిమి అడ్డుకట్ట వేసింది రాధ.

"మీరిలా!! అని ఆగిపోతావేం? ... లంగ్ క్యాన్సర్ అని అను. నిజాన్ని నోటితో అనడానికి భయపడి, భ్రాంతిలో బ్రతకకూడదు రాధా!! ఏదేమైనా నా కోరిక ఇక తీరదు!" నిష్టూరంగా అన్నాడు మాధవ్.

"అయినా మీకు ఎన్నో సార్లు చెప్పాను. నాకు ఈ పిల్లలతో కుదరట్లేదు, మీరు వెళ్ళి రండి అని, వింటేనా!" అనునయంగా అంటూ మాధవ్ చేతికి టాబ్లెట్ ఇచ్చింది.

"ఆ అందమైన అనుభూతిని, ఆ ఆత్మానందాన్ని నీతో కలిసి అనుభవించాలన్నదే నా అసలు కోరిక.." అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"ఇప్పటికైనా మించిపోయిందేముంది! మీరు కోలుకోండి, కలిసి వెళ్దాం.." నిబ్బరాన్ని నటిస్తూ ఆశగా అంది రాధ.

"రాధా!! నిబ్బరాన్ని నటిస్తే ఎలా? నిబ్బరంగా జీవించడం నేర్చుకో. నీ కనురెప్ప కదలికలు కూడా తెలిసిన నాకు, ఆ కళ్ళలో ఏముందో తెలియదా? అయినా పిచ్చి రాధా.. ఎందుకింత నమ్మకం! అది కుదిరే పని కాదు. కలిసుండటం అంటే ఒకరితో ఒకరు ఉండటం కాదు, ఒకరిలో ఒకరు ఉండటం. నువ్వు ధైర్యంగా ఉంటే నాకదే చాలు!" అన్నాడు మాధవ్ లాలనగా.

కిచ్ కిచ్కిచ్ అన్న శబ్దంతో రాధ ఈ లోకంలోకి వచ్చింది.
ఆ శబ్దం తన పడక గది దగ్గరగా ఉన్న పారిజాత చెట్టు మీద ఉన్న చిలకల గూడులోనిది. ఇంట్లో అల్మరాలు కట్టగా మిగిలిన చిన్న చిన్న చెక్కలతో మూడు గూడులు తయారు చేసి చెట్టుకు అక్కడక్కడ వేలాడదీశాడు. కొత్తగా ఏ చిలకో కాపురానికొచ్చినట్టుంది. నా ప్రాణం మట్టుకు రెక్కలు కట్టుకుని ఎగిరెళ్ళిపోయింది అనుకుని ఒక నిస్సారపు నవ్వు నవ్వింది.
వ్యధ ఊయలలో ఊగుతున్న ఆమె కనులు, ఆ ఆలోచనలలోనే అలసి త్వరగా నిదురలోనికి జారుకున్నాయి.
గుండె తడుతున్న శబ్దానికి ఆమె నాలుగు గంటలకి ముందే లేచింది. తన బ్యాక్ ప్యాక్ లో కావలసిన సామాన్లన్నీ సర్దుకుంది. మాధవ్ పది సంవత్సరాలు క్రితం తెచ్చినది, అక్కడక్కడ ముత్యపు వర్క్ చేసిన తెల్లని చుడీదార్ ఇప్పుడు సరిగ్గా ఆమె దేహాకృతికి సరిపోయింది. కాంతా వర్క్ చేసిన దుప్పట్టా వేసుకుంది. దానిని సర్దుకున్న ప్రతిసారీ మాధవ్ ప్రేమ పరిమళాలు, జవ్వాదిలా ఆమె ముక్కుపుటాలను చేరుతున్నాయి.

తను గదినుంచి బయటికొచ్చేసరికి వినయ్ కారు స్టార్ట్ చేసి సిద్ధంగా ఉన్నాడు. రాధ కారు ఎక్కి ఎటో చూస్తూ ఆలోచిస్తుంది. "అమ్మా!!......ఏంటమ్మా నువ్వు!! ఎప్పుడూ ఏదో లోకంలో ఉంటున్నావు మీ ఆఫీసులో అంతా బాగానే ఉందా? అసలు ఎక్కడికెళ్తున్నావో నాకు కూడా చెప్పవా అమ్మా?" అని ఆప్యాయంగా అడిగాడు వినయ్.
"నీకు చెప్పకూడదని కాదు నాన్నా!! నాకీ మధ్య ఎవరికీ ఏది చెప్పాలని అనిపించట్లేదు. ఏదైతే నేను గట్టిగా నమ్ముతున్నానో అదే చేస్తున్నాను. నీకు తెలియడం ఇష్టం లేకపోతే నిన్నెందుకురా దిగబెట్టమంటాను? అదుగో, ఉండు! ఆపు! ఇక్కడ మా వాళ్ళున్నారు ఆపరా!!" తన బ్యాక్ ప్యాక్ చేతిలోకి తీసుకుంటూ అంది రాధ.

వినయ్ కారు ఆపి కిందకి దిగి, కారు డోర్ తీసి రాధ చేతిలో ఉన్న లగేజ్ తీసుకుని, అమ్మ వెంట వెళుతూ అక్కడ అందరిని సమన్వయ పరుస్తూ హడావుడి చేస్తున్న ఒకతన్ని గమనించాడు. ఒకామె ఎదురుగా వచ్చి, "మీ అబ్బాయా? రాధగారు" అని వినయ్ వైపు చూస్తూ రాధని పలకరించింది. ఆ ఆప్యాయ ప్రశ్నకి

చిన్న చిరునవ్వుతో సమాధానమిచ్చి, కొద్దిగా కొంచెం ముందుకి నడిచాడు. ఆ నడుస్తున్నప్పుడే ఆ సమూహ చర్చలు బట్టి రాధ ఎక్కడికి వెళ్ళబోతుందో అర్థమయింది వినయ్ కి. ఇదివరకు గమనించిన అతన్ని, "మీరు?" అని అడిగాడు.

"ట్రైనర్ నండి!" అన్నాడు అతను.

"అవునా అండి! నేను రాధ గారి పెద్దబ్బాయిని. ఈ వయసులో అమ్మని అక్కడ వరకు పర్లేదా?" అని సంశయాత్మకంగా అడిగాడు.

“మీ అమ్మగారు అందరి కంటే ఎక్కువగా ఆరు నెలలు ట్రైనింగ్ తీసుకున్నారు. నేను చెప్పిన ఆహార నియమాలు పాటించారు. అన్నింటి కంటే ఇలాంటి ప్రయాణాలకి కావలసింది 'నేను వెళ్ళాలి, వెళ్ళగలను' అనే దృఢ సంకల్పం, అది మీ అమ్మగారిలో ఉంది. మీరు ఏమీ భయపడకండి. మీ అమ్మగారు రెట్టింపైన ఆనందంతో తిరిగి మీ దగ్గరకి వస్తారు!" అని వివరణ ఇచ్చాడు.

ఆ మాటలకి కుదుటపడిన వినయ్ రాధకి వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయాడు.

రాధ ప్రయాణం మొదలైంది. విమానం, రైలు, క్యాబ్ ఇలాంటి అన్ని ప్రయాణ సాధనాలలో ఆమె ప్రయాణం సాగుతుంది కానీ, ఆమె మనసు మాధవ్ తో పయనిస్తుంది. కళ్ళకి చేరవలసిన గమ్యమే కనిపిస్తుంది.

ఆమె చేరవలసిన గమ్యం చేరువలోకి రాగానే, ఉన్ని దుస్తులు ధరించింది. కాళ్ళకి హైకింగ్ బూట్స్ వేసుకుంది. హ్యాండ్ గ్లోవ్స్ తొడుక్కుంది. తలపై టోపి, కళ్ళకి కళ్ళ జోడు పెట్టుకుంది. బ్యాక్ ప్యాక్ భుజాలకి తగిలించుకుంది. ఒక చేతిలో ట్రెక్కింగ్ పోల్స్ పట్టుకుని నడుస్తోంది. దూరం నుంచి వెండి కొండ ధగధగలాడుతూ బంగారు, పగడ వర్ణాలతో కనిపిస్తూ, అలౌకిక ఆనందంలో ఉన్న రాధకి, మల్లెపూల మంచంపై హిమాలయమంతటి తన మాధవ్ గుండెలపై తలవాల్చినప్పుడు, మృదువుగా తన తల నిమురుతూ "రాధా! మనం కైలాస మానస సరోవరానికి వెళ్దామా?" అని మాధవ్ అడిగిన మాటలు గుర్తుకు వచ్చాయి. ఆమె మానస సరోవరం దగ్గరికి వచ్చింది. నీలం వర్ణంలో కనబడుతున్న సరోవరం, మరి కాస్త దగ్గరికి వెళ్ళేసరికి పచ్చని మరకత వర్ణంలా కనిపిస్తోంది. ఉదయం మూడు గంటలు అయినందువలన దేదీప్యమానమైన కాంతులు ఆ కైలాస పర్వతం నుంచి సరోవరంలోకి వెళుతున్నాయి. కొంతమంది స్నానమాచరించి ధ్యానం చేస్తున్నారు. సరోవరం దగ్గరికి వెళ్ళిన రాధ గుండె తడి లేపినట్టు ఒక్కసారిగా, “ఎందుకు నన్ను వదిలివెళ్ళావు? నేను ఎలా బ్రతకగలననుకున్నావు? నేనెవరితో నవ్వాలి, పోట్లాడాలి. నీ ఇష్టం, నీ ఇష్టం అంటూ నువ్వు తప్ప ఏదీ ఇష్టం లేకుండా చేసావు. బాధ్యతల బండరాయిలు మోస్తున్నామని నీ కోరికను పక్కన పెట్టమన్నాను. ఎందుకంటే? ఎప్పటికైనా వెళ్తాం అని. కానీ, నువ్వు నన్ను విడిచి వెళతావని నేను కలలో కూడా అనుకోలేదు. ఇదిగో చూడు!! నువ్వు కోరుకున్నది.." అని గుండెల్లో దాచుకున్న లాకెట్ ని మధ్యగా తెరిచి అందులో ఉన్న మాధవ్ ఫోటో మానస సరోవరానికి ఎదురుగా పెట్టి భోరు భోరున ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది.

ట్రైనర్ రాధ మొహం మీద నీళ్ళు చల్లి లేపి, "ఇప్పుడు బాగుందా అండీ! మీరు పడిపోతే నాకు చాలా భయంగా అనిపించింది" అన్నాడు కొంచెం కంగారుగా.

"మీరేం కంగారు పడకండి. ఇప్పుడు నా గుండెలోని భారం తగ్గింది. అయినా నాకేమవ్వదు. ఎందుకంటే, నేను ఆయన కోరికలన్నీ తీర్చాల్సిన అర్థాంగిని" అని చెప్పి, వాక్కు అర్థం కలగలిసి వెలసిన కైలాస పర్వత పరిక్రమణకు ఉపక్రమించింది మాధవే తానైన రాధ...


***0***

కథా మంజరి

# ఆర్ద్ర చినుకులు



## వాణి శ్రీనివాస్ గొర్తి



# ఆర్ద్ర చినుకులు

## వాణి శ్రీనివాస్ గొర్తి

అరుంధతమ్మ మూసివున్న కళ్ళవంకే చూస్తూ కూర్చున్నాడు వీర్రాజు. ఆమెకు అంత దగ్గరగా కూర్చున్నందుకు కళ్ళు తెరిచి తనని కోప్పడితే...? జంకుతూ కాస్త దూరంగా జరిగాడు. "ఒరేయ్ సుబ్బూ ఈ రాత్రి నువ్వూ నాతోపాటే జాగారం చెయ్యాలిరా!"అన్నాడు సుబ్బు తోకాడించి పక్కనే పడుకుంది. అక్కడ వాళ్ళు ముగ్గురూ తప్ప ఇంకెవరూ లేరు. అరుంధతమ్మ విగతజీవిగా, సుబ్బు వీర్రాజులు ఆమె ఆజన్మ శత్రువులుగా.

పత్తి విడదీసినట్టు వదులుగా మంద్రంగా కదులుతున్నాయి మేఘాలు. సన్నగా చినుకు మొదలయ్యింది. పై పంచెను అరుంధతమ్మ మీద కప్పబోయి, ఏదో గుర్తొచ్చి ఆగిపోయాడు వీర్రాజు. ఇంత దగ్గరగా తనొచ్చినట్టు ఆమెకి తెలిస్తే.. ఇంకేపైనా ఉందా? నవ్వారు మంచం తీసుకొచ్చి, ఆమె మీద వాల్చాడు. చినుకు పడకుండా ప్లాస్టిక్ పట్టా మంచం మీద కప్పి, వెళ్లి చూరు కింద కూర్చున్నాడు. అతని పక్కనే సుబ్బు పడుకున్నాడు.

అరుంధతమ్మ సాయంత్రమే స్వర్గస్థురాలైంది. ఆమె తప్ప ఆ ఇంట్లో ఎవరూ లేరు. ఆ సందులో ఉన్న ఓ పదిళ్లవాళ్ళకీ కబురు అందచేశారు వీర్రాజు. అందరూ వచ్చి గుముగూడారు.

"పెళ్ళైన కొద్దికాలానికే భర్త కాలం చేసినా, అడద్దైనా మనోనిబ్బరంతో బతుకీడ్చుకొచ్చింది. ఎలా బతికింది? గొప్ప ధైర్యవంతురాలు. ఎవ్వరిసైనా చెలిమి కట్టనిచ్చిందా! ఒకమాటకి పదిమాటలు అప్పచెప్పేది. ఎంగిలి చేత్తో కాకిని కూడా తోలేది కాదు. ఈవిడ చివరి రోజులు ఎలా వెళతాయో అనుకున్నాం. కరివేపాకు నుంచి గోరింటాకు దాకా అన్నీ అమ్ముకునేది. చివరికి బాదంకాయలు, మందారపూలు కూడా అమ్మటమే. ఆవిడకి జీవనాధారం ఆ స్థలం, అందులో పండించే కూరగాయలు! పిల్లా పీచూ కూడా లేరు. దాచి ఏం చేస్తుందో?"

“కర్మకాండ ఎవరు చెయ్యాలి? ఆవిడ మరిది బెంగుళూరు నుంచి రావాలి. కబురందించాము. ఫ్లైట్ టికెట్టు కన్ఫర్మ్ ఐందిట, ఇహనో.. ఇంకాసేపట్లోనో వస్తాడు"

కాలనీవాళ్ళు రాత్రి ఒంటిగంట దాకా తలోరకంగా మాట్లాడుకుంటూ అక్కడే వున్నారు. ఒక్కరొక్కరే ఏదో కారణం చెప్పి మెల్లిగా జారుకున్నారు. అరుంధతమ్మ పక్కిల్లే కావడం వల్ల వీర్రాజు కాపలా కాయాల్సొచ్చింది.

దీపం కొండెక్కకుండా రెప్ప వెయ్యకుండా చూస్తున్నాడు వీర్రాజు. ఆమె ఇంట్లోకి వెళ్ళి, దుప్పటి దిండు తెచ్చి, ఆమె తలకింద దిండు పెట్టి దుప్పటి కప్పాడు. బతికి వున్నట్టైతే తన ఇంట్లో అడుగు పెట్టినందుకు శాపనార్థాలు పెట్టేది. చలనం లేని అరుంధతమ్మను చూస్తుంటే మనసు కంపించింది వీర్రాజుకి. సరిహద్దు గోడవైపు చూశాడు.

"గోడ పక్కనే వెధవ సంత. కోళ్లూ మేకలూ తినే మంద వచ్చి పడ్డారు. మడీ తడీ తెలిసేడిస్తేగా. ఇదిగో సుబ్బులూ! నీకెన్నిసార్లు చెప్పాను. బట్టలు ఈ గోడమీద ఆరేయద్దని. మీ ఆయన పైపంచె ఎగిరి నా మడి చీరకు తగిలింది. మళ్లీ స్నానం చేయ్యాలి!" విసుక్కుంటూ మంత్రాలు చదువుతోంది అరుంధతమ్మ.

"తగిలితే ఇంతలోనే ఏమైపోతుంది బాపనమ్మా. నీ చీర తీసుకుని లోపల ఆరేసుకో. అంతేకానీ నా మీద తగువుకొచ్చావంటే ఊరుకోను!" అంది సుబ్బులూ పెద్ద గొంతుకతో.

"ఆ వెధవ కుక్కల్ని పెంచటం ఏవిటో. నా ఇంటి తలుపు తోసుకుని నట్టింట్లోకి వచ్చి కూర్చుంటుంది. దాని తోడు కావాలని నేనన్నట్టుగా వచ్చి కూర్చుంటుంది. దాని మెడకి ఓ గొలుసు కట్టుకుని చావచ్చుగా!"

"ఏవమ్మా పెద్దావిడా.. మా సుబ్బు నిన్ను కరిస్తే, అప్పుడు చెప్పు ఇంజెక్షన్లు చేయిస్తాం! అంతేగానీ మా పెంపుడు కుక్కని వెధవ గిధవ అన్నావంటే ఊరుకోను!"అంది సుబ్బులు కోపంతో ఊగిపోతూ.

"ఊరుకో సుబ్బులూ, పెద్దావిడ ఏదో చాదస్తం. నువ్వే బట్టల్ని ఆపక్కన ఆరేస్తే సరిపోతుందిగా!" సర్ది చెప్పబోయాడు వీర్రాజు.

"ఆ పెద్దావిడకి పెద్ద మనసు ఎక్కడిది. పెద్ద నోరు మాత్రం ఉంది. ఆ నోటికి సుద్దీ బుద్దీ లేదు. ఎంతొస్తే అంతే మాట్లాడుతుంది. ఊరుకుంటుంటే ఇంకా పేట్రేగిపోతుంది. రోజూ ఈవిడతో పెద్ద బాధైపోయింది!" అంది సణుక్కుంటూ.

గత పాతికేళ్లుగా సాగుతున్న వివాదం. అరుంధతమ్మకు వాళ్లంటే చిన్న చూపు ఉందని ఆవిడకి మానవత్వమే లేదని సుబ్బులు ప్రగాఢ విశ్వాసం.

ఒకరోజు సుబ్బులు కొడుకు ఆరేళ్ళ రాజు, తల్లి కాలి మెట్టె తీసి ఆడుతూ నోట్లో పెట్టుకుని మింగేశాడు.

"ఓరి దేవిడోయ్.. బిడ్డ నా కాలిమెట్టె గుటుక్కున మింగాడు. ఆచారి బాబును తీసుకురావయ్యా మగడా!" అంటూ నోకాలు పెట్టింది సుబ్బులు. ఆచారి కోసం బయటకు పరిగెత్తాడు వీర్రాజు. వీధి వాకిలి దగ్గర నిలబడింది అనసూయమ్మ

“ఇదిగో వీర్రాజు!  ఈ మిగలముగ్గిన అరటిపళ్ళు .. తీసుకుని,  మీ వాడిచేత తినిపించు.  రేపటికల్లా మెట్టి కింద నుంచి బయటకొస్తుంది!" చిట్కా చెప్పింది అరుంధతమ్మ.

చిన్నవయసు కావడం వల్ల సుబ్బులుకి ఆ ఉపాయం తోచలేదు

"ఒరేయ్ వీర్రాజు! మంగలి అప్పన్నని రమ్మని కాస్త కబురు చేయరా!" అంది అరుంధతమ్మ గోడ దగ్గరకు వచ్చి తలమీద ముసుగు సవరించుకుంటూ.

"ఇట్టాటి వాటికి మా బాగా పనికొస్తాడు నా మొగుడు.  పైగా ఒరేయ్ అని పిలుస్తోంది చూడు.  ఆవిడినే అప్పన్నకి కబురు చేసుకోమను.  నువ్వు ఇల్లు దాటి ఎల్లావంటే ఊరుకోను!" అంది సుబ్బులు.

"ఎల్లనులేవే నువ్వూరుకో.  నీ మాటనేనెప్పుడన్నా కాదన్నానా?" అన్నాడు అరగంటలో పొది పట్టుకుని వచ్చాడు అప్పన్న

"ఈవిడ అదృష్టం ఏంటోగానీ.. ఈవిడ ఎవర్ని తలుచుకుంటే వాళ్ళు ఎలా వస్తారో.  మహిమలున్నాయేమో. మొన్నటికి మొన్న, మన కోడిపెట్ట గోడ దూకి ఆవిడ పెట్టిన వడియాలను ముక్కుతో పొడిచిందని నన్ను తిడుతూ, తడిబట్టతో చిందులేస్తోంటే కాలుజారి పడింది గదా.  బుర్ర బొక్క పడి బొటబొటా రక్తం కారుతుంటే.. ఆచారిగారు ఎట్టా ప్రత్యక్షం అయ్యాడో నాకర్థం కాలేదు!"అంది సుబ్బులు బట్టలు ఆరేస్తూ.

"దిక్కులేనివాళ్ళకి దేవుడే దిక్కు!"  అన్నాడు వీర్రాజు

"ఎనభై ఏళ్లు వచ్చినా ఈవిడ నోరు మాత్రం మూత పడలేదు.  రోజు నన్ను ఏదోటి అనందే,  ఈవిడ సుఖంగా నిద్రపోదు.  ఈ మహాతల్లి పీడ ఎప్పుడు విరగడవుతుందో సింహాద్రి అప్పన్నా.. నీకొండకొస్తానయ్యా.  నీకు వంద పొర్లు దండాలు పెడతానయ్యా!" సుబ్బులు పొద్దున్నే అన్న మాట సాయంత్రానికి నిజమైంది. అరుంధతమ్మ కళ్లూ, నోరూ శాశ్వతంగా మూతపడిపోయాయి.  ఇక ఆ వీధిలో గట్టిగా అరిచేవాళ్ళు లేరు. గోడ దగ్గర నిలబడి సవాళ్లు విసిరేవాళ్ళు లేరు.

తెలవారింది.  అరుంధతమ్మ మరిది రఘువీర్ వచ్చాడు. వీర్రాజే దగ్గరుండి ఏర్పాట్లన్నీ చేసాడు. “శవాన్ని స్నానం చేయించాలి వాకిట్లోకి  చేర్చండి” అన్నాడు పురోహితుడు.  నలుగురు పట్టి తీసుకొచ్చి వీధి అరుగు మీద పడుకో పెట్టారు. రెండు చేతులూ చీర చెంగులో ముడుచుకుని ఉన్నాయి. విడదీసి కడదామని లాగారు. బిగించి పట్టుకున్న చేతుల్లో సంచి కనబడింది.  బలవంతంగా లాగారు.  సంచి విప్పి చూస్తే, అందులో డబ్బులు, ఏవో కాగితాలు ఉన్నాయి.  లెక్కవేయగా రెండు లక్షలదాకా ఉన్నాయి.  కడుపు కట్టుకుని రూపాయి రూపాయి దాచి ఇంత కూడబెట్టిందా.. అని ఆశ్చర్యపోయారంతా.  ఉత్తరాన్ని తీసి చదివారు.

“యాభై ఏళ్లుగా ఒంటరిదానిగా  ఏకధారగా నేను కారుస్తున్న కన్నీళ్లను తుడవటానికి దేవుడిచ్చిన కొడుకూ, కోడలు వీర్రాజు సుబ్బులూ.  నా గ్రహచారమో ఏమో .. నేను ప్రేమగా ఎవరితో వున్నా వాళ్ళు నాకు దూరమై పోతారు.  అదేమి శాపమో... మా అమ్మ, నాన్న,  అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, నా భర్త నాకు ఎంతో

ఇష్టమైన వాళ్ళందరూ నాకంటే ముందే కాలం చేశారు.  అందుకే నేనెంతో అభిమానించే వీళ్ళిద్దరూ నాకు దూరం కాకూడదనే, నేను అవ్యక్తంగా ఉండిపోయాను. నాకేం కావాలన్నా, నా కొడుకు చేసిపెట్టేవాడో, కాదో తెలియదు గాని, వీర్రాజు మాత్రం నా అవసరాలు గుర్తించి నన్నాదుకున్నాడు.  ఈ నగదు, నేనుంటున్న ఈ ఇల్లు వీర్రాజుకి చెందేట్టు విల్లు రాశాను. నా తలకొరివి వీర్రాజు పెడితే నా ఆత్మ సంతోషిస్తుంది. అందుకు సుబ్బులు అడ్డు చెప్పకూడదని రోజూ భగవంతుడిని కోరుకుంటున్నాను!"

లేఖ చదవటం పూర్తయింది.  సుబ్బులు వంక చూశాడు వీర్రాజు.  అరుంధతమ్మ కాళ్ళ దగ్గర కూర్చుని ఏడుస్తున్న సుబ్బులు తలపైకెత్తి


"బాపనమ్మ ఆఖరి కోరిక నువ్వు తీర్చాలయ్యా!" అంటుంటే ఆమె గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

వీర్రాజు మనసు ఆర్ద్రమైంది.

***0***

కథా మంజరి


# అక్కరకు రాని చుట్టం



## వసుంధర

# అక్కరకు రాని చుట్టం

## వసుంధర



ఒక ఋషి కొన్ని వందల ఏళ్లు కఠోర తపస్సు చెయ్యగా - బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమన్నాడు. ఋషి ఆయనతో, "దేవా! ఎంతో నిష్ఠగా తపస్సు చేస్తే నన్ను కరుణించడానికి వందల ఏళ్లు తీసుకున్నావు. ఇది నీకు న్యాయమా?" అన్నాడు.

దానికి బ్రహ్మ, "నాయనా! నాకు రెప్పపాటు కాలం అంటే మీ మానవులకు లక్ష ఏళ్లు. ఆ లెక్కన చూసుకో - నా వరకూ నేను నీకు ఎంత త్వరగా ప్రత్యక్షమయ్యానో!" అని, "నీకేం కావాలో తొందరగా చెప్పు" అన్నాడు.

"నీ దర్శనం కాగానే సర్వం మర్చిపోయాను. వరం ఆలోచించుకుందుకు కొన్ని క్షణాలైనా వ్యవధి కావాలి" అన్నాడు ఋషి.

"సరే, ఐతే రెప్పపాటు కాలంలో వస్తాను" అని మాయమయ్యాడు బ్రహ్మదేవుడు....

ఈ కథ చదివినప్పుడు నాకు ఈ ఇరవయ్యొకటో శతాబ్దంలో, ఇంటర్నెట్లూ, మొబైల్సూ వంటి అత్యాధునిక సదుపాయాలతో వెలిగిపోతున్న మనిషికీ, కథలోని బ్రహ్మదేవుడికీ చెప్పలేనంత సామ్యం కనిపించింది. అసలేం జరిగిందంటే....

***

ఆఫీసుకి వెడుతూ మళ్లీ గుర్తు చేశాడు స్వరూప్, "నీ ఫ్రెండు నయనకు ఈ రోజైనా చెప్పడం మర్చిపోకు. విషయం చాలా అర్జెంట్"

'మర్చిపోకు' - అనడం మనసుకి కొంచెం కష్టం కలిగించింది. విషయం ఆయనకు ముఖ్యమైతే నాకూ ముఖ్యమే కదా - నిన్న రోజంతా నయన కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. దొరకలేదు.

దొరక్కపోవడం మర్చిపోవడం అనిపించుకుంటుందా?

ఈ మగాళ్లింతే! ఏదైనా చెప్పేటప్పుడు పెళ్లాలకి అపరాధ భావాన్ని అంటగట్టడం వాళ్ల జీన్సులోనే ఉన్నట్లుంది.

నేనా మాట అనలేదు. అసలే టెన్షన్లో ఉన్నాడు - ఇది వాదులాటకి సమయం కాదనుకుని, సరేనన్నట్లు తలూపాను. స్వరూప్ వెళ్లిపోయేక నయనతో కాంటాక్ట్‌లోకి రావడం ఎలాగా అన్న ఆలోచనలో పడ్డాను.

మాట కాస్త కరుకైనా స్వరూప్ వస్తుతః చాలా మంచివాడు. ఉత్త పుణ్యాన అడపా తడపా నన్ను దెప్పిపొడిచినా - ఆఫీసులో మహా నిజాయితీపరుడు. అవినీతికి ఆమడ దూరంలో ఉంటాడు. అదే అతడి కొంప ముంచింది.

లంచాలు తీసుకుందుకు అడ్డొస్తున్నాడని కొందరు అధికారులు కుమ్మక్కై, అతణ్ణి అన్యాయంగా ఓ ఫ్రాడ్‌లో ఇరికించి హెడ్డాఫీసుకి ఫిర్యాదు చేశారు. విచారణకి అతడి మీద ఓ కమిటీ వేసింది హెడ్డాఫీసు. అందులోని ముగ్గురు సభ్యుల్లో వితరణ్ ఒకడు. వితరణ్ నయన భర్త. నయన కాలేజిలో నా క్లాస్‌మేట్.

ఇలాంటి కమీటీల్లో నిష్పక్షంగా వ్యవహరిస్తాడని వితరణ్‌కి పేరుందిట. స్వరూప్ ప్రత్యర్థులకి వితరణ్ ఈ కమిటీలో సభ్యుడు కావడం ఇష్టం లేదు.

కమిటీ సభ్యత్వానికి మిగతా ఇద్దరూ తమ ఆమోదాన్ని తెలియబర్చారు కానీ, వితరణ్ ఇంకా బదులివ్వలేదు. అతణ్ణి ఆపడానికి స్వరూప్ ప్రత్యర్థులు పరోక్షంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పుడు స్వరూప్ నేరుగా వితరణ్‌తో మాట్లాడకూడదు. అతడికి కానీ, అతడి భార్యకి కానీ - ఫోన్లో మెసేజ్ ఇవ్వడానికి లేదు. ఎందుకంటే ఇది అవినీతిపై విచారణకి సంబంధించిన సున్నితమైన వ్యవహారం.

నయనతో మాట్లాడి విషయం చెప్పమని స్వరూప్ నాకు నిన్న ఉదయం చెప్పాడు. ఫోన్ చెయ్యడం కోసం తనకి తెలిసిన ఓ హోటలు బాయ్ నడిగి ఓ మొబైల్ తెచ్చాడు. ఆ బాయ్‌కి రెండు ఫోన్లున్నాయిట. స్వరూప్ తప్పుడు పనులకి వాడడన్న నమ్మకంతో - స్వరూప్‌కి తను తక్కువగా వాడే ఆ మొబైల్ ఇచ్చాడు.

నయన దినచర్య నాకు తెలుసు. ఉదయం ఇంటి పనులతో ఊపిరి సలపకుండా ఉంటుంది. ఆ సమయంలో ఫోన్ స్విచాఫ్‌లో ఉంటుంది. సాయంత్రం ఐదయ్యే దాకా ఆఫీసులో ఉంటుంది. ఆఫీసులో ఎక్కువగా మీటింగులలో ఉంటుంది. ఫోనేదైనా వస్తే కట్ చేసి తర్వాత మాట్లాడుతుంది. అదీ క్లుప్తంగా.

సాయంత్రం ఆరయ్యేసరికి తను, భర్త, పిల్లలు అంతా గూటికి చేరుకుంటారు. దాన్ని కాంటాక్ట్ చెయ్యడానికి అది బెస్ట్ టైం.

నేను నిన్న మధ్యాహ్నం నయన ఆఫీసుకి ఫోన్ చేశాను. కట్ చేసింది కానీ మళ్లీ చెయ్యలేదు. నేనే మళ్లీ రెండు ప్రయత్నాలు చేశాను. రెండు సార్లూ కట్ చేసింది. తను మీటింగులో ఉంటేనేం - తర్వాత చెయ్యొచ్చుగా అని నొచ్చుకున్నాను కానీ అవసరం నాదిగా - అందుకని కాస్త పాజిటివ్‌గా ఆలోచించాను.

నేను చేసిన నంబరు నయనకి అపరిచితం. ఈ మధ్య ఫోనుల్లో అపరిచితుల కాల్స్ ఎక్కువయ్యాయి. వాటిని పట్టించుకోవద్దని హెచ్చరిస్తూ సోషల్ మీడియాలో టపాలు సర్క్యులేటౌతున్నాయి.

చేసింది నేనని తెలిస్తే అది తప్పక రెస్పాండయ్యేదనుకుని - సాయంత్రం ఆరున్నరకి ఫోన్ చేశాను. ఎంగేజ్ వచ్చింది. గంటాగి మళ్లీ చేశాను. మళ్లీ ఎంగేజ్ వచ్చింది. చిరాకొచ్చింది కానీ - ఈ రోజుల్లో ఎవర్ని చూసినా ఎప్పుడూ ఫోన్లు చెవి దగ్గరుంచుకునే కనబడుతున్నారు. అంటే చాలామంది ఎప్పుడూ ఎవరో ఒకరికి ఫోన్ చేసి మాట్లాడుతున్నారనేగా! ఇక నా విషయానికొస్తే - ఎవరైనా నాకు ఫోన్ చేస్తే ఒకోసారి గంటకి పైగా మాట్లాడుతుంటారు. నయనకీ అలాగయిందేమో!

నిన్న సాయంత్రం నయనకోసం నేను చేసే ప్రయత్నాలన్నీ స్వరూప్ గమనిస్తూనే ఉన్నాడు. కానీ కిమ్మనలేదు. నేనే విసుగొచ్చి, "నా రెగ్యులర్ మొబైల్ వాడనా?" అనడిగాను. దానికి అతడు, "హమ్మో! ఆ పని మాత్రం చెయ్యకు" అనేశాడు.

ఇంతా జరిగేక ఈ రోజు ఆఫీసుకి వెడుతూ - 'నయనకి చెప్పడం మర్చిపోకు' - అని హెచ్చరించాడు.

అతడిపై కోపగించుకుని ఏంలాభం - ఉదయం పదకొండుకి మళ్లీ నయనకి ఫోన్ చేశాను.

అదృష్టం - అది ఫోన్ తీసింది. చేసింది నేనని తెలిసి, "అయ్యో - నువ్వా! ఎవరా, జిడ్డులా వదలకుండా ఇన్ని సార్లు ఫోన్ చేస్తున్నారని తెగ విసుక్కున్నాను. ఇప్పుడైనా నంబరు చూస్తే కట్ చేసుండేదాన్ని. మీటింగుకెడుతూ హడావుడిలో అప్రయత్నంగా రెస్పాండయ్యాను. ఇంతవరకూ కట్ చేసినందుకు సారీయే!" అంది నయన.

"మన మధ్య సారీలెందుకులే, కానీ అర్జంటుగా నీకొకటి చెప్పాలి. మీటింగుకి ఆలస్యమైపోదుగా!" అన్నాను.

"భలేదానివే - నీకంటే నాకు మీటింగులెక్కువా!" అంది నయన ఆత్మీయంగా. విషయం చెప్పగానే అదెంత అర్జంటో గ్రహించి, "వితరణ్‌కి వెంటనే మెసేజ్ పంపేదా?" అంది.

"మెసేజ్ వద్దు. స్వయంగా చెప్పు" అన్నాను.

"అంత భయమేమిటే - ఇప్పుడు నువ్వు ఫోన్లో చెప్పింది మాత్రం ఎక్కడో రికార్డై ఎవిడెన్సుగా ఉపయోగపడదని ఏముంది?" అంది నయన.

"ఏమో - స్వరూప్ చెప్పాడు. ఎందుకు చెప్పాడో ఏమో - అదే ఫాలో ఐపోతే పోలా!" అన్నాను.

"సరేలే - నాకు మతిమరుపు జాస్తి. ఏమనుకోక, సాయంత్రం ఓసారి గుర్తు చెయ్యి. నంబరు తెలిసిందిగా, ఈసారి రెస్పాండవుతాలే!" అంది నయన.

ఎందుకైనా మంచిదని ఆ సాయంత్రం ఆరున్నరకి నయనకి ఫోన్ చేశాను. ఎంగేజి. ఏడుకి మళ్లీ చేశాను. ఎంగేజి. ఎనిమిదికి చేస్తే తెలిసింది. అమెరికా నుంచి దాని చెల్లెలు కాల్ చేసి గంటపైన మాట్లాడిందిట. "ఏదో గుర్తు చెయ్యమన్నాను కానీ, నాకే గుర్తుంది. చెల్లాయ్ కాల్ అవగానే చెబుదామనుకున్నాను. ఇప్పుడు వితరణ్ ఆస్ట్రేలియాలో ఉన్న వాళ్లన్నయ్యతో కాల్‌లో ఉన్నాడు. అవగానే చెబుతాను" అంది.

రాత్రి తొమ్మిదిన్నరకి మళ్లీ నయనకి ఫోన్ చేశాను. "తను ఫోన్లో ఉండగా సైగలు చేశానని - పాపం, వితరణ్ తనే కాల్ తొందరగా కట్ చేసి నా దగ్గరకొచ్చాడే - సరిగ్గా అప్పుడే నేను అమ్మతో ఫోన్లో ఉన్నాను. ఐనా నాకు గుర్తుందిగా, రాత్రి పడుకునేలోగా వితరణ్‌కి విషయం చేరేస్తానుగా. నువ్వింక ఫోన్లు చెయ్యకు" అని బదులిచ్చింది నయన.

రాత్రి పడుకునేటప్పుడు స్వరూప్ అడిగాడు, నయన ఏమందని! అబద్ధమాడలేక ఉన్నదున్నట్లు చెప్పాను. "నువ్వు మేటరెంత సీరియస్సో చెప్పినట్లు లేదు. లేకపోతే మీ నయన ఇలా జాప్యం చేసే మనిషి కాదు" అన్నాడు. నొచ్చుకున్నాను కానీ, భర్త కదా - పాపం, టెన్షన్లో ఉన్నాడని జాలిపడ్డాను.

మర్నాడు నయన ఆఫీసుకి ఫోన్ చేస్తే - “నిన్నంతా ఫోన్లతోనే సరిపోయిందే! ఆపైన పిల్లల హోంవర్క్కొకటి. మేమిద్దరం ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదంటే నమ్ము. ఈ సాయంత్రం తప్పక చెబుతానుగా” అంది నయన.

నాలో భయం మొదలైంది. స్వరూప్ కేసునుంచి తప్పించుకుంటాడా అని కాదు - నన్ను తప్పు పట్టకుండా ఉంటాడా అని!

ఆ సాయంత్రం కూడా సేమ్ స్టోరీ. అది చెబుదామనుకున్నప్పుడు అతడు ఫోన్లో. అతడు అడుగుదామనుకున్నప్పుడు అది ఫోన్లో. ఇంకా టివి, పిల్లల హోంవర్కులు వగైరా వగైరాలు.

నయన డ్రామాలాడదని నాకు తెలుసు. కానీ నేడు టివి, ఇంటర్నెట్టూ, మొబైల్ ఫోన్లూ ప్రపంచాన్ని ఎంత కుదించినా, అవి మనిషి తనని తాను సాటి మనిషినుంచి వేరు చేసుకునేందుకే ఎక్కువ సహకరిస్తున్నాయి. ఆ విషయం ప్రతి ఒక్కరికీ స్వానుభవమే! అక్కరకు రాని చుట్టం లాంటివే కాబోలు ఈ మొబైల్సు కూడా మరి!

అలా ఇంకో రోజు గడిచిపోయేక బాంబు పేలింది - వితరణ్ ఆఫీసు పనిమీద విశాఖపట్నం వెళ్లాడని.

“మళ్లీ ఎప్పుడొస్తాడు?” నిరాశా నిస్పృహలతో అడిగాను.

“ఎల్లుండి ఆదివారం రాత్రికి” అంది నయన.

“అయ్యో! సోమవారంకల్లా అతణ్ణించి రెస్పాన్సు లేకపోతే - కమిటీలో వేరే మెంబర్ని వేస్తారుట” దిగులుగా అన్నాను.

“అలా దిగులు పడకే! ఇక్కడున్నప్పుడు కుదరదు కానీ - టూర్లో ఉన్నప్పుడు మేమిద్దరం గంటల తరబడి మాట్లాడుకుంటాం తెలుసా? ఒక విధంగా ఇది బ్లెస్సింగ్ ఇన్ డిస్‌గైస్ అనుకో!” అంది నయన.

నాకు చాలా ఉత్సాహమొచ్చింది. “థాంక్యూ వెరీమచ్” అని అప్పటికి ఫోన్ పెట్టేశాను.

మర్నాడు సాయంత్రం అదే నంబరుకి - తనే ఫోన్ చేసి, “వితరణ్‌కి చెప్పానే! ‘అయ్యో, ఎంత మాట - తప్పక సాయం చేస్తానన్నాడు. ఐతే తనకి ఇలాంటి కమిటీలు రెండింటి నుంచి ఉత్తరాలొచ్చాయిట. రెండూ ఒకే రోజున మీటవుతాయిట. ఏ కమిటీకి ఓకే చెయ్యాలీ అన్న మీమాంసలో పడి వెంటనే బదులివ్వలేదుట. ‘జాప్యం చెయ్యడం మంచిదే అయింది. మనవాళ్లకి కలిసొచ్చే కమిటీకే ఓకే చెబుతాను’ అన్నాడు వితరణ్. ఎటొచ్చీ వాటిలో మీ ఆయన కమిటీ ఏదో తనకి తెలియలేదు. ఉత్తరంలో కమిటీలకి కోడ్ నంబర్లు మాత్రం ఇచ్చారుట. అర్జంటుగా ఆ కోడ్ నంబరు చెప్పమన్నాడు” అంది.

నాకుత్సాహం వచ్చింది.

స్వరూప్‌కి విషయం చెబితే, “కోడ్ నంబరు నాకు తెలియదు. ఆ ఫైలుతో డీల్ చేసేది విష్ణు. తను నాకు శ్రేయోభిలాషి. ఈ కమిటీ గురించీ, మెంబర్సు వ్యవహారం గురించీ తనే నాకు చెప్పాడు. ఉండు, తనకోసారి ఫోన్ చేస్తాను” అన్నాడు.

“మరి నువ్వు తనకి ఫోన్ చేస్తే, ఎవరూ ట్రాక్ చెయ్యరా?” అనుమానమొచ్చి అడిగాను.

"మేమిద్దరం ఒకే ఆఫీసులో పని చేస్తున్న కొలీగ్సుమి. మెసేజిల్లో దొరక్కూడదు కానీ, ఫోన్ల విషయంలో మాకు ఇబ్బంది లేదు!" అంటూ విష్ణుకి ఫోన్ చేసి చాలా గుంభనంగా విషయం చెప్పాడు.

"అదో సమస్య కాదు. రేపు నేనెలాగూ ఆఫీసులో ఓవర్ టైం చేస్తున్నాను. నువ్వూ వస్తే నాకు కొంచెం సాయంగా ఉంటుంది!" అని విష్ణు తనూ స్వరూప్‌కి గుంభనంగా చెప్పాడు.

మర్నాడు మధ్యాహ్నానికి ఆ కోడ్ నంబరు నోటిమాటగా నాకు చేరింది. నేను వెంటనే నయనకి ఫోన్ చేసి, "ఎక్కడా నోట్ చేసుకోకు. మనసులో గుర్తు పెట్టుకుని మీ ఆయనకి చెప్పు" అంటూ కోడ్ చెప్పాను.

"నాకు నా మెయిల్ పాస్‌వర్డ్‌లే కాసేపటికి గుర్తుండవు. రాత్రి దాకా ఇది గుర్తు పెట్టుకుని తనకి చెప్పలేను. నువ్వే రాత్రి పదింటికి ఓసారి ఫోన్ చేసి నాకు మరోసారి చెబుదూ" అంది నయన.

"రాత్రి దాకా ఎందుకూ - ఇప్పుడే తనకి చెప్పొచ్చుగా" అన్నాను.

"తను ఇప్పటికే తిరుగు ప్రయాణానికి ఎయిర్‌పోర్టులో ఉన్నాడు. విమానమెక్కేలోగా ఆఫీసు వాళ్లతో మొబైల్‌లో ఇంపార్టెంట్  డిస్కషన్సు ఔతున్నాయిట. ఏమైనా చెప్పాల్సిందుంటే ఇంటికొచ్చాకేనన్నాడు" అంది నయన.

బ్రహ్మదేవుడి కథ గుర్తొచ్చి - వ్యవహారం మళ్లీ మొదటికి రాలేదు కదా - అనుకున్నాను.

ఐతే స్వరూప్‌కేమౌతుందన్న బెంగ కంటే - అతడు నన్నేమంటాడోనన్న భయమే ఎక్కువగా నన్నావహిస్తే అది వేరే సంగతి!

***

# వికృతి వధ్యస్థలి నుంచి ప్రకృతి ఒడిలోకి

సింహ ప్రసాద్



**స్కూ**లు నుంచి ఫోన్ కి ఏదో సందేశం రాగా ఆత్రంగా చూసింది మాధురి.

ఒక విద్యార్థి చనిపోయినందున స్కూలుకు సెలవు ఇచ్చామనీ, ఒక్క అరగంటలో బస్సులు బయల్దేరతాయనీ సమాచారం. ఆమె మనస్సు వేదనతో బరువెక్కింది. ఆ కుర్రాడి తల్లిదండ్రులు బాధతో ఎంతగా సుళ్ళు తిరిగి పోతున్నారో పాపం - అని బాధ పడింది. కమ్యూనిటీ గేట్ దగ్గరి కెళ్ళింది. బస్సు రాగానే ఆరేళ్ళ హంసని పికప్ చేసుకుంది.

“హత్య చేయడం అంటే ఏమిటి మమ్మీ" చటుక్కున అడిగింది హంస.

“బలవంతంగా చంపెయ్యడం"

“ఎందుకు చంపుతారు?"

“మూర్ఖత్వం. డబ్బు పిచ్చి. అసూయ, ద్వేషం, కక్ష - ఏదైనా కారణం కావచ్చు. ఇదంతా ఎందుకు అడుగుతున్నావు?”

“మా స్కూలు అబ్బాయిని వాళ్ళ బంధువులు హత్య చేశారంట. వాడు మంచోడమ్మా. మేం బోల్డు సార్లు ఒకే జట్టులో ఆడుకున్నాం”

దిమ్మెరబోయింది. ఆ ఘటన కూతురి లేత మనస్సు మీద దుష్ప్రభావం చూపుతుందేమోనని భయపడింది.

“అసలేం జరిగిందో ఏమో. అవన్నీ మనకెందుకులే. ఆ గొడవ మర్చిపో. ఇంకెప్పుడూ ఆ పిల్లాడి వూసెత్తకు" మందలింపుగా చెప్పింది.

ముఖం ముడుచుకుని తలాడించింది హంస.

ఆఫీసు నుంచి ఉత్సాహంగా వచ్చాడు సుధాకర్. “ఈ శుక్రవారం మనం మా చెల్లెలిగారి ఊరుకెళ్తున్నామోచ్'

“ఏదైనా ఫంక్షనా?"

“కాదు మహా విందు. మారెమ్మకు మేకపోతుని బలిస్తున్నారు"

అదిరి పడింది. “ఆవిడెవరు?"

“ఆ ప్రాంతంలోని శక్తివంతమైన గ్రామదేవత. ఆమెకి మొక్కుకున్నాకే మా చెల్లెలికి నెల తప్పింది. పండంటి బిడ్డ పుట్టాడు"

"జంతు బలుల్ని ఎప్పుడో నిషేదించారుగా. పైగా ఏ అమ్మా జీవహింస కోరుకోదు. దాని బదులు అన్న సంతర్పణ చేస్తే మంచిది"
"ఆ అమ్మవారికి బలులే ఇష్టం. ఎక్కడెక్కడ్నుంచో భక్తులు వస్తూంటారు తెలుసా. మేకని కొనడం నుంచి కూరలు వండించడం వరకూ అన్ని బాధ్యతలూ నా మీదే పెట్టాడు మా బావ"
"వండటం ఏవిటి? బలిచ్చి అక్కడే వదిలెయ్యరా?"
"నువ్వెక్కడి అమాయకురాలివోయ్. బలిచ్చేక, దాన్ని అక్కడే కూర వండుకుని, తినేసి రావాలి. ఇంటికి తెచ్చుకోకూడదు. అందుకు కావాల్సిన ఏర్పాట్లు, భోజన హాలు అన్నీ అక్కడున్నాయి" నవ్వాడు.
హంస, తన స్కూలు మిత్రుడి గురించి చెప్పబోతే ఆపి, "నీకు మటన్ ధమ్ బిర్యానీ ఇష్టమా, మటన్ మ్యాంగో కర్రీ ఇష్టమా, మటన్ ఫ్రై ఇష్టమా?" అడిగాడు.
హంస ఎటూ చెప్పలేకపోయింది. పకపకా నవ్వాడు.
"నాకు తెలుసులే. మా చిన్నారి హంసకి అన్నీ ఇష్టమే. అందుకే అన్నీ వండించేస్తాను. మనిద్దరం పోటీ పడి తినేద్దాం..."

భర్త వంక కించిత్తు నిరసనగా వికారంగా చూసింది మాధురి. ఎందుకో కడుపులో దేవినట్టుగా ఉందామెకి. అతడు భోజన ప్రియుడని తెలుసు. మాంసాహారం మరీ మరీ ఇష్టమనీ తెలుసు. వారంలో రెండుసార్లు ఇంట్లో వండినా, ఇంకో నాలుగైదు సార్లు హోటల్స్ లో, ఆఫీసు క్యాంటీన్లో తింటూ వుంటాడు. మనిషి అడ్డంగా పెరుగుతున్నాడు. ఎనభై కేజీల మార్కు దాటేశాడు. అయినా తిండి యావ తగ్గలేదు.!

"మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి" అంటే, "ఏం ఫర్లేదు. పది రోజులు జిమ్ కెళ్తే స్లిమ్ అయిపోతాను గాని బెంగ పెట్టుకోకు. యూట్యూబ్ లో ఇతర దేశాల మాంసాహార వంటకాల గురించి చక్కని వీడియోలు పెట్టారంట. మా ఫ్రెండ్ చెప్పాడు. అవన్నీ చూసి, రోజుకో కొత్త రకం వండెయ్...." అని ఆర్డరేస్తాడు. కాదంటే సర్రున కోపం వచ్చేస్తుంది!

ఊళ్ళో దిగటం ఆలస్యం బావగార్ని తీసుకుని ఊరి మీద పడ్డాడు సుధాకర్, రెండు మూడు చోట్ల మేకల్ని చూసి, లేతగా బలంగా ఉన్న మేకని కొనిపించాడు.
"దగ్గర దగ్గర వందమంది భోజనానికి వస్తారంటున్నావ్. ఈ మేకపోతు ఒక్కటీ సరిపోదు బావా. పది కోళ్ళను కూడా కోయిద్దాం. ఓ పది కేజీల టైగర్ రొయ్యలు కొని బిర్యానీ చేయిద్దాం, అదిరిపోద్ది!" అని ఒప్పించడమే కాదు, వంటతనికి ఏమేం వండాలో, ఎలా వండాలో పురమాయించేశాడు సుధాకర్.
"శాకాహారులుండొచ్చు. పప్పు, ఒక కూర వండమను"

పడీపడీ నవ్వాడు సుధాకర్. “భలేవాడివి బావా. ఆదివారం అంటేనే నాన్ వెజిటేరియన్ డే. ముక్కు మూసుకునే మునులెవ్వరూ ఉండరు గాని, గారెలూ వండిద్దాం. చికెన్ కర్రీకి అదే చక్కని జోడీ!” అన్నాడు ఊరిపోతూ,

మర్నాడు బంధుమిత్రుల్తో కలిసి రకరకాల వాహనాల్లో మారెమ్మ గుడి ఉన్న గ్రామానికెళ్ళారంతా. తాడుతో కట్టి వుంచిన మేక 'మే… మే…' అని అరుస్తోంటే హంసతో సహా పిల్లలంతా దాని చుట్టూ చేరి దానిని అనుకరిస్తూ అరుస్తున్నారు. వారి గోల విని, అక్కడి కెళ్ళింది మాధురి. మేక నల్లగా చిన్నగా ముచ్చటగా ఉంది. ఇంకొద్ది సేపట్లో చావబోతున్న ఆ మేకపిల్ల వంక బాధగా జాలిగా చూసింది. 'ఇవాల్టితో దీని ఆయుషు ముగిసిపోతుంది పాపం!' అనుకుంది.

మరి కాస్సేపటికి గణాచారి వచ్చాడు. మేక మెడలో వేప రొబ్బలుకట్టాడు. ముఖాన పెద్ద బొట్టు పెట్టాడు. డప్పులు మోగుతోంటే, కాళ్ళ గజ్జెలు ఘల్లున మోగుతోంటే, చిన్నగా చిందేస్తూ మారెమ్మ గుడి ముందుకెళ్ళారు. మేకకు హారతులిచ్చారు. అంతా చూస్తూండగానే పెద్ద కత్తి తీసుకుని మేక మెడ తెగ నరికారు. అది గుండెలవిసేలా అరిచింది. రక్తం ఫౌంటెన్లా చిమ్మింది. ఆ భీభత్స దృశ్యం చూసి కెవ్వుమంది హంస. పరుగునొచ్చి హంస కళ్ళు మూసేసింది మాధురి. ఆ సరికే ఎగిరి పడుతోన్న మేక తలనీ, కొట్టుకుంటోన్న మొండాన్నీ చూసిందేమో, భయంతో గజగజ వణకుతూ వెక్కివెక్కి ఏడవసాగింది హంస.
“పిల్లల్ని ఇక్కడికెందుకు రానిచ్చారు?” గద్దించాడో పెద్దాయన.
కూతుర్ని, భోజనశాలకు ఆనుకుని వున్న రూంలోకి తీసుకుపోయి ధైర్యం చెప్పింది మాధురి. అయినా తల్లిని కరుచుకునే వుంది హంస.
మేకనీ, కోళ్ళనీ ముక్కలుగా కోసి వంట పనిలో పడ్డారు వంటవాళ్ళు. వారికి సూచనలిస్తూ అక్కడే తిష్ఠ వేశాడు సుధాకర్. మరో పక్క మగాళ్ళు పేకాటలోనూ, ఆడవాళ్ళు ముచ్చట్లలోనూ మునిగి పోయారు. పిల్లలు 'దాగుడుమూతలు' ఆడుకోసాగారు. ఎవర్తోనూ సంబంధం లేనట్టు గదిలో మాధురి, హంస ఇద్దరే ఉన్నారు. కూతుర్ని గుండెలకు హత్తుకునే వుంది. ఇద్దరి కళ్ళల్లోనూ ఆ భయంకర జుగుప్సాకర దృశ్యం మళ్ళీ మళ్ళీ కదుల్తోంటే భయవిహ్వలురై బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.

“అలా ఉన్నావేం వదినా" ఆడబడుచు వచ్చి అడిగింది.
నీళ్ళిమ్మని సైగ చేయగా, నీళ్ళ సీసా తెచ్చిచ్చింది. కూతురికి పట్టించి, మిగతావి తను తాగేసింది.
“దెయ్యాన్ని చూసినట్టు భయపడుతున్నావేంటి వదినా?”
"నేనిక్కడ ఉండలేను. ఇంటి కెళ్ళిపోతాను. ఏదో వాహనం మీద మమ్మల్ని పంపించెయ్. ప్లీజ్….”
“అమ్మవారి ప్రసాదం తినకుండా ఎలా వెళ్తారు?"

“నా కడుపులో దేవుతోంది. తల తిరుగుతోంది..."
“అన్నయ్యేమంటాడో...”
“ఏమీ అనరు. హంస చూడు చలిజ్వరం వచ్చినట్టు వణకిపోతోంది”
మరేమీ అన్లేక ఒక కారులో వారిని ఇంటికి పంపేసింది.

భోజనాలయ్యాయి. వంటలు అదిరిపోయాయంటూ అంతా సుధాకర్ని మెచ్చుకున్నారు. అతడు పొంగిపోయాడు. సుష్టుగా తిన్నాక మాధురి, హంస గుర్తొచ్చారతడికి.
ఇంటి కెళ్తూనే, “మాధురీ, హంసకెలా ఉంది?" ఆరా తీశాడు.
"జడుసుకుందండీ"
“ఆ మాత్రానికే? అయినా దాన్నెందుకు అక్కడి కెళ్ళనిచ్చావు?" కయ్ మన్నాడు.
“పిల్లల్తో వెళ్ళింది. అంత బాహాటంగా బలిస్తారని నేనూ ఊహించలేదు”
“భలేదానివేలే. నీది చాలా పెద్ద దురదృష్టం. గొప్ప విందు మిస్సయ్యావు. అన్నీ ఎంత చక్కగా కుదిరాయనీ. జనం ఊది పారేశారంటే నమ్ము" అతడు విందు విశేషాలు నోరూరేలా చెప్పుకు పోతోంటే మౌనంగా ఉండిపోయింది మాధురి.
“వదినా, ఏమైనా తిన్నావా లేదా” అంటూ వచ్చింది ఆడబడుచు. ఆకలిగా లేదంటున్నా విన్పించుకోకుండా హోటల్నుంచి చపాతీ తెప్పించింది. ఆమె బలవంతం మీద కొంచెంగా తింది. హంస మాత్రం నోరు తెరవలేదు. సాయంత్రానికి ఫెళ్ళున జ్వరం వచ్చింది హంసకి. 'చంపొద్దు' అంటూ కలవాట్లు పలుకుతోంటే భయపడి పోయారు. డాక్టర్ కి చూపించారు. మర్నాటికి జ్వరం తగ్గింది గాని బాగా నీరసపడింది. ఒక్క రోజుకే ఎందుకింతగా డీలా పడిందో ఎవరికీ అర్థం కాలేదు.

అవాళే ప్రయాణమై వచ్చేశారు. ఇంట్లో అడుగు పెట్టగానే హంసలో ఉత్సాహం పొంగి పొరలింది. భయాలన్నీ పటాపంచలు కాగా ముఖం తేటబడింది. మార్కెట్ కెళ్ళి కోడి మాంసం, పేట మాంసం తెచ్చాడు సుధాకర్.
“మొన్న ఊళ్ళో మీరు తినలేదు కదాని రెండూ తెచ్చాను. ఎన్ని రకాలుగా వండుతావో నీ ఇష్టం"
“మాకోసం తెచ్చారా, మీ కోసం తెచ్చుకున్నారా” నవ్వుతూ చురక వేసింది మాధురి.
“మన కోసమోయ్. చికెన్లో పెరుగు వేసి రోటీ కర్రీ వండి, బట్టర్ నాన్లు చెయ్. మటనేమో ఫ్రై చెయ్యి, కాంబినేషన్ అదిరిపోద్ది" లొట్టలేశాడు.
“అలాగే వండుతాను గాని జిహ్వాని కాస్త కంట్రోల్లో పెట్టుకోండి”
“ఎన్నో కర్రీలు తలచుకుంటే చాలు నోరూరిపోకుండా, లాలాజలం కారకుండా ఎవరికైనా ఎలా ఉంటుంది చెప్పు? ఉంటే గింటే వాళ్ళు రుచి తెలీని, అభిరుచి లేని పెధవాయిలై వుంటారు"
“మళ్ళీ అదొకటా!" అంటూ వంటింట్లో కెళ్ళింది మాధురి.

కడగటానికి మాంసాన్ని గిన్నెల్లో వేయబోయిందల్లా ఆగిపోయింది. రక్తమంటిన మాంసాన్ని చూసేసరికి మేక జాలి చూపులు, చేసిన ఆర్తనాదం, చిమ్మిన రక్తం – కళ్ళముందు కదిలాయి. భయభ్రాంత అయింది.
ఇంతలో కెవ్వుమని అరిచింది హంస. తల్లిసేదో అడగటానికి అక్కడి కొచ్చిందామె! నిలువెల్లా వణికిపోతున్న కూతుర్ని చూసి, మాంసాన్ని నల్లని కవర్లో కుక్కేసి ఓ మూలకి తోసేసింది.
"ఏమైంది తల్లీ..." మోకాళ్ళ మీద కూర్చుని హంసని హత్తుకుంటూ అడిగింది.
"మేకని హత్య చేశారు! మేకని చంపేశారు!" అరుస్తూ ఏడుస్తూ గోల చేస్తోంటే, హాల్లోంచి సుధాకర్ పరుగున వచ్చాడు.
మేకని తాను చంపలేదనీ, చచ్చిన మేక మాంసాన్ని కొని తెచ్చాననీ నమ్మించడాని కెన్నో చెప్పాడు. కాని హంస విన్పించుకోలేదు. మాధురి కూడా పిచ్చి చూపులు చూస్తూండటం చూసి కంగారు పడ్డాడు.
"అలా అయిపోయావేంటి మాధురీ. నీకూ, బలిచ్చిన మేక గుర్తొచ్చిందా?" కుదుపుతూ అడిగాడు.
"వద్దండీ వద్దే వద్దు. ఆ హత్యలూ ఈ మాంసాలూ మనకి వద్దే వద్దు. ఇంకెప్పుడూ తేనని ప్రామిస్ చెయ్యండి" కన్నీళ్ళతో చెంపలు తడిసిపోతోంటే బేలగా అర్థించింది.
"మీరేదో భ్రమలో ఉన్నారు. రెండ్రోజుల్లో అంతా అదే సర్దుకుంటుంది. నాకెంతో ఇష్టమైన మాంసాహారం మానటం నా వల్లకాదు" ఖండితంగా చెప్పేశాడు.
"మానలేకపోతే హోటల్ కెళ్ళి పీకల్దాకా మెక్కండి. అంతే తప్ప గడప దాటి ఇంట్లోకి తీసుకు రావడానికి వీల్లేదు" స్ప్రింగులా లేచి మాంసపు సంచుల్ని తీసుకుని బాల్కనీ లోంచి రోడ్డు పక్క చెత్తకుండీ లోకి విసిరేసింది.
"నీకు మతిపోయిందా? నువ్వేం చేస్తున్నావో నీకు తెలుస్తోందా?" కోప్పడ్డాడు.
"తెలుసు. ఇక నుంచి నో మటన్. నో చికెన్. నో ఫిష్. ఓన్లీ వెజిటేరియన్ ఫుడ్..." అంటూ వెళ్ళి హంసని సందిట్లోకి తీసుకుని బుజ్జగించింది. "ఇంకెప్పుడూ రక్తమాంసాలు మనింట్లో కనబడనివ్వను. నా తల్లివి కదూ. అదంతా పీడకల అనుకుని మర్చిపో హంసా"
నుదురు కొట్టుకుంటూ విసురుగా బయటి కెళ్ళిపోయాడు సుధాకర్,
ఆదివారం ఉదయమే అడిగాడు "నిజంగానే ఎన్వీ తేవద్దా?"
"మీకో నమస్కారం" ఠపీమని చేతులు జోడించి చెప్పింది.
"మేకల్లా ఆకులూ అలమూ తినాలా?" రోషంగా అన్నాడు.
"మేక వూసెత్తకండి, నాకు పూనకం వచ్చేస్తుంది" కళ్ళెర్రజేస్తూ అరిచింది. "కోళ్ళనే తింటారో, కుక్కల్నే తింటారో బయటికి పోయి తినండి. ఇంక ఈ ఇంట్లో హింసకీ, రక్తానికీ స్థానం లేదు" తెగేసి చెప్పింది,
"మీతో బాటు నన్నూ మాడ్చేస్తారన్న మాట"

“మాడ్చం. మీ ఆరోగ్యం బాగుజేస్తాం. అసలే ఊబర ఊబర మంటూ ఉన్నారు. మాంసాహారం మానేస్తే కొవ్వు కరిగి, ఒళ్ళు తగ్గి, ఆరోగ్యంగా ఉంటారు. వ్యాధులూ వైరస్సులూ మన దరికి చేరవు. నా మాట విని మీరూ శాకాహారిగా మారిపోండి"

తప్పట్లు కొడుతూ హేళనగా నవ్వాడు. “వెజిటేరియన్ అయితే చాలా, వీగన్ గా మారాలా?"

“అదేంటి?"

“వీగన్లు జంతు సంబంధిత ఉత్పత్తులేవీ తినర్లే. గుడ్లు తినరు. ఆవు, గేదె పాలు తాగరు. కేవలం సోయా మిల్క్లాంటివే తాగుతారు"

“అంతక్కర్లేదు. గుడ్లు మానేస్తే చాలు"

“నా తరం కాదు. మీరు జైనుల్లా జీవహింస మహాపాపం అని జపిస్తూ కూర్చోండి. నన్ను మాత్రం ఆ ఊబిలోకి లాగకండి. కంటి కి నచ్చిన తిండి, నాలుక కోరిన తిండి, మనస్సు పడ్డ తిండి తృప్తిగా తిననివ్వండి"

“మీరు ఫుడీ అని తెలుసు. కానొక్కటి ఆలోచించండి. మన ఆహారం కోసం ఇంకో ప్రాణిని బలి తీసుకోవాలా? అడవిలో ఉంటున్నా సాధు జంతువులు గడ్డీ గాదం తిని సంతృప్తిగా బతకడం లేదూ? ఇతర జంతువుల్ని చంపి మాంసం తింటాయి గనుకే సింహం, పులి లాంటి వాటిని క్రూర జంతువులంటారు. మనమూ అలాంటి పనే చేస్తే మనల్ని క్రూర మానవులు లేదా రాక్షసులు అనాలి. నా మాట విని మీరూ శాకాహారిగా మారండి. ఈ మధ్య మీరెక్కువగా పుష్టిగా ఉంటున్నారు. అసహనంతో చిన్న దానిక్కూడా పెద్దగా అరుస్తున్నారు. అది ఆ తిండి ప్రభావమే. రజ, తమో గుణాలు తగ్గి సాత్విక గుణం పెంపొందాలంటే సాత్వికాహారం ఎంతో మంచిదండీ"

త్రాచులా లేచాడు. “నేనేం తినాలో నాకు తెలుసు. నేనేం చెవిలో పువ్వులు పెట్టుకోలేదు నీ ప్రవచనాలు విని తలూపడానికి. నా దారికి అడ్డొస్తే సహించను. ఎవరన్నది కూడా చూడను. ఖబడ్దార్!"

అతడి మాటలకు మాధురీ, అతడి వికృత రూపానికి హంసా ఘ్రాన్పడిపోయారు.

రోజు ఏదో రూపాన ఇంట్లో ఆ చర్చ తలెత్తుతూనే ఉంది.

సుధాకర్ లో పంతం పెరిగింది.

ఒక రోజున ఆఫీసు నుంచి వస్తూ పకోడీలు తెచ్చాడు. మాధురి కిచెన్లో ఉంది. కూతుర్ని ఒళ్ళో కూర్చో బెట్టుకుని, “నీకోసం స్పెషల్ పకోడీలు తెచ్చాను. తిను బంగారం” అంటూ నోట్లో పెట్టాడు.

కొంచెం నమిలిందో లేదో పెలపరించుకుని తుపుక్కున ఊసేసింది. ఇంకా ఇంకా పెలపరించుకుంటూ వాంతిచేసుకుంది.

దిగ్భ్రమగా చూశాడు.

పరుగునొచ్చిన మాధురి భర్త వంక అసహ్యంగా చూసింది. కూతుర్ని లోపలికి తీసుకెళ్ళి నోరు కడిగింది. స్థిమిత పడ్డాక వేడినీళ్ళు పట్టించింది.

"మేం తినం మొర్రో అంటే వినకుండా పసిదానికి మాంసం పకోడీలు తెచ్చి పెడతారా? అసలు మీరు మనిషేనా? మీరు మాంసమే తింటారో, బొమికలు మెళ్ళోనే వేసుకుంటారో మీ ఇష్టం. మా జోలికి రాకండి మహాప్రభో" చేతులు జోడించి దణ్ణం పెట్టింది.

ఉక్రోషం తన్నుకొచ్చిందతడికి. "నీకేమీ అక్కర్లేదు. హంసకి బలం రావద్దూ? మాంసాహారం తినకపోతే ఎలా వస్తుంది?"

"జంతువుల్లోకెల్ల బలమైన ఏనుగు శాకాహారే కదా?!!"

గుడ్లురిమి చూశాడు. తనలో తను కుతకుత ఉడికిపోయాడు.

వాళ్ళని ఎలాగైనా మళ్ళీ మాంసాహారుల్ని చెయ్యాలన్న పట్టుదల మరింత పెరిగింది. రకరకాల మార్గాలు అన్వేషించసాగాడు. ఇంట్లోని ప్రశాంత వాతావరణం మాయమైంది. కోపాలు, విసుగుళ్ళు, అలకలు, ఘర్షణ అధికమయ్యాయి. సుధాకర్ కి ఆఫీసులో పని పెరిగింది. ప్రాజెక్ట్ డెలివరీ టార్గెట్ అందుకోవాలని పరుగెత్తిస్తున్నారు. ఒత్తిడి పెంచారు. దాంతో అతడిలో అసహనం, విసుగు సెలవేయ సాగాయి.

ఆవేళ ఇంటికొచ్చేసరికి రాత్రి తొమ్మిదయ్యింది. బైక్ ని పార్కు చేసి నీరసంగా అడుగులేస్తూ లిఫ్టు దగ్గరి కెళ్ళాడు. అది పని చెయ్యటం లేదు. పిచ్చ కోపం వచ్చేసింది. లిఫ్ట్ డోర్ ని తన్నాడు. వాచ్ మేన్ ని కరిచాడు. అసోసియేషన్ని తిట్టిపోశాడు.

వారి ఫ్లాట్ అయిదో అంతస్తులో ఉంది. ఒగురుస్తూ చిర్రుబుర్రులాడుతూ ఎక్కసాగాడు. చెమటలు ధారలు కడుతున్నాయి. భారీ శరీరం సహకరించట్లేదు. అతికష్టం మీద ఈడ్చినట్టుగా వెళ్ళి ఇంట్లో కూలబడి పోయాడు. లబోదిబోమంది మాధురి. ఇరుగూ పొరుగూ వచ్చారు.

అతడు ఒంటి మీద స్పృహ లేకుండా పడి వుండటం చూసి ఆందోళన పడ్డారు. అర్జంటుగా ఆసుపత్రికి తీసుకెళ్ళకపోతే ప్రమాదం అన్నారు.

లిఫ్టు పని చేయట్లేదు. అతడిదేమో భారీ శరీరం. మోసుకెళ్ళడం కష్టం. దిక్కులు చూశారు.

"అవతల ప్రాణాల మీదకొస్తే మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చుంటారేంటి" అంటూ మూడు ప్లాస్టిక్ కుర్చీలు తెప్పించి, ఒకదాన్లో ఒకటి వేశాడొకాయన. దాన్లో సుధాకర్ ని కూర్చోబెట్టి, నలుగురు సాయం పట్టి, అతి కష్టం మీద క్రిందికి మోసుకెళ్ళారు. ఆసరికి అంబులెన్సు వచ్చేసింది. అత్యవసర సేవలు అందించాక అతడికి స్పృహ వచ్చింది. ప్రాణాపాయం లేదన్నాకగాని మాధురి గుండెలు కుదుట పడలేదు. మరి నాల్రోజులు ఆసుపత్రిలో ఉన్నాక డిశ్చార్జి చేశారు.

రక్తంలో కొలెస్టరాల్ ప్రమాదకర స్థాయిని దాటిందన్నారు. ఒంట్లో కొవ్వు పేరుకుందన్నారు. రక్తనాళాలు దళసరిగా మారాయన్నారు. బరువు పది కేజీలు అర్జంటుగా తగ్గాలన్నారు. ఆహార అలవాట్లలో మార్పు

తప్పనిసరి అని గట్టిగా చెప్పారు. అశ్రద్ధ చేస్తే ఏ క్షణంలోనైనా ప్రాణాపాయం సంభవించొచ్చని హెచ్చరించారు. అతడు విననట్టు ఉండిపోయాడు.

కాస్త స్థిమిత పడ్డాక మెల్లగా అంది మాధురి "ఇప్పటికైనా నా మాట వినండి. మీ కోసమే కాదు, మీమీద ఆధారపడ్డ మా కోసమూ మారండి. ఇక శాకాహారమే తీసుకోండి..."

"చప్పిడి కూడు తినను" విసురుగా అన్నాడు.

"రోజు రోజుకీ ప్రపంచ వ్యాప్తంగా జనం శాకాహారానికి మళ్ళుతున్నారండీ. ఆరోగ్యానికీ, రోగాలను దూరంగా ఉంచటానికి మన పూర్వులు చెప్పిందే సరైందంటూ కాయగూరలకూ పండ్లకూ జనం జైకొడుతున్నారు. మనం తిండి తినేది ఏదోలా బతకెయ్యడానిక్కాదు, ఆరోగ్యంగా ఆనందంగా బతకడానికి. మీ మూర్ఖపు పట్టుదల వదిలెయ్యండి.  మీకోసం, మిమ్మల్నే నమ్ముకున్న మాకోసం డాక్టర్లు చెప్పింది వినండి" కళ్ళ నీళ్ళు పెట్టుకుంది మాధురి.

ఇబ్బందిగా చూశాడు. మనం బతకడానికి మరో జీవిని చంపాలా - అన్న మీమాంస తలెత్తింది. అదే సమయంలో కక్కా ముక్కా లేకపోతే ముద్ద ఎలా గొంతు దిగుతుందని మథన పడసాగాడు.

మాధురి కాయగూరల్తో రకరకాల వంటలు చేస్తోంది. ఎంతో రుచిగా ఉంటున్నాయి. అయినా అతడికి అయిష్టంగా ఉంది. అసంతృప్తిగా ఉంది.

"నేనీ గడ్డి తిన్లేను. నా వల్ల కాదు గాక కాదు" అంటూ విసవిసా బజారు కెళ్ళి, కర్రీ పాయింటు నుంచి మూడు రకాల మాంసాహార కూరలు తెచ్చుకున్నాడు.

వాటిని తీసుకుని డైనింగ్ టేబుల్ దగ్గరికెళ్ళి కూర్చున్నాడు. దాని మీద పెట్టి ఉన్న రెండు ఫొటోలు చూసి ఉలిక్కి పడ్డాడు.

ఒక ఫొటో తాత, నానమ్మలది. రెండోది తల్లిదండ్రులది.

"ఇవి డైనింగ్ టేబుల్ మీదెందుకుపెట్టావ్?" కస్సుమన్నాడు.

"వాళ్ళని గమనిస్తారని. సరిగ్గా చూడండి. మీ తాతగారు నామాలు పెట్టుకున్నారు. మావయ్యగారు త్రిచూర్ణం బొట్టు ధరించారు"

"వాళ్ళు వైష్ణవ మతం స్వీకరించారు!"

"ఆ బొట్లు చూశారా? అవి కేవలం మత చిహ్నాలు కాదు. అవి ఎల్లప్పుడూ నియమాలని గుర్తు చేస్తాయి. అతిక్రమించకుండా హెచ్చరిస్తాయి"

"ఆ గోల ఇప్పుడెందుకు?"

"మనమూ వాళ్ళని అనుసరిద్దాం. ఆ పరంపర కొనసాగిద్దాం. ఆరోగ్యంగా జీవిద్దాం.  మనవడు ఆచరిస్తేనే తాతకి పుణ్యగతులు ప్రాప్తిస్తాయిట. ప్లీజ్. మనమూ సమాశ్రయణం చేయించుకుందాం. భుజాల మీద శంఖ చక్రాల ముద్రలు వేయించుకుందాం.  శ్రీవైష్ణవులం అవుదాం" ఆర్తితో చెప్పింది.

“వూరికే అయిపోతే చాలదు. చాలా నియమ నిబంధనలు పాటించాలి తెలుసా?" వ్యంగ్యంగా అన్నాడు.

“అవన్నీ మనిషి ఉన్నతంగా జీవించడానికి, ఉన్నతుడవుడానికి ఏర్పరచినప్పుడు మనమెందుకు వెనుకంజ వేయాలి?"

వెర్రిగా చూశాడు. తల అడ్డంగా ఊపాడు. “ఈ రోజుల్లో ఆచరణ సాధ్యం కాదు. నా వల్ల కానే కాదు"

“అన్నీ గాకపోయినా శాకాహార నియమం ఒక్కటీ పాటిద్దాం. అప్పుడిహ మీ మనస్సు మాంసాహారం మీదకి పోనే పోదని ఘంటాపథంగా చెప్పగలను"

“మేకల్నీ కోళ్ళనీ హత్య చేయొద్దు నాన్నా" అతడి చేయి పట్టుకుని అర్థించింది హంస.

తుళ్ళి పడ్డాడు. భార్యా బిడ్డల వంక మిర్రి చూశాడు. డాక్టర్ల హెచ్చరికలు చెవుల్లో మార్మోగుతోంటే, తండ్రి తాతల ఫొటోల వంక చూశాడు.

వాళ్ళేదో గుప్త సందేశం ఇచ్చినట్టు అనుభూతించాడు. మనస్సులోని ఆందోళన మంత్రించినట్టు మాయమైంది.


చటుక్కున లేచి, మాంసాహార సంచిని తీసుకుని లిఫ్టులో క్రిందికెళ్ళి, వాచ్ మ్యాన్ కి ఇచ్చేసి చేతులు సబ్బుతో కడుక్కొచ్చాడు

“పులి కడిగిన ముత్యంలా ఉన్నారు" పొంగిపోతూ అంది మాధురి.

“మా నాన్న గ్రేట్” చప్పట్లు కొట్టింది హంస.

అతడి పెదాల మీద చిరుదరహాసం మెరిసింది. అదెంతో సాత్వికంగా ఉంది!

***0***




## మణి వడ్లమాని

వంశీ దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం చదువుతుంటే బాధగా ఉంది.

పొద్దుట నుంచీ  వాడే గుర్తుకు వస్తున్నాడు.  అసలు వాడిని  మర్చిపోతే కదా! ఇప్పుడు  ఈ ఉత్తరం గుండెలమీద ఇనుప గుండు పెట్టినట్లుగా ఉంది.  వాడి జీవితం గురించి తలచుకుంటే గుండె బరువెక్కుతుంది. మొదటి నుంచీ కష్టాలే.  నిజానికి వాళ్ళ నాన్న మంచి ఉద్యోగస్థుడే కాని వ్యసనాలకు బానిస.  దానికి తోడు ఆయన సంసారం వదిలిపెట్టి ఎటో వెళ్ళిపోయాడు.  ఆవిడ దిక్కు తోచని స్థితిలో వంశీని తీసుకుని అన్నగారింటికి చేరింది.

వాడు మా స్కూల్లోనే చేరాడు.  మొదటి రోజునే 'నా పేరు వంశీ మరి నీ పేరు'  అని అడిగాడు.  'నా పేరు శ్రీనివాస్' అంటూ పరిచయం చేసుకున్నాను.  ఆ విధంగా మా స్నేహం స్కూల్  రోజుల నుండి ఈ రోజు వరకు ఉంది.  అయితే వంశీది ఒక పెక్యులియర్ మనస్తత్వం. చెప్పాలంటే .. ఓ రోజున  స్కూల్కి వెళుతున్నప్పుడు నా ఐ. డి కార్డు ఎక్కడో పడిపోయింది. యెంత వెతికినా కనిపించలేదు. అది లేకపోతే గేటు లోకి అడుగు పెట్టనిచ్చేవారు కాదు.  చేసేది లేక వెనక్కి తిరిగి ఇంటికి వెళ్ళిపోయాను.  ఇంట్లో కూడా లేదు.  అది మళ్ళీ తీసుకోవాలంటే  పెద్ద ప్రొసీజర్, నాన్నగారు ఊర్లో లేరు. రెండు రోజులు  పడుతుంది.

వాడు ఆ రోజు  సాయంత్రం కలిసి  "ఒరేయి శ్రీను 'హిహిహి నీ ఐ డి కార్డు నాకు దొరికింది. కానీ నీ అజాగ్రత్తకు ఆ మాత్రం  శిక్ష పడాలిలే' అన్నాడు.  నాకు చెప్పలేనంతకోపం వచ్చింది.  అయినా తమాయించుకున్నాను. వాడితో పాటు ఇంకో ఇద్దరు  స్నేహితులు కూడా ఉండేవారు.  అయితే అందరి దృక్పథాలు వేరు వేరుగా

కథా మంజరి

ఉండేవి. అప్పుడప్పుడు మా నలుగురి భావాలూ కలిసినా వంశీ మనస్తత్వం మటుకు మాకు ఆశ్చర్యాన్ని, ఆలోచనలని కలిగించేది. అలా అని వాడిని తక్కువ చేయాలనీ కాదు. అప్పుడప్పుడు వాడి ప్రవర్తన చూసి అనుకునే వాళ్ళం వాడిని పరిస్థితులు అలా మార్చేసి ఉంటాయని.

వంశీగాడి జీవితం వాళ్ళ మావయ్య చేతులలో ఉండేది. అన్నీ ఆయనకి నచ్చినవే చెయ్యాలి. వీడి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా నిర్ణయాలు తీసేసుకునేవాడు. నిజానికి ఆయనికి పిల్లలు లేరు. ఉన్న మేనల్లుడిని ప్రేమగా, అభిమానంగా చూసుకునేది పోయి, నియంతలా ప్రవర్తించేవాడు. వాడికి ఇంజనీరింగ్ చేయాలనీ ఉండేది. కానీ వాళ్ళ మావయ్య 'ఏ కామర్స్ చేస్తే బ్యాంకులోనో, మరో చోటో ఉద్యోగం వస్తుంది' అనడంతో, ఆయనకి ఎదురు చెప్పలేక కామర్స్ గ్రూప్ తీసుకున్నాడు. పైగా ఆయన ఇంకో మాట కూడా అన్నాడు 'పై ఊళ్ళకి పంపి చదివించడానికి, ఇక్కడ నీ బాబు ఇచ్చిన మూటా ముల్లె లేదని' ఎద్దేవా చేస్తూ మా ముందే అనడం భరించలేకపోయాడు. కాని ఏమి చేయలేని అశక్తత. తల్లి మొహం చూసి ఊర్కున్నాడు.

అది కప్పి పుచ్చుకోవటానికి "మీరేమి నన్ను వెక్కరించనక్కరలేదు. అన్నీ ఊహించుకున్నట్లుగా భవిష్యత్తు ఉంటుందని నమ్మకం ఏముంది. పైగా ప్రతి దానికి కొలమానం ఒకటి" అని విసుక్కున్నాడు. నేను మిగతా ఇద్దరు స్నేహితులం మా చదువుల మూలంగా కొంతకాలం వంశీకి దూరము అయ్యాము.

***

బహుశా ఐదేళ్ల తరువాత వంశీ గురించిన వార్తలు తెలిసాయి. ఒకటి, అదే ఊర్లో వాడు ఓ బట్టల కొట్లో అకౌంట్స్ రాస్తున్నాడు. వాడి పెళ్లి జరిగింది. కాని అది వాడి ఇష్టంతో కాదు. వాడి మావయ్య నిర్ణయించిన సంబంధం. నిజానికి వాడు మమ్మల్ని పెళ్ళికి పిలవలేదు. కారణం తెలియదు కానీ, ఆ అమ్మాయి కాస్త ఆస్తిపరురాలే .. కానీ పెద్ద రూపసి కాదు. పైగా ఒక కాలు ఈడుస్తూ నడుస్తుంది. వాడు వద్దని చెప్పచ్చు. కాని అలా చేయలేదు.

అన్నట్లు ఒక విషయం చెప్పడం మర్చిపోయాను. వాడిలో నాకు నచ్చని గుణం ఒకటి ఉండేది. అది ఏమిటంటే .. అందరిలోను వాడు మంచివాడిని అనిపించుకునే తాపత్రయం. అందుకోసం కొన్ని త్యాగాలకి కూడా సిద్ధపడిపోయాడు. రెండోది .. అప్పట్లో ఒక అమ్మాయి వీడిని ఇష్టపడింది. 'ముందు పెళ్లి చేసేసుకుందాము అప్పుడు ఎవరు ఏమి అనరు' అని కూడా అడిగింది. కాని, వీడు ఆమెకి చాల సుద్దులు చెప్పి పైగా 'నామీద ప్రేమతో ఇంట్లో పెద్దవాళ్లు తెచ్చిన సంబంధం కాదనడం మూర్ఖత్వం అంటూ'

ఆమెని తిప్పి పంపేసాడు. ఇది కూడా నాకు నచ్చలేదు. ఒక అమ్మాయి వీడిని ఇష్టపడి పెళ్లి చేసుకుందాం అంటే వద్దనే మూర్ఖులు ఉంటారా?

నాకు గీతతో పెళ్లయింది. హైదరాబాద్ లో ఓ కంపెనీ లో ఇంజనీర్ గా బ్రతుకు బండి లాగుతున్నాను. గీత కూడా ఇంటి దగ్గర స్కూల్లో టీచర్ గా పని చేస్తోంది. ఒక పాప పుట్టింది. మిగతా స్నేహితులు కూడా, ఎవరి జీవితాలలో వాళ్ళు స్థిర పడ్డారు.

మధ్యలో ఒకసారెప్పుడో కనిపించినప్పుడు అడిగాను 'ఏంట్రా? ఇలా అయిపోయావు?'
"ఎలా అయిపోయాను బానే ఉన్నాను, అయినా నా మీద జాలి చూపిస్తే నాకు అసహ్యం? అదీ కాక నేను ఎవరి బలవంతం మీద ఆ పెళ్లి చేసుకోలేదు, అంతా నా ఇష్టం ప్రకారమే జరిగింది!" అంటూ అసంబద్ధంగా ఏదేదో మాట్లాడి వెళ్ళిపోయాడు. వాడి మాటలకి ముందు కోపం వచ్చినా, జాలి వేసింది. ఎవరి కోసమో ఏదో చేస్తున్నా అనుకుంటూ తనని తను ఇరుకుగా చేసేసుకుని, తన చుట్టూ ఒక గిరి గీసుకొని బతుకుతున్నాడు.
మరో రెండేళ్ళు గడిచాయి.
అప్పుడే ఒక భయంకరమైన నిజం తెలిసింది. వంశీని అభిమానించిన అమ్మాయి, వీడి మీద ప్రేమని మర్చిపోలేక, చేసుకున్న పెళ్ళికి న్యాయం చెయ్యలేక ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. అప్పటికే వాడికి ఒకళ్ళో, ఇద్దరూ పిల్లలు కూడా పుట్టారని విన్నాను. వంశీకి యెంత దగ్గరవాలని ప్రయత్నించినా, వాడి పక్క నుంచి జవాబే లేదు.

ఇంత హడావుడి జీవితంలో కూడా నేను కథలు రాస్తూనే ఉన్నాను. కొన్ని కథలు, కొన్ని నాటికలు రాసాను. చాల వాటికి బహుమతులు వచ్చాయి. ఈ సంగతి మా ఊర్లో కూడా తెలియడంతో, అక్కడ ఉన్న సాహితీ మిత్రులంతా కలిసి నాకు ఒక సన్మాన కార్యక్రమం తల పెట్టారు. గీత రావడానికి స్కూల్లో శెలవు దొరకలేదు. కాబట్టి నేనొక్కడినే బయలుదేరాను. రాత్రి బండి ఎక్కి ఉదయానికల్లా మా ఊర్లో దిగాను. స్టేషన్ కి కారు తీసుకొని సంస్థ తరఫు వాళ్ళు ఇద్దరు వచ్చి, మర్యాదగా ఆహ్వానించి, బస ఏర్పాటు చేసిన హోటల్ లో రూమ్లో దింపి, కార్యక్రమ వివరాలు మరో మారు తెలిపి వెళ్ళిపోయారు. నిజానికి గమ్మత్తుగా ఉంది ఇలా హోటల్ లో ఉండటం. సొంత ఊరే కానీ, అమ్మా, నాన్నగారు కూడా అన్నయ్య దగ్గరకు వెళ్ళిపోవడంతో ఈ ఊరితో రాకపోకలు తగ్గాయి.

అన్నట్లు వంశీకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా జవాబు రాలేదు. పోస్లే నేనే వెళ్లి వాడిని కలుస్తాను. ఎంతైనా వాడు బాల్య స్నేహితుడు కదా అని వాడి ఇంటివైపు బయలుదేరాను. ఊరు బాగా మారిపోయింది. పూర్తిగా

కొత్తగా ఉంది. పాత ఇళ్ళ స్థానం లో పెద్ద పెద్ద అపార్ట్మెంట్లు వెలిసాయి. చిన్నచిన్న దుకాణాల బదులు సూపర్ మార్కెట్స్, పిజ్జా హౌస్ లు, కాఫీ డే లు దర్శనమిస్తున్నాయి.

ఆటోని వంశీ ఇంటి దగ్గర అపించాను. ఇల్లు బాగా పాడు పడిపోయింది. ఇంట్లోంచి పాతిక, ముప్పయి లోపున్న ఒక ఆడమనిషి వచ్చింది. 'ఎవరు కావాలంటూ?'. చెప్పాను. 'బాబుగారు లేరండి. వాళ్ళ అమ్మగారు ఉన్నారు. ఆవిడకి ఆరోగ్యం అస్సలు బాగోలేదు' అంటూ లోపలకి తీసుకెళ్ళింది. వంశీ అమ్మగారు మంచంలో ఉన్నారు. అస్సలు గుర్తు పట్టలేకపోయాను. అస్తిపంజరాన్ని మంచంలో పడుకో పెట్టినట్లుగా ఉన్నారు. ఆవిడని పలకరించినా, నన్ను గుర్తు పట్టే స్థితిలో లేరు. ఇంట్లో వంశీ భార్య, పిల్లలు ఉన్న అలికిడి వినిపించటం లేదు. నా చూపులు గ్రహించిన ఆ ఆడమనిషి 'అమ్మగారిని పుట్టింటికి పంపేసారని' చెప్పింది. వాడు అసలు ఇంటికి ఎప్పుడు వస్తాడో తెలియదు. సరిగా షాప్ కి వెళ్లకపోవడంతో ఉద్యోగం లోంచి తీసేసారుట. ఏ రెండు మూడు రోజులకో ఓ సారి ఇంటికి వస్తాడుట. వాళ్ళ మావయ్యకూడా ఊర్లో లేరట. కాకపోతే ఆయనే తోడబుట్టిన దాన్ని చూస్కోవడం కోసం, ఈ ఆడమనిషిని ఏర్పాటు చేసి పెట్టారుట.

ఈ 'ట' లన్నీ విన్న తరువాత నా మనసంతా భారమయింది. ఇక చేసేదేమీ లేక నేను బస చేసిన హోటల్ కి వెళ్ళిపోయాను. ఆ సాయంత్రం నా సన్మాన కార్యక్రమం జరిగాక, నా స్పందన తెలియచేయమన్నప్పుడు రెండు మాటలు చెప్పాను.

"ఒకటి .. నాది కాని జీవితాన్ని జీవించడానికి ఇష్టపడలేదు. రెండోది .. నా జీవితాన్ని నాకు నచ్చినట్లుగా ఉండటానికి ప్రయత్నం చేసుకున్నాను. ఎవరి మెప్పు కోసమో జీవించడం చేతకాలేదు" అంటున్నప్పుడు ఆఖరి వరుసలో నలిగిన బట్టలతో ఉన్న వ్యక్తి లేచి వెళ్ళిపోతున్నాడు. దూరం నుంచి వంశీలాగ అగుపించాడు. వెంటనే స్టేజి మీద ఉన్న వాళ్ళకి చెప్పాను.. 'ఆ వెళ్ళిపోతున్న వ్యక్తిని ఆపండి' అని. వాళ్ళు వెళ్ళే సరికే అతను వెళ్లిపోయాడని చెప్పారు.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు వాడి గురించే ఆలోచనలు. అసలు వాడు ఎక్కడ రాంగ్ స్టెప్ వేసాడు? నిజానికి విధి ఆడుకుంది వాడితో, నడక రాని వాడిని పరుగులు పెట్టించింది. అడుగు నిలవక బోర్లా పడిన వాడిని ఇప్పుడు విమర్శించడం ముఖ్యమా? వాడు వద్దన్నా పిటీ అనిపిస్తుంది. నిండైన జీవితాన్ని తనకు తానుగా ఇరుకు చేసుకుని నడిచాడు.

***

కొంతకాలానికి ఫ్రం అడ్రస్ లేని ఉత్తరం ఒకటి వచ్చింది నాకు

“ఒరేయి శ్రీను,  ఆరోజు స్టేజిమీద నిన్ను చూసాను .. నీ మాటలు కూడా విన్నాను, కాకపోతే అన్ని పోగొట్టుకున్నానురా.  నా చేతులతో జీవితాన్నే నాశనం చేసుకున్నాను. కోరుకున్న జీవితం దొరకక పోయినా, ఉన్న దానితో సర్దుకోలేకపోయాను.  అవివేకినయ్యాను. దగ్గరగా వచ్చినప్పుడు కాలదన్నుకున్నాను. ఇప్పుడు కావాలనుకున్నా అందకుండా పోయింది.  ఇప్పటికీ తను గుర్తొచ్చినప్పుడల్లా అయ్యో .. అయ్యో అని దుఃఖం వచ్చేస్తోంది. పోనీ నా జీవితంలో ఇంకోసారి బలవంతంగా ప్రవేశించిన అమెనైనా సుఖపెట్టగలిగినా అంటే అదీ లేదు. ఇలా  ఎందుకు జరిగిందని  ఎన్ని సార్లో ఆత్మ శోధన చేసుకున్నాను.  అయినా గతంలో గాయాలని గుర్తు చేసుకుంటూ, భవిష్యత్  బాధాకరం చేసుకోకూడదని  తెలుసు. కానీ  మనసు నిలకడగా లేదు. ఎవరి తప్పో తెలియదు, నాకు ఆత్మీయ దరిద్రం చుట్టుకుంది. ఇల్లో నరకంలా మారింది. అందుకే  ఈ సంసారం జీవితంలోని బాధలు వదిలేసి, కొంత కాలం అందరికీ దూరంగా ఒంటరి జీవితం గడపాలని వచ్చేసాను.


ఇట్లు

స్నేహితుడు గా చెప్పుకోలేని మనిషిని.

మనిషిలోని సంతోషం  జారి నేలపాలవదు గానీ, అది మరో మనిషికి దొరకుతుంది!

***0***

కథా మంజరి




పెమ్మరాజు విజయ రామచంద్ర

మునిసిపాలిటీ చెత్తబండి ఇంటి ముందు ఆగింది. రోడ్డు పక్క పోగేసిన చెత్త ఎత్తేందుకు కుర్రాడు దిగాడు. ఇంతలో లోపల నుంచి వచ్చిన ఆడమనిషి, “ఆగండి తీసుకెళ్ళకండి! మాకు కావాలి” చేతిలో గోనెసంచి, చీపురు పట్టుకుని అరుస్తూ బండికి అడ్డంగా వెళ్లబోయింది.

“ఈ పిచ్చి సంత ఒకటి. రోజూ రావడం ‘పాత సామాన్లు తీసుకెళ్లద్ద’ని బండికి అడ్డుపడడం అలవాటైపోయింది” చెత్తను బుట్టలోకి ఎత్తుతున్న కుర్రాడు డ్రైవరుతో చెపుతున్నాడు.
“అవున్రా బాబు. పిచ్చివాళ్ళని కాళ్ళు, చేతులు కట్టేసి ఇంట్లో కూర్చోపెట్టుకోవాలి. ఇలా వదిలేస్తే ఎలా? అడ్డం వచ్చి పొరపాటున ట్రాక్టర్ కింద పడి దెబ్బలు తగిలితే ఎవరు బాధ్యులు? కేసులు జరిగితే ఉద్యోగాలు పోతాయి. ఎన్ని సార్లు చెప్పిన ఇంటోళ్లు పట్టించుకోరు…” ఓ చూపు ఇంటి వైపు విసిరి బండిని ముందుకు పోనిచ్చాడు.

వెళ్తున్న బండి వైపు చూస్తూ నిలబడ్డ సీత “అగు…” అనే పిలుపుతో వెనక్కి చూసి ముందుకి గబగబగా అడుగులు వేసే ప్రయత్నం చేసింది. ఆమె వయసు అరవై పైనే ఉంటాయి. పసిమి ఛాయ. గాలికి ఊగే మొక్కలా సన్నగా రివటులా ఉంది. ముడి వేసుకున్న నెరిసిన జుట్టు మధ్యలో, ఎర్రటి మందారపువ్వు పెట్టుకుంది. లోపల్నుంచి వచ్చిన పెద్దాయన, ఆమె చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు.
మేడ మీద నిలబడి పైనుంచి అంతా గమనిస్తోన్న అమ్మాయి, చకచక మెట్లు దిగి హాల్లో కూర్చున్న ఆమె పెదనాన్న దగ్గరకి వెళ్ళి, అతను చదువుతున్న పేపర్ లాక్కుంది. ఏమిటన్నట్లు చూసాడు ఆయన.
“ఆ పెద్దావిడ ఎవరు? ఎందుకలా విచిత్రంగా ప్రవర్తిస్తోంది?” అడిగింది.

“ఆవిడ పక్కింటి చంద్రశేఖరం గారి భార్య. ఆయన కూడా నాలాగే బడిపంతులుగా విశ్రాంత జీవితం గడపాలనుకున్నాడు. కష్టపడి పిల్లాడ్ని చదివించి ప్రయోజకుడ్ని చేసాడు. కాని...” గుమ్మం దగ్గర నిలబడ్డ మనిషిని చూసి చెప్పడం ఆపేసాడు రామారావు.

“ఏం ఆపేసావేం? నా కథే అనా? సర్లే, నేనే చెపుతాను. నీ పేరేంటమ్మా?” అడుగుతూ వచ్చి సోఫాలో కూర్చున్నాడు చంద్రశేఖరం.

“నా పేరు శిరీష అంకుల్. ఈయన మా పెదనాన్న. ఈ మధ్యే లండన్ నుంచి వచ్చి హైదరాబాద్లో స్థిరపడ్డాం. ఆవిడకేమైంది?” వినయంగా నమస్కారం పెడుతూ అడిగింది.

‘కిరణ్ కంటే రెండు మూడేళ్లు పెద్దదై ఉంటుంది. పెద్దల పట్ల వినయం, విధేయత ఉన్నాయ్’ మనసులో అనుకున్నాడు చంద్రశేఖరం.

“చూడు శిరీష! మా బతుకులు ఇలా మారడానికి ఒక రకంగా నేనే కారణం. చిన్నపుడు మా కిరణ్ కి, అదే మా అబ్బాయికి చదువుతో పాటు ఏదైనా ప్రత్యేకమైన అలవాట్లు చేయాలని, వాడ్ని స్టాంప్ సేకరణలో బాగా ప్రోత్సహించాను. కొత్త స్టాంప్ వచ్చినపుడల్లా వాడికోసం ప్రత్యేకంగా కవర్ తెప్పించేవాడ్ని. మంచి అలవాట్లు చేస్తున్నాననుకుని మురిసిపోయాను. తర్వాత నా తప్పు తెలిసింది” నిట్టూర్చాడు.

“అందులో తప్పేముంది అంకుల్? మంచి అలవాటేగా...” అమాయకంగా అడిగింది.

“అలవాటు మంచిదే. అదే మా పాలిట గ్రహపాటైంది. వికటించి మాకు శాపమైంది!” అతని మాటల్లో ఆవేదన వ్యక్తం అయింది.

“ఎలా?” అడిగింది శిరీష.

శిరీష వేసే ప్రశ్నలకు చంద్రశేఖరం ఏమైనా అనుకుంటాడేమోనని ఇబ్బందిగా కుర్చీలో కదులుతున్నాడు రామరావు. అది గమనించిన చంద్రశేఖరం, “రామారావు! నా గుండె గాలి నిండిన బుడగలాంటిది. కొన్ని నిజాలైనా ఎంత నిజాయతీగా బైటకెళితే, అంత మనఃశాంతి కలుగుతుంది. ఆమెను అడగనీ...” అన్న మాటకు రామరావు మౌనంగా ఉండిపోయాడు.

ఇంతలో రామారావు మొబైల్ మోగింది.

“మా అబ్బాయి నుంచి ఫోన్. ప్రతి రోజు ఈ టైముకి ఫోన్ చెయ్యడం వాడి దినచర్య. మా శిరీషతో మాట్లాడుతుండు. హలో...” అంటూ బైటకెళ్ళాడు రామారావు. ఒక క్షణం రామరావు వెళ్లిన వైపే చూస్తుండిపోయాడు చంద్రశేఖరం.

“అంకుల్, చెప్పండి. ఆంటీకి ఏమైంది?” ఆతృతతో అడుగుతోంది శిరీష.

“నేను కూడా మీ పెదనాన్నలా, కొడుక్కి దూరంగా ఉండవలిసిందనిపిస్తోంది. అలా ఉంటే, రోజూ ఫోన్ వచ్చేదేమో! కనీసం ఆ ఆనందమైన మిగిలేది!” అంటూ కంటితడిని భుజం మీదున్న కండువాతో తుడుచుకున్నాడు చంద్రశేఖరం.

"బాధ పడకండి అంకుల్. మీ అబ్బాయి మీకు ఫోన్ చేసే రోజు వస్తుంది. అంతే కాదు ప్రతి పండుగకి వస్తాడు. ఆంటీ మామూలు మనిషి అవుతుంది" శిరీష నిర్మలమైన మనసుతో చెప్పిన మాటలు చంద్రశేఖరానికి లిప్తపాటు కాలం మానసిక బలానిచ్చాయి.

"అంతటి శుభఘడియలు నా జీవితంలో ఉంటాయా?" ఒక చిన్న పిల్ల ముందు మాట్లాడుతున్నానని మరచిపోయి బాధ వెళ్లబుచ్చాడు.

"ఎందుకుండవంకుల్? తప్పకుండా ఉంటాయి. పరిష్కారం లేని సమస్య ఉండదు. మీ జీవితానుభవం ముందు ఈ ఇబ్బందులు ఎంతంకుల్? అవి సముద్రం ముందు పిల్లకాలువలాంటివి!" పెద్ద అరిందాలా మాట్లాడింది. చిన్నపిల్ల పెద్ద మాటలకు మనసులోనే నవ్వుకున్నాడు.

"అయినా మీరు, మీ కొడుకు దగ్గరకు వెళ్ళడంలో తప్పేమిటీ?" నిర్మలంగా మొహం పెట్టి అడిగింది.

"వాళ్లు మమ్మల్ని అవసరానికి వాడుకున్నారు. వాళ్ళు ఎంతో గొప్పగా చూసుకునే పాత వస్తువుకిచ్చే విలువ కూడా మాకు ఇవ్వలేదు" చంద్రశేఖరం మొహంలో బాధ కనిపించింది.

"మా కొడుకు, కోడలు ఇద్దరు ఉద్యోగస్తులు. పొద్దునే ఆఫీసుకి వెళ్లిపోయేవారు. నేనే పిల్లని కాన్వెంటుకి తీసుకెళ్లి తీసుకొచ్చేవాణ్ణి. స్కూల్ నుంచి రాగానే, వాళ్ల బామ్మ పాప సంగతి చూసుకొనేది. నేను బడిపంతుల్ని కదా, వాళ్ళిద్దరు ఆఫీసు నుంచి వచ్చేలోపు చదివించేవాణ్ని. వాళ్ళకు చేదోడు వాదోడుగా ఉంటున్నామనుకున్నాం. పిల్ల ఐ.ఐ.టి. కోచింగ్ కోసం హాస్టల్ కెళ్లింది. అప్పుడే పరిస్థితులు మారాయి. మా అవసరం వాళ్లకిక లేదని తెలిపోయింది. మేం గడప దాటవలిసిన పరిస్థితి కల్పించారు!" మాట చెపుతుంటే చంద్రశేఖరంలో ఆక్రోశం కనిపించింది. అవసరం తీరిన తర్వాత పనికిరాని వస్తువుగా విసిరేశారనే ఆవేదన కనిపించింది.

"కనీసం మీ కోడలైనా చెప్పచ్చుగా?" అనుమానం వ్యక్తం చేసింది.

"మన బంగారం మంచిదైతే, మరొకర్ని అనుకునే అవసరం ఉండదు. అయినా వాడికి పాత సామానుల్ని అమ్మేయడం అలవాటేగా! మమ్మల్ని ఎవరూ కొనుక్కోరు. అందుకే గిరవాటేసాడు. బొమ్మనలేక బొగ పెట్టడం వాళ్ళకు బాగా తెలుసు. అదే చేసారు. సీతని మానసికంగా హింసించారు. పాపం! తట్టుకోలేకపోయింది. పేగు ప్రేమ పిచ్చిదాన్ని చేసింది" అంటూ లేవబోయాడు.

"ఇంతకీ ఈ పాత సామాను గోడవేమిటి అంకుల్?" అనుమానంగా అడిగింది.

"ఇందాక చెప్పాను కదమ్మా! వాడికి హాబీలా ఉంటుందని స్టాంప్ కలెక్షన్ అలవాటు చేసానని. హాబీ డబ్బు సంపాదించే వ్యాపార వ్యసనంగా మారింది. పురాతన వస్తువులు సేకరించడం, వాటిని అమ్మడం! మనుషుల్లో ఆత్మీయత, అనురాగం చూడ్డం మానేసాడు" అన్నాడు.

"మారితే మారచ్చు. కానీ..." ఆగిపోయింది.

మాటను మధ్యలోనే అపు చేస్తూ, "వాడి మార్పు ఎంత హీనస్థితికి దిగజారిందంటే, కంటికి కరెన్సీల రెపరెపలే కనిపిస్తున్నాయి. వాడి చెవులకి పైసల గలగలలే వినిపిస్తున్నాయి. కళాఖండంలో కళాకారుడి ఆర్తిని

చూడడం మర్చిపోయాడు. ప్రతి కళాఖండానికి ఆత్మ ఉంటుందనే ఆలోచన పోయింది. వాడి వ్యవహారశైలి నచ్చకపోయినా, సీత కోసం సహనంతో సహించాను. ఆఖరికి మేం అక్కడుండడంలో వాడికి లాభం కనబడలేదు. మా బాధ్యత బరువనుకున్నాడు. వాడి దృష్టిలో పాత సామాన్ల పాటి విలువ లేమని, మమ్మల్ని వద్దనుకున్నాడు. మేం అక్కర్లేదు, కాని మా వస్తువులు కావాలి" బాధగా అన్నాడు.

"మీ వస్తువులా?" శిరీష ఆశ్చర్యపోయింది.

"అవును! మా తాతల కాలం నుంచి మా ఇంట్లో ఉంటున్న గడియారం చాలా విలువ ఇస్తుందట. మా బామ్మ పుట్టింటి నుంచి తెచ్చుకున్న భోషాణం, ఆ పాషాణ హృదయానికి కనకవర్షం కురిపిస్తుందట. ఆ విషయం మాకు తెలియదు. మా ఇంట్లో తాంబూలం పెట్టి అమ్మేసి డబ్బు చేసుకున్నాడు. వాడు అంత దిగజారిపోయాడు. వాడి గురించి చెప్పుకుంటూ పోతే పెద్ద చరిత్ర అవుతుంది!" గుండెల్లో బాధని పంచుకుని తేలికపడ్డ మనసుతో ఇంటికెళ్ళాడు చంద్రశేఖరం.

ఆ కళ్ళలో బాధ చూస్తే ఎవరికైనా గుండె కలుక్కుమంటుంది. శిరీషకి కూడా అలాగే అనిపించింది.

***

వీధిగుమ్మంలో కూర్చుని సీతమ్మకు జడవేస్తున్న చంద్రశేఖరం, ఆటో ఆగిన చప్పుడుకు తలెత్తి చూశాడు. ఆటోలోంచి దిగుతున్న కొడుకు, కోడలుని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ ఇద్దరి మొహంలో ఏదో అప్రకటితభావం గోచరిస్తోంది. కొడుకు కిరణ్ వ్యాపారంలో, ఏదో దెబ్బ తిన్నాడేమోనని మనసులోనే అనుకున్నాడు చంద్రశేఖరం. వస్తూనే తల్లిని దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు కిరణ్. తండ్రి వైపు చూసిన చూపులో క్షమాపణ కోరినట్లుంది. చంద్రశేఖరానికి ఏమి అర్థం కాలేదు. ఏదన్నా అడిగితే కుంభవృష్టి కురిపించేలా వున్నాయి ఆ కళ్ళు!!

గదిలోకి వెళ్ళగానే కాళ్ల మీద పడి, "మమల్ని క్షమించండి. మేం చాలా తప్పు చేసాం. మిమ్మల్ని అశ్రద్ధ చేసాం" కొడుకు, కోడలు మొహంలో పశ్చాత్తాపం కనబడింది.

"మనలో మనకి క్షమాపణలు ఏమిటి? లోపలికి వెళ్ళి ఫ్రెష్ అవ్వండి" కొడుకు భుజం పట్టుకుని లేపాడు చంద్రశేఖరం. ఏమి అర్థం కానట్లు అయోమయంగా చూస్తోంది సీతమ్మ. ఇంతలో చంద్రశేఖరం ఫోన్ మోగింది.

"చంద్రశేఖరం ఒకసారి రాగలవా?" ఫోన్లో అడిగాడు పక్కింటి రామారావు.

"వస్తాను, ఏదైనా అర్జెంట్ పనా? ఇప్పుడే మా కొడుకూ, కోడలు వచ్చారు. ఒక అరగంటలో వస్తాను" చెప్పాడు చంద్రశేఖరం.

"అంతా అర్జెంట్ పనేమీ కాదు. నీకు కుదిరినప్పుడు రా..." ఫోన్ పెట్టేశాడు రామారావు.

కథా మంజరి

"కిరణ్! రామారావు అంకుల్ ఏదో మాట్లాడే పనుంది, రమ్మని ఫోన్ చేసారు. మీరు నా కోసం చూడకుండా భోజనాలు చేసేయండి. అరగంటలో వచ్చేస్తా" కొడుక్కి చెప్పి రామారావు ఇంటి వైపు కదిలాడు చంద్రశేఖరం.
రామారావు ఇంటికెళ్ళేసరికి ఎదురు వచ్చిన శిరీష, "రండి అంకుల్! నేను చెప్పనుగా.. మీ అబ్బాయి వస్తాడని. వచ్చాడుగా..." అంది.
"మా అబ్బాయి రావడం నీకు ఎలా తెలుసమ్మా? నువ్వు ఎపుడు వచ్చావు?" ఆశ్చర్యపోతు అడిగాడు చంద్రశేఖరం.
"మేమంతా కలసే వచ్చాంగా..." నవ్వుతూ చెప్పింది.
"అవునా? వాడు నీకు ఎలా తెలుసు?" అడిగాడు.
"నేను వాళ్లను, హైదరాబాదులోనే కలిసాను అంకుల్. మీ అబ్బాయి ఇంటికి వెళ్ళాను కూడా... గూగుల్లో ఇలాంటి స్పెషల్ కారెక్టర్ గురించి ఇట్టే తెలుసుకోవచ్చు" చెప్పింది.
"తెలుసుకుని ఏం చేసావో, అది కూడా చెప్పు చంద్రశేఖరానికి..." ఉత్కంఠను తొలగించడానికి అన్నాడు రామరావు.
"ఏముంది! పరిచయం చేసుకున్నాను. నాక్కూడా పాత వస్తువుల కలెక్షన్ హాబీ ఉందని చెప్పా. ఒకే అభిరుచులున్న వ్యక్తులు తొందరగానే దగ్గరవుతారు కదా! అలాగే దగ్గరయ్యాం. మా రెండు కుటుంబాల మధ్య పరిచయం క్రమంగా బలపడింది. అతనిలో వ్యాపార ధోరణి ఉందన్న మాట నిజం. అదే మనిషిలో, మంచి మనసు కూడా ఉంది" చెప్పసాగింది.
"నేను నమ్మను?" ఆమె మాటను ఖండించినట్లు చెప్పాడు చంద్రశేఖరం.
"మనం చేసే ప్రయత్నం చేస్తే, ప్రతి మనిషిలో మార్పు వస్తుంది అంకుల్! క్రమంగా కిరణ్ లో మార్పు వచ్చింది. ఆ మార్పే అతని భార్యని కూడా మార్చేటట్లు చేసింది. ఒక రోజు ఏం జరిగిందంటే...." జరిగిన విషయం చెప్పడం మొదలు పెట్టింది.

"కిరణ్ కి హార్ట్ స్ట్రోక్ వచ్చింది. 'ఇప్పుడు నాకేదైనా అయితే, నా కూతురు గతి ఏమిట'ని చాలా మథనపడ్డాడు. ఆ సందర్భంలో కిరణ్ లోని తండ్రి బైటకొచ్చాడు. అప్పుడు నేను, 'నువ్వు కన్న నీ కూతురు భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నావు. అలాగే నిన్ను కన్నవాళ్లు గుర్తుకు రావటం లేదా?' అని అడిగిన మాట, కొమ్మను తాకిన వసంతంలా కిరణ్ గుండెకు తాకింది. అతనిలో మనిషిని తొలిసారి తట్టినట్లనిపించింది.
మరోసారి.. మీ మనవరాలు స్నేహితులతో సరదాగా ముంబై ప్రయాణమయ్యింది. కిరణ్ ఒప్పుకోలేదు. దాంతో భీష్మించుకుని కూర్చుంది. అన్నం తినలేదు. మీ కోడలు బతిమాలింది. అయినా కిరణ్ ఒప్పుకోలేదు. మనవరాలు నిరాహారదీక్ష చేసింది. క్రమంగా బలహీనపడుతున్న కూతుర్ని చూడలేక 'ప్రేమ' అనే బలహీనతతో అంగీకరించాడు.

ఆ విషయం నాతో చెప్పినప్పుడు, 'నువ్వు చిన్నప్పుడు అన్నం తినకపోతే, మీ అమ్మ గుండెలవిసేలా ఎన్నిసార్లు ఏడ్చిందో గుర్తుందా? ఇప్పటికీ నీ కోసమే ఆమె గుండె చప్పుడు చేస్తుంది. ప్రతి తల్లిదండ్రుల బలం, బలహీనత వాళ్ళ సంతానమే! ఆ మాటకు కిరణ్ లో మలి కదలిక కనిపించింది. ఒక క్షణం తడి మొలిచిన కళ్ళతో నా వైపు చూడలేక శూన్యంలోకి చూసాడు.

మరో రోజు నేను వాళ్ళింటికి వెళ్ళేసరికి భార్యా భర్తలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. నాకు ఏమి తెలియనట్లు మీ గురించి అడిగితే 'మీరు ఉన్నారని' ముక్తసరిగా సమాధానం చెప్పాడు. కోపంగా, 'పాత సామానుల గురించి అంత శ్రద్ధ తీసుకుంటావుగా! వయసు మీరిన తల్లితండ్రుల గురించి శ్రద్ధ లేదా?' అని సూటిగా ప్రశ్నిస్తే, నాకు మొహం చూపించడానికి ఇబ్బంది పడ్డాడు. సమాధానం చెప్పలేక తత్తరపాటు పడ్డాడు. అదే అవకాశంగా తీసుకుని నేను చెప్పదలుచుకున్నది చెప్పేసాను.

'పాత వస్తువు ఏదైనా డిమాండ్ బట్టి కొంటావు. అదే పాత వస్తువును నీకు మంచి రేట్ వచ్చినప్పుడు లాభానికి అమ్మేస్తావు. కాని బంధాలు, బాంధవ్యాలు అలా ఎప్పుడు పడితే అప్పుడు కొనేవి, అమ్మేవి కావు. భగవంతుడు నిర్దేశించేవి, నిర్ణయించేవి .. అవి వస్తువులు కాదు. వస్తువు నచ్చితే ప్రేమించచ్చు. కాని వస్తువుకి నీ మీద అనురాగం ఆప్యాయత వుండవు. అవి చైతన్యం లేని జడ పదార్ధాలు. అలాంటి వాటికి ఇచ్చే విలువ కూడా మనిషికి ఇవ్వకపోవడం చాలా అన్యాయం' అని దులిపేసాను.

'పైగా విస్మరించేది .. రక్తం ధారబోసి మనల్ని కని, పెంచిన తల్లితండ్రులవడం మరింత దుర్మార్గం. శ్మశానంలో కాలి బూడిద అయ్యే వరకే భౌతికంగా కనిపిస్తారు. తర్వాత వాళ్ళని చూడాలనుకున్న చూడలేం. వారి జాడ కూడా కనిపించదు. కానీ మనల్ని వెంటాడేవి .. వాళ్ళతో గడిపిన మధురస్మృతులు. మనం వాళ్లకి పంచిన ప్రేమానురాగాలు. వాటిని మరచిపోవడం ఎంతవరకు న్యాయమో ఆలోచించు. కన్నవాళ్లని మన గుండెలో భద్రపరచుకోవాలి. మనం తల్లితండ్రుల జ్ఞాపక చిహ్నాలుగా మిగిలిపోవాలి. మనకి ప్రేమ పంచిన వాళ్ళకు గతం పీడకల కాకూడదు. మంచి స్వప్నంలా నిలిచిపోవాలి. ఆ బాధ్యత పేగు తెంచుకుని వచ్చి లోకం చూసిన ప్రతి బంధానిది' అన్న నా మాటలకు కిరణ్ నోటివెంబడి మాట రాలేదంకుల్. మౌనమే అతని భాష అయ్యింది. ఆ నిమిషంలో అదే నాకు వరమయింది.

'మన కోసం వాళ్లు ఎన్ని త్యాగాలు చేశారో గుర్తుందా? గుర్తుంటే వాళ్లని పాత సామాను కంటే తక్కువగా విలువ కట్టే వాళ్ళం కాదు' అన్నప్పుడు మొదటిసారి నోరు విప్పాడంకుల్.

'తల్లితండ్రులని చూసే మిషతో నన్ను నమ్ముకొచ్చిన నా భార్యని ఇబ్బంది పెట్టలేను. నా రక్తం పంచుకు పుట్టిన నా బిడ్డ భాద్యత కాదనుకోలేను కదా!' అని కిరణ్ సంజాయిషీ ఇచ్చాడు.


'నిన్ను అలా ఉండమని ఎవరు చెప్పారు? తల్లిదండ్రులు నీ నుంచి ఆశించేది మణులు, మాణిక్యాలు కాదు. పిడికెడు మెతుకులు! గుప్పెడు ప్రేమ! నీ మనసులో చిటికెడు చోటు! అది కూడా నీ భార్యపిల్లల తర్వాతే... నువ్వు నీ కుటుంబంతో సంతోషంగా ఉంటేనే వాళ్లు కూడా సంతోషంగా ఉండేది. అది నీకు అర్థమైతే చాలు. నీ జీవితంలో సమస్యలుండవు. మరో మాట గుర్తుంచుకో కిరణ్! వయసు పెరిగిన వాళ్లకు ఆత్మాభిమానం

ఎక్కువ. ఆత్మాభిమానం దెబ్బతింటే వాళ్లంత ఎత్తు ధనం పోసినా మన దగ్గర క్షణం ఉండరు' అన్న నా సమాధానానికి కిరణ్ నోరు పెగలలేదు. అతనికి ఆ మాట సూటిగా తగిలింది. గతం కళ్ళ ముందు కదిలింది. మరో మాట లేకుండా లేచాడు. ఇక్కడకు ప్రయాణమయ్యాడు" అంటూ మొత్తం చెప్పింది శిరీష.
"ఇది జరిగింది అంకుల్. మీ కుటుంబ విషయంలో జోక్యం చేసుకున్నందుకు నన్ను మన్నించండి. ఆంటీని అలా చూడలేక, చిన్న చొరవ తీసుకున్నాను." అని తల దించుకుని నిలబడింది.

ఆ మాటలు విన్నాక చంద్రశేఖరం మొహంలోకి శరీరంలో ప్రవహించే రక్తమంతా చేరినట్లయ్యింది.
"నువ్వేందుకమ్మా తల దించుకుని నిలబడ్డావు? తల ఎత్తుకుని గర్వంగా నిలబడు. చిన్నదానివైనా కుళ్లిపోతున్న సమాజనికి చికిత్స చేసిన గొప్ప మనసమ్మా నీది! ఒక తల్లి కల నిజం చేసే మంచి పని కోసం ముందుకొచ్చావు. నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా... ఈ తరానికి నీలాంటి వాళ్ళ అవసరం ఎంతైనా ఉంది. వస్తాను రామారావు .. వస్తానమ్మా .. ఆంటీకి అన్నం తినిపించాలి" కృతజ్ఞత నిండిన గుండెతో ఇంటి వైపు కదిలాడు చంద్రశేఖరం.

అతనికి ఇంటి గుమ్మం దగ్గరి చెట్టు కింద దృశ్యాన్ని చూస్తే కళ్ళు చెమ్మగిల్లాయి. కొడుకు కిరణ్, తన తల్లికి అన్నం కలిపి మురిపెంగా ముద్దలు తినిపిస్తున్నాడు. ఈసారి చంద్రశేఖరానికి ఆనందబాష్పలతో కళ్ళు చెమర్చాయి. పక్కింటి మేడ మీద నిలబడి చూస్తున్న శిరీష కళ్ళలో ఆనందం తళుక్కున మెరిసింది. పరస్పరం కలిసిన చూపులలో చంద్రశేఖరం కళ్ళలో కృతజ్ఞత కనిపించింది.

***0***




డా. ఎమ్ సుగుణా రావు

ఆ గదిలో అరగంట నించీ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. నలుగురున్న ఆ గదిలో ఒకరు మాత్రం, తన మానాన తాను ఏదో రాసుకుంటున్నాడు. అతను సంఘమిత్ర. మిగతా ముగ్గురు అతడి అమ్మ, నాన్న, చెల్లాయి. వాళ్ళ ముఖాల్లో ఏదో టెన్షన్. అయినా నోరు విప్పి ఏమీ మాట్లాడలేకపోతున్నారు. కారణం సంఘమిత్ర అంటే వాళ్ళకున్న గౌరవం. అతను పుట్టి బుద్ధెరిగి ఇంట్లో వాళ్ళతో గానీ, బయట వాళ్ళతో గానీ ఒక మాట అనిపించుకోలేదు. అతడి ప్రమేయంతో జరిగిన ఆ సంఘటన గురించి అడగాలా, వద్దా అనే మీమాంశలో ఉన్నారు వాళ్ళంతా!

ప్రతీ రోజూ సాయంత్రం బేంకు నుంచి ఇంటికి రాగానే అతడి చెల్లెలు నవ్వుతూ కాఫీ కప్పుతో ఎదురవుతుంది. అతడి తండ్రిగారూ ఆ సమయానికి స్కూలు నుంచి ఇంటికొచ్చేస్తారు. అంతా కలసి కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగుతారు. ఇది ప్రతీ రోజూ జరిగే నిత్యకృత్యం.

అయితే ఆ రోజు మాత్రం వారి దినచర్యకు బ్రేక్ పడింది. కుటుంబ సభ్యులంతా కలిసారు. కాఫీ తాగుతున్నారు. అయినా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదు. అంతా మౌనవ్రతం పాటిస్తున్నారు.

సంఘమిత్ర తల్లిని అడిగాడు. చెల్లెల్ని బ్రతిమాలాడు. తండ్రిగారిని కోరాడు. అయినా ఎవరూ నోరు విప్పలేదు. అయినా వారంతా ఒక వ్యక్తి కోసం ఎదురుచూస్తున్నారు. అతను కృష్ణమూర్తి. సంఘమిత్ర మేనమామ. తండ్రితో పాటూ అదే ఊళ్లోని స్కూల్లో టీచరు. అతగాడికి సంఘమిత్ర అంటే చనువు ఎక్కువ. అతనితో మాట్లాడిద్దామని అంతా ఎదురుచూస్తున్నారు. ఆ ముగ్గురూ క్షణ క్షణం ద్వారం వైపే చూస్తున్నారు. ఏ చిన్న శబ్దం వచ్చినా .. 'కృష్ణమూర్తి వచ్చాడు' అనుకుంటున్నారు. అలా పావుగంట గడిచింది. అందరికీ విసుగొచ్చి

ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళదామనుకునేసరికి చిన్నగా అడుగుల శబ్దం. అంతవరకూ ఆతృతగా ఎదురుచూస్తున్న కృష్ణమూర్తి ప్రత్యక్షమయ్యాడు.

"రండి మామయ్యా కూర్చోండి!" అన్నాడు సంఘమిత్ర తన రాతపని ఆపకుండానే.
అతడి చెల్లెలు లోపలి నుంచి మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది. తల్లి కాఫీ కలపడానికి లోపలకు వెళ్ళింది.
మంచినీళ్ళు తాగి ఒక్కసారి పరిశీలనగా మేనల్లుడి వంక చూసి చెప్పడం మొదలెట్టాడు -
"ఏంట్రా నువ్ చేసిన పని? పులి నోట్లో తలకాయ పెట్టావ్. పెట్టుకోక పెట్టుకోక, ఆ చెంగల్రాయుడితోనే పెట్టుకున్నావా?!" అన్నాడు ఆవేశంగా.
ఆ మాటలకు సంఘమిత్ర సమాధానం చెప్పలేదు. అతడి తల్లి కాఫీ కప్పులతో వచ్చి "అన్నయ్యా! కాఫీ" అంటూ అందించింది.
కాఫీ కప్పు చేతిలోకి తీసుకుంటూ మళ్ళీ మొదలెట్టాడు.
"దేశంలో అమ్మాయిలే దొరకలేదా స్నేహం చెయ్యడానికి, ఆ చెంగల్రాయుడి కూతురే దొరికిందా నీకు?! చూసావా, మీ అమ్మ, నాన్న, చెల్లి ఎలా భయపడుతున్నారో?!" అన్నాడు.
ఆ మాటలకు సంఘమిత్ర అతడి వైపు తిరిగి -
"నువ్వు చెప్పవలసింది చెప్పెయ్. ఆ తర్వాత నేను మాట్లాడతాను" అంటూ తన రాతపనిలో మునిగిపోయాడు.
"ఏంట్రా చెప్పేది? ఇంత సేపూ మాట్లాడుతున్నా నీకు అర్థం కాలేదా? ఒక్కసారి ఆ పని ఆపి నా పక్కన వచ్చి నించో!" అన్నాడాయన.
సంఘమిత్ర ప్రశ్నార్థకంగా చూసి అతని పక్కన వచ్చి నించున్నాడు.
"చెల్లీ ఇలా రామ్మా?!" అంటూ సంఘమిత్ర తల్లిని పిలిచాడు. ఆమె కూడా వచ్చి నిలుచుంది.
"చూసారా. మనం ముగ్గురం ఒకే హైటు. అంటే ఐదు మూడు. నా పొడుగే నా మేనల్లుడికి వచ్చింది. మరి, ఆ చెంగల్రాయుడు ఎంత పొడుగో తెలుసు?! దగ్గర దగ్గర ఆరడుగుల పొడుగుంటాడు. మరి నువ్వు స్నేహం చేస్తున్న ఆయన కూతురి పొడుగు ఎంత? ఆయనకన్నా కాస్త తక్కువయినా మీ ఇద్దరి పొడుగులూ సరిపోవు. ఇంకా ఆస్తిపాస్తులు! వాళ్ళ కోట్లకు పడగలెత్తినవారు. ఇక చదువు, ఆ అమ్మాయి ఎమ్మే చదువుతోంది. పాపం నువ్వు డిగ్రీతో చదువు ఆపేసి తల్లితండ్రులని సుఖపెట్టాలని బ్యాంకు ఉద్యోగం సంపాదించావే! మనది మధ్యతరగతి కుటుంబం. మనం వాళ్ళ ఎత్తుకు ఎదగలేం. అలాంటప్పుడు ఆ అమ్మాయితో ఎందుకురా ఈ స్నేహాలు? చెంగల్రాయుడి గురించి విన్నావా? చాలా పెద్ద కాంట్రాక్టరు. వారసత్వంగా వచ్చిన ఆస్తిపాస్తులతో పాటూ కాంట్రాక్టరుగా చాలా ఎదిగాడు. అంతా బాగానే వుంటుంది గానీ, తేడా వస్తే రక్తం తాగే రకం అని కూడా అంటారు .. ఇంకో అతి ముఖ్య విషయం ఆయనకు ముగ్గురు కూతుళ్ళు. కూతుళ్ళంటే వల్లమాలిన ప్రేమ! అందుకే కూతుళ్ళ మీద నిరంతరం నిఘా .. ఇద్దరు కూతుళ్ళకు

పెళ్ళిళ్ళు చేసేసాడు తొందరగానే. ఆఖరి కూతురు చదువుకుంటానని గొడవ చెయ్యడంతో ఆయనకు భయం పట్టుకుంది. ఎవరో అనామకుడితో ప్రేమలో పడుతుందని, అందుకే తన జాగ్రత్తలో తను ఉంటాడు...” చెప్పడం ఆపి చెల్లెలు తెచ్చిన కాఫీ త్రాగడం పూర్తి చేసాడు.

“చెప్పడం అయిపోయిందా?” అన్నాడు సంఘమిత్ర.

“ఇంకా కాలేదు. అసలు క్లైమాక్స్ ఇప్పుడే వినబోతున్నావ్!” అన్నాడు.

సంఘమిత్రతో సహా అంతా ప్రశ్నార్థకంగా చూసారు.

“అన్నం ఉడికిందో లేదో చూడాలంటే ఒక్క మెతుకు చాలు. అలాగే చెంగల్రాయుడి కేరక్టర్ గురించి ఒక్కముక్కలో చెపుతాను!” అంటూ ఒక్క క్షణం ఆగి మళ్ళీ మొదలెట్టాడు.

“ఆరు నెలల క్రితం ఒక అబ్బాయి, ఇప్పుడు నువ్వు స్నేహం చేస్తున్న అమ్మాయి వెంట పడ్డాడు. ప్రేమిస్తున్నానంటూ వేధించాడు. ప్రేమలేఖలు రాసాడు. అప్పుడేం జరిగింది! ఒక రాత్రిపూట ఆ కుర్రాడు బండిమీద వస్తూంటే, దారి కాసి ఆ కుర్రాడిని ఎవరో కొట్టారు! ఆ తర్వాత ఆ కుర్రాడి మీద పోలీసు కేసూ నమోదయ్యింది. ఇదంతా చేయించింది ఎవరో మీరు ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది. ఇదిరా అబ్బాయి.. ఆ చెంగల్రాయుడి వ్యక్తిత్వం. ఇప్పటికైనా నీ మనసులో ఏం ఉందో నోరు విప్పుతావా?” అన్నాడు చెప్పడం ఆపిన అతడి మామయ్య.

సంఘమిత్ర తను రాస్తున్న కాగితాలను పక్కన పెట్టాడు. ఒక్కసారిగా కళ్ళు మూసుకున్నాడు. మనసులో ఒక చిత్తరువు. అంతవరకూ వారి చర్చల్లో ఉన్న వ్యక్తి గురించిన ఆలోచనలు. ఆమె కౌస్తుభ. ఎంత చక్కటి పేరు. ఆమెను మొదటిసారి తన బ్యాంకుకు వచ్చినప్పుడు చూసాడు. ఆమె చదువుతున్న కాలేజీకి అనుబంధంగా ఉంది తను పని చేసే బ్యాంకు. ఆమెను చూడగానే తనకు పున్నమినాటి జాబిలి గుర్తుకొచ్చింది. ఆమె పొడుగ్గా వుంది. తెల్లగా వుంది. ముఖంలో నైర్మల్యం... ఏదో పసితనం. తనను రెండోసారి ఒక సాహితీ సమావేశంలో ఆమె కలిసింది. తనకూ సాహిత్యాభిలాష ఉంది. పైగా ఆమె చదివేది ఎమ్మే తెలుగు .. ఎవరో వర్ధమాన కవి రాసిన 'మలిపొద్దు' కవితా సంపుటిని సమీక్షించిన తీరు, తనకు చాలా నచ్చింది. అలా తమ ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది. ఒకసారి ఆమె తాతగారి గురించి చెప్పింది. ఆయన పేరు సుబ్బారాయుడు. చాలా నవలలు, పద్య కావ్యాలు రాసిన పాత తరం రచయిత. ఇంకో మూడు నెలల్లో ఆయన పుట్టినరోజు. ఆయన పేరున ఒక నవలల పోటీ పెడుతున్నారట. బహుమతి లక్ష రూపాయలు. నవల రాయమంటూ తనను ప్రోత్సహించింది. ఆమె చదివే కాలేజీ పక్కనే తన బ్యాంకు. అలా ఇద్దరూ తరచూ కలిసే వీలు కలుగుతోంది. ఒకసారి కౌస్తుభ తండ్రిగారు తమ ఇద్దరినీ చూసారుట. వెంటనే తనకి ఫోన్ చేసి అడిగారు .. తమ ఇద్దరి మధ్య ఉన్న సాహితీ పరిచయం గురించి చెప్పాడు. అయినా ఆయనకి తన మీద అనుమానం పోలేదు. రెండు రోజుల క్రితం నాన్నని పిలిచి కాస్త గట్టిగా చెప్పాడట. 'మా అమ్మాయితో మీ అబ్బాయి స్నేహం వద్దు' అని.

ఆ రోజు తనకూ ఒక అనుభవం ఎదురయ్యింది.

ఆరోజు సాయంత్రం ఆఫీసులో పని అయిన తర్వాత బ్యాంకు నుంచి బైటకొచ్చి, స్కూటర్ స్టార్ట్ చేయబోతుంటే, తన ముందు ఒక భారీ వాహనం వచ్చి ఆగింది. దాంట్లోంచి ఒక పొడుగ్గా వున్న పెద్దాయన దిగాడు. ఏ ఉపోద్ఘాతం లేకుండా చెప్పడం మొదలుపెట్టాడు. తన వంక పరిశీలనగా చూసి "నా పేరు చెంగల్రాయుడు. మీరు స్నేహంగా తిరుగుతున్న కౌస్తుభ నా కూతురు. తమరి హైటు ఎంత?! మిమ్మల్ని అంగుష్టమాత్రుడు అంటారు. తెలుగులో కవిత్వం, కథలు రాసే మీకు దాని అర్థం తెలిసే వుంటుంది. నా అంత పొడుగున్న నా కూతురుతో మీరు స్నేహం చెయ్యడం బాగోలేదు... అంతే!" అతను చెప్పడం ఆపి గబగబా కారెక్కి వెళ్ళిపోయాడు.

అదీ విషయం. తను అందుకే తన కుటుంబ సభ్యుల అందరి ముందూ దోషిలా నిలబడ్డాడు.

"ప్రశాంతంగా కథలు... నవలలూ రాసుకోకుండా ఎందుకురా నీకు ఈ స్నేహాలు...?" మౌనంగా ఉన్న అతడిని అతడి మామయ్య ప్రశ్నించాడు. ఒక్కసారి తన కుటుంబసభ్యులందరి వంకా పరిశీలనగా చూసాడు. ఒక తండ్రి తన పొడుగైన కూతురితో, ఒక పొట్టివాడు స్నేహం చేయవద్దు అనడం తనకు బాధాకరమే! అయితే ఆ తండ్రిగారికి అది ఇష్టం లేదు. తమ స్నేహం ప్రేమగా మారుతుందని భయపడే ఈ హెచ్చరికా అనుకున్నాడు.

"నమ్మండి. ఇద్దరి సాహిత్యాభిలాషుల మధ్య స్నేహం. అంతే! ఇక మీరు వద్దంటున్నారు కనుక ఆమెతో మాట్లాడడం మానేస్తాను... సరేనా?" అన్నాడు.

అంతా ఆ గదిలోంచి ప్రశాంతంగా బయటకు కదిలారు.

* * *

రెండు నెలల తర్వాత -

నగరంలోని ఒక ఓపెన్ ఎయిర్ థియేటర్.

దాదాపు వెయ్యి మందికి పైగా ప్రేక్షకులు. వేదిక మీద పెద్దగా కట్టిన ఫ్లెక్సీ. ప్రముఖ కవి, రచయిత కీర్తిశేషులు సుబ్బారాయుడిగారి జయంతి ఉత్సవాలు - నవలల పోటీ విజేతలకు బహుమతి ప్రధానం. వేదిక మీద రాజకీయ ప్రముఖులు, ప్రముఖ సాహితీవేత్తలు, వారితో పాటూ స్మారక కమిటీ చైర్మన్ చెంగల్రాయుడు, కన్వీనర్ కౌస్తుభ ఆశీనులయ్యారు. ముందుగా వక్తలంతా సుబ్బారాయుడిగారి వ్యక్తిత్వం, సాహిత్య విశేషాలను గురించి మాట్లాడారు. ఆ తర్వాత ఆయన స్మారకార్థం పెట్టిన నవలల పోటీ గురించి ప్రఖ్యాత రచయిత పరశురామ్ తెలియచేస్తారని ప్రకటించారు.

ఆయన లేచి నించున్నాడు. ప్రేక్షకుల్లో ఉత్కంఠ. పోటీ కోసం నవలలు పంపిన రచయితలు ఆ సమావేశానికి వచ్చారు. ఆతృతగా ఫలితాల కోసం చూస్తున్నారు.

ఆయన తన ఉపన్యాసం మొదలుపెట్టారు.

“సభకు నమస్కారం. ఈ నవలల పోటీకి నన్ను న్యాయనిర్ణేతగా ఉంచినందుకు కృతజ్ఞతలు. కీర్తిశేషులు సుబ్బారాయుడిగారి కుటుంబం .. వారి స్మారకార్థం నవలల పోటీ పెట్టడం చాలా సంతోషం కలిగించే విషయం. పోటీకి పాతిక పైగా నవలలు వచ్చాయి. అన్నిటినీ శ్రద్ధగా అక్షరం అక్షరం చదివాను. రాసినవారిలో లబ్ధప్రతిష్టులున్నారు. వర్ధమానులున్నారు. నవల గురి తప్పిన బాణం అనీ, శృతి తప్పిన రాగం అనీ ఆందోళన పడుతున్న సాహితీప్రియుల ఆకాంక్షల్ని సఫలీకృతం చేస్తూ, ఈ పోటీకి నవలలు పంపారు రచయితలు.

హంస నీటిని, పాలను వేరు చేసినట్లుగా.. ఈ నవలల నిశిత పరిశీలన తర్వాత చివరి వరకూ పోటీకి నిలిచినవి రెండు నవలలు. మళ్ళీ శైలి, శిల్పం, వస్తువు. వీటిని ఆధారం చేసుకుని ఉత్తమమైన నవలను ఎంపిక చేయమని ముగ్గురు న్యాయనిర్ణేతలకు ఆఖరి సెలక్షన్ కోసం పంపాము. అందులో ఎన్నికైన బహుమతి పొందిన నవల 'ఆకాశం వంగింది'. మానవ సంబంధాల అవసరాలను, ఆవశ్యకతలను తెలియచేస్తూ, మానవతా విలువలకు పట్టం కట్టిన ఈ నవల నిండా జీవితస్పర్శ ఉంది. ఈ నవల రాసిన రచయిత సంఘమిత్ర.” - అంతా ఒక్కసారిగా సంఘమిత్ర వంక చూసారు. సభ అంతా చప్పట్లతో మారుమోగిపోయింది.

క్షణం ఆగి పరశురాంగారు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టారు.

“అయితే సంఘమిత్రగారు కొన్ని వ్యక్తిగత కారణాల వలన పోటీ నుంచి తన నవలను మినహాయించమని కోరారు. అందువలన పోటీలో రెండో స్థానంలో నిలిచిన వంశీకృష్ణగారి 'ఒక సాహస గాధ' నవలను బహుమతిగా ఎంపిక చేస్తున్నాము. ఆ రచయితను వేదిక మీదకు ఆహ్వానిస్తున్నాము.”

ఆ మాటలకు సభ అంతా నివ్వెరపోయింది. ఒక్కసారి సంఘమిత్ర వంక సానుభూతిగా చూసారు. బహుమతి గ్రహీత వంశీకృష్ణ వేదిక మీదకు వచ్చాడు. ఆయనను ఒక భారీ ఆసనంలో కూర్చోబెట్టారు. శాలువా కప్పారు. ఆ వేదిక మీద ఉన్న ఒక రాజకీయ ప్రముఖుడి ద్వారా లక్ష రూపాయలు చెక్కును అందించారు..

సన్మానం పూర్తయిన తర్వాత కృతజ్ఞతలు తెలియచెయ్యటానికి నిలబడ్డాడు వంశీకృష్ణ. అందరూ ఆసక్తిగా అతడి వైపే దృష్టి సారించారు. అతను మాట్లాడడం మొదలెట్టాడు.

“అందరికీ నమస్కారం. వాస్తవానికి నాకు ఈ పురస్కారం రావలసింది కాదు. సంఘమిత్రగారు పోటీ నుంచి తప్పుకోవడం వలన ఈ విలువైన బహుమతి లభించింది. అసలు సంఘమిత్రగారు పోటీ నుంచి ఎందుకు తప్పుకోవలసివచ్చిందో మీకు తెలుసా?”

అతను సభలోని వారివంక చూసి ప్రశ్నించాడు. అందరి ముఖాల్లోనూ ప్రశ్నార్థకం. అతను మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

“రెండు రోజుల క్రితం సంఘమిత్రగారిని మన సిటీ సెంట్రల్ లైబ్రరీలో కలిసాను. నవలల పోటీకి నవల పంపిన విషయం చెప్పాను. నవల చాలా కష్టపడి రాసానని, నెల రోజులు పూర్తిగా నిద్రపోలేదనీ చెప్పాను. నా నవలకు బహుమతి రావడం నాకు చాలా ముఖ్యమనీ చెప్పాను.”

అతను చెప్పడం ఆపాడు. కళ్ళు తుడుచుకున్నాడు. అంతా ఆసక్తిగా వంశీకృష్ణ వైపే దృష్టి సారించారు. అతను మళ్ళీ ప్రారంభించాడు.

“నాకు తండ్రి లేడు. మా అమ్మ ఇళ్ళల్లో వంటలు చేసి నన్ను ఇంతవాడిని చేసింది. టీచర్ ట్రైనింగ్ పూర్తయ్యింది. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూ పిల్లలకు ట్యూషన్లు చెపుతున్నాను. ఇప్పుడు నా తల్లికి కేన్సర్. ఆపరేషన్ కోసం దాదాపు రెండు లక్షలు ఖర్చవుతుంది. ఎవరో దాతల ద్వారా ఒక లక్ష రూపాయలు సంపాదించాను. మిగతా లక్ష రూపాయలు నవలల పోటీలో బహుమతి వస్తే సరిపోతుందని, నా శక్తివంచన లేకుండా కష్టపడ్డాను - ఆ విషయం సంఘమిత్రగారికి చెప్పాను. ఆయన వెంటనే నా భుజం తట్టారు. బహుమతి మీకే వస్తుంది. మీ తల్లిగారికి ఆరోగ్యం బాగుపడుతుందని చెప్పారు. ఆ రోజే ఆయనకు బహుమతి వచ్చినట్టు తెలిసింది. మరైతే నాకెలా వస్తుంది?!” అతను చెప్పడం ఆపి సభలోని వారి వంక చూసాడు. అంతా నిశ్శబ్దం. ఒక్క క్షణం ఆగి మళ్ళీ మొదలుపెట్టాడు.

“ఆయన ఆఖరి క్షణంలో తనకొచ్చిన బహుమతిని నిరాకరించారు. కారణం ఈ క్షతగాత్రుడి తల్లిని కాపాడడం కోసం.” అతను చెప్పడం ఆపి ప్రేక్షకులు కూర్చున్నవైపు పరిగెత్తాడు. తనకు మెడలో వేసిన పూలదండను సంఘమిత్ర మెడలో వేసాడు. శాలువాను కప్పి రెండు చేతులూ జోడించాడు.
ఒక్కసారి సభ అంతా ఆశ్చర్యపోతూ ఆ దృశ్యాన్ని వీక్షించారు.

అంతవరకూ వేదిక మీద మౌనంగా ఉన్న చెంగల్రాయుడు లేచి నించున్నాడు. మైకు అందుకున్నాడు. ఒక్కసారి సభ అంతా పరిశీలనగా చూసాడు. వెంటనే గొంతు విప్పాడు.

“సభలోని మిత్రులకు, వేదిక మీద పెద్దలకు నమస్కారం. రెండు నెలల క్రితం నేను సంఘమిత్రగారిని అవమానపరిచాను. మా అమ్మాయితో స్నేహం చెయ్యొద్దు అంటూ బెదిరించాను. ఇంకో మాట కూడా అన్నాను. అదే “అంగుష్టమాత్రుడు”. ఔను... ఆ అంగుష్టమాత్రుడు మనకు అందనంత ఎత్తుకు ఎదిగిపోయాడు. ఔను... ఒక తల్లిని అనారోగ్యం నుంచి కాపాడడానికి విలువైన పురస్కారాన్ని ఏమీ కాకుండా వదిలేసాడు. సాహసవంతులు మాత్రమే ఇలాంటి మహా కార్యాలు చెయ్యగలరు. మా అమ్మాయి కౌస్తుభ ఈ మధ్య నాకొక కవిత వినిపించింది. అది ఎవరు రాసారో నాకు తెలీదు. ఆ మహాకవికి నా ప్రణామాలు. వినండి ఆ కవితలోని వాక్యాలు -


భూమి మరుగుజ్జులను కోరుకోదు
అది ఎత్తైన మహా పురుషుల్ని కోరుకుంటుంది
అయితే దేవా! నేనెవర్నీ ఆలింగనం
చేసుకోలేనంత ఎత్తు మాత్రం నాకివ్వకు
ఏ చెట్టూ పెరగని, ఏ మొక్క మొలవని
గడ్డి మొలకెత్తని, కేవలం మృత్యువులాంటి
మంచు నిండిన పర్వత శిఖరాగ్రం లాంటి ఎత్తు వద్దు -

ఆ కవిత చెప్పిన చెంగల్రాయుడు తన కన్నీళ్ళను ఆపుకోలేకపోయాడు. వలవల ఏడ్చాడు. కరడుకట్టిన అతడి రాతి హృదయంలో నుంచి మానవత్వపు చెలమ మెల్లగా ఊరిందేమో! అతనికే తెలీని అతని లోని ఇంకో మనిషి బయటికొచ్చాడు. ఆ సభలోని వారంతా అతడి లోని ఈ మార్పుకు ఆశ్చర్యపోతూ విస్మయంగా అతడి వంకే చూస్తూ ఉండిపోయారు.

***0***

కథా మంజరి

# ఆకాశానికి గుంజలు



## చాగంటి ప్రసాద్

ఆ ఇంటికి జనం తండోపతండాలుగా వచ్చి వెళుతున్నారు. అంపశయ్య మీద భీష్ముడిలా మంచం మీద పడుకుని వున్నాడు ధన్వంతరి. ముందు వరండాలో విచార వదనంతో పచార్లు చేస్తున్నాడు నాగమోహన్. సెల్ రింగవడంతో ఆన్ చేసాడు.

"సార్! మీరు నాలుగు రోజుల నుంచి ఆఫీసుకు రాకపోవడంతో విషయం తెలుసుకుందామని.." అన్నాడు అవతల వ్యక్తి.

"ప్రకాష్! మా ఇంటి ప్రక్కనున్న ధన్వంతరిగారి ఇంటికి రాగలవా?" అన్నాడు నాగమోహన్.

"ష్యూర్" అన్నాడు ప్రకాష్.

పది నిముషాల్లో ప్రకాష్ ధన్వంతరి ఇల్లు జేరుకున్నాడు. ఎప్పుడూ తుళ్ళుతూ, గలగల మని నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఉండే నాగమోహన్ విచారంగా ముఖం పీక్కుపోయి ఉండడం గమనించాడు .

"గురువుగారు! ఏంటి ఈ అవతారం ? ఏమైంది ?" అన్నాడు ఆతృతగా.

"మా అందరికీ అత్యంత ఆప్తుడు కొన ఊపిరితో ఉన్నాడు ప్రకాష్! " అని నిట్టూర్చాడు.

సుందర్ నగర్ కాలనీలోని నాలుగు రోడ్ల మధ్యలో కమ్యునిటీ హాలు. ఆ హాలుకి ఎడమ పక్క వీధిలో అపార్టుమెంట్ల మధ్యలో ఒక చిన్న స్థలంలో చిన్న పెంకుటిల్లు. ఆ ఇంటి మధ్య గదిలో ఒక మంచం మీద, ముక్కులో, నోటిలో గొట్టాలతో, అపస్మారక స్థితిలో మంచానికి అతుక్కుపోయి బక్క పల్చగా ఉన్న ఒక మనిషిని చూసాడు ప్రకాష్.

ఆ ఇంటి అరుగుమీద కాలనీ జనం దిగాలుగా కూర్చున్నారు. అందరి మొహాల్లో ఆందోళన. డిసెంబర్ మాసపు చలి వారిని చలింపనీయడం లేదు. ఆ ఇంటి అరుగు మీద కూర్చుని, మధ్య మధ్యలో అంగీతో కళ్ళు తుడుచుకుంటున్న ఒక నడి వయస్సు అతను "దేవుడికి దయ లేదు" అంటూ బాధపడుతున్నాడు. నాగమోహన్ "వూరుకో విశ్వం!" అని సర్ది చెప్పాడు.

కథా మంజరి

ఎవరీ మంచం మీద అతను ? ఇంత మంది ఎందుకు దుఃఖిస్తున్నారు? ఎవరయినా వి.ఐ.పి. నా? అని మనసులో అనుకుంటూ ఆ సందేహాన్ని పైకే వ్యక్తం చేశాడు ప్రకాష్. "చీమ తలకాయంత సాయం చేసి, ఏనుగంత గొప్పలు చెప్పే పటాటోప వి.ఐ.పీ.ల్లాంటి వాడు కాదు, స్టేజులెక్కి డబ్బాలు కొట్టించుకొనే సెలిబ్రిటీ కాదు, ఒక సామాన్యుడు! కానీ మా అందరికీ ప్రేమ పంచడంలో అసామాన్యుడు. ధన్వంతరి అని చెప్పానే. ఆయనే ఈయన" ... అన్నాడు నాగమోహన్ .

"ఇంత బిజీ ప్రపంచంలో ఒక మనిషి కోసం ఇంతమంది తాపత్రయపడడం .... నమ్మ లేకుండా ఉన్నాను!"
"ప్రకాష్ ! అతని పేరు ధన్వంతరి. మా కాలనీలో అతన్ని ఆప్యాయంగా 'ధను!" అని పిలుస్తాం. మా సుందర్నగర్ కాలనీలో ప్రతి మనిషి, ప్రతి కుటుంబం ఎంతో కొంతైనా అతనికి ఋణపడే వుంటుంది.. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో ఉన్నాడు!" అన్నాడు కళ్ళు తుడుచుకొంటూ..........
"చూస్తున్నాంగా! ప్రస్తుత ప్రపంచంలో మనిషిని మనిషి పలకరించుకునే పరిస్థితి, సాయపడడం అసలే లేదు. ఎవ్వరిని పలకరించిన బిజీ బిజీ. మొక్కుబడి కోసం వికసించని పువ్వులాంటి నవ్వు. ఎదురుపడితే ఎక్కడ మాట్లాడవలసి వస్తుందోనని, పని ఉన్నట్టు తప్పించుకొని తిరిగే, శిలా సదృశమైన మనుషుల మధ్య జీవించాడు. మనిషి అందగాడు కాదు. చెప్పుకోదగ్గ పర్సనాలిటీ లేదు. బాహ్య సౌందర్యానికి, పై పై మెరుగులకు ప్రాధాన్యత ఇచ్చే ఈ రోజుల్లో ఎవరని అతన్ని ప్రేమించ గలరు? కానీ ధను తన అవ్యాజమైన ప్రేమనంతా పంచి, ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయాడు,.....వీళ్ళందరి ప్రేమ పొందేడు!" అని చుట్టూ ఉన్న వాళ్లకేసి చూపించాడు.
"గురువు గారు.. అతనికి ఎవ్వరూ లేరా?"
"ఎందుకు లేరూ.. ఈ వసుధైక కుటుంబమంతా అతనిదే !
"ఈ కాలనీ ఏర్పడడానికి ముందే ఇక్కడ ఈ ఇంట్లో ఉన్నాడు. తిండిలేక ఫుట్ పాత్ మీద పడుంటే తీసుకొచ్చి పెంచుకున్న ఒక తండ్రిలాంటి వాడు, తన తదనంతరం ఈ ఇల్లు, బ్యాంకులో కొంత డబ్బు అప్పగించి కన్నుమూసాడుట. మా ప్లాట్లు కట్టడానికి ముందే ఇక్కడ ఈ ఇంట్లో ఉండేవాడు. తర్వాత తనని తాను పరిచయం చేసుకుంటే, ఎవరు అతన్ని పట్టించుకోలేదు. పెద్దగా చదువుకో లేదు, తన ఉదర పోషణార్థం అన్ని రకాల పనులూ చేసేవాడు. ఒక కొట్లో పద్దులు రాసేవాడు"........అన్నాడు నాగమోహన్.
"చాలా ఇంటరెస్టింగ్ వుంది .. ఎలా మీ అందరికి ఇంత ఆప్తుడయ్యాడు?"
"మొదట్లో కాలనీ వాళ్ళెవరికీ అతనొకడు తమ పక్కనే నివాసం ఉంటున్నాడనే ధ్యాసే లేదు. అంతెందుకు నేనూ పట్టించుకోలేదు. అది ఈ రోజుల్లో సాధారణమై పోయింది కదా! కానీ ఒక రోజు జరిగిన సంఘటన అతని ఉనికి అందరికి తెలియజేసింది. మాకు దగ్గర చేసింది!" అన్నాడు. ఇంతలో..........

ఒక భార్యభర్తల జంట వచ్చి గదిలోకి వెళ్ళి ధన్వంతరి కాళ్ళ దగ్గర కూర్చుని నెమ్మదిగా ఏడుస్తున్నారు. నాగమోహన్ లోపలికి వెళ్ళి, వాళ్ళని అనునయించి బయటకు పంపించాడు.

"అదుగో. ఇప్పుడు వచ్చి వెళ్లారే! వాళ్ళకు ఒక అమ్మాయి. లేక లేక చాలా ఏళ్ళకు పుట్టింది. ఈ ఇంటికి పక్కన ఉండే అపార్టుమెంటులో ఉండే వాళ్ళకు, ఆ పిల్లే ప్రపంచం, సర్వస్వం. ఒక రోజు వంటింట్లో పని చేసుకోవడానికి వెడుతూ హాల్లో ఆ పిల్లని వదిలి పెట్టి వెళ్ళింది. ఇంతలో ఎవరో కొంతమంది దుండగులు ఆ పిల్లని ఎత్తుకు పోతుంటే, అరుగు మీద కూర్చున్న ధన్వంతరి ఒక్క ఉరుకులో వాళ్ళని పట్టుకున్నాడు. వాళ్ళు అతనిని కాస్త గట్టిగానే దెబ్బలు కొట్టారు. అయినా విడవకుండా ఆ పిల్లని వాళ్ళ చేతుల్లోంచి లాక్కున్నాడు. జనం పోగయ్యేలోపులో వాళ్ళు పారిపోయారు. వాళ్ళు చేతిలో ఉన్న ఆయుధాలతో కొట్టిన దెబ్బలకు, అతని తలకి దెబ్బ తగిలి రక్తం ప్రవహించింది. అయినా అతను తన ప్రాణాలు లెక్కచేయక ఆ చంటిపిల్లని రక్షించాడు. అప్పటినుంచి ఈ దంపతులకి ఆపధ్బాంధవుడయ్యాడు"

"అవునా ! ఎంత మంచి వాడు! తన ప్రాణాలు లెక్క చేయకుండా అలా పోరాడంటే గ్రేట్ సర్ అతను".....అన్నాడు ప్రకాష్ ఆశ్చర్యపడుతు!

ఇంతలో ఒక వీల్ చైర్ తోసుకుంటూ ఒక వృద్ధుడు, ఇంటి ధగ్గరకు వచ్చి అతి కష్టం మీద లేవబోతుంటే, నాగ మోహన్ ఆయనా దగ్గరకు పరిగెత్తుకుంటూ వెళ్ళి సాయం చేయబోయాడు...... ఆయన "పర్వాలేదు" అని వారించాడు. నెమ్మదిగా ఆ వీల్ చైర్ నే ఆనుకుని నిలబడి కిటికీ లోంచి చూస్తూ కళ్ళు తుడుచుకుంటూ, కాసేపు అలాగే ఉండి పోయాడు. ఆ తర్వాత నెమ్మదిగా వీల్ చైర్ నడుపుకుంటూ వెళ్లిపోతూ "జాగ్రత్తగా చూడండి. ఇలాంటి అరుదైన మనుషుల కొరత బాగా ఉంది ఈ లోకంలో!" అన్నాడు.

కాలనీ జనం అందరూ, ఒకరి తర్వాత ఒకరు వచ్చి, ధన్వంతరిని చూసి, బయటకి వచ్చి నిలబడి ......

"మంచి వాళ్ళని దేముడు త్వరగా తీసుకుపోతాడు!" అని బాధపడుతున్నారు.

నాగమోహన్ చెప్పడం కొనసాగిస్తూ.........

"ఇప్పుడు వీల్ చైర్ లో వచ్చి చూసిన ఆయన, మా కాలనీలో ఉండే రిటైర్డు ఆర్మీ ఆఫీసర్ నీలాద్రి గారు. ఆయన పిల్లలు అమెరికాలో ఉంటారు. ఎవ్వరూ పట్టించుకోరు. భార్యకి అల్జీమర్సు ఎటాక్ అయ్యింది. తోడుగా నా అన్నవాళ్లు ఎవ్వరూ లేరు. కొన్ని ఏళ్ళ నుంచి ధన్వంతరియే ఆ దంపతులకు పెద్దదిక్కు అయ్యాడు"

"నిజం సార్! ఆ పెద్దాయన చెప్పింది. ఇలాంటి వాళ్లు అరుదుగా ఉంటారని! ఇప్పుడు వాళ్ళ పరిస్థితి కష్టమే పాపం. ఎవరు చూస్తారో?" అని బాధపడ్డాడు ప్రకాష్.

"ఆ బాధ్యత నేను తీసుకుంటున్నాను ప్రకాష్!" అని ధృఢంగా చెప్పాడు.

ఇంతలో ఒక యువకుడు వచ్చి ... 'సర్! ధను అంకుల్ కి రక్తం ఏమైనా అవసరముంటుందా? చాలామంది సిద్ధంగా ఉన్నారు ఇవ్వడానికి' అని వినయంగా అడిగాడు.

“అవసరం లేదు సాకేత్! ... అవసరమయితే నేనే ఫోన్ చేస్తాను!” అని అతని భుజం మీద తట్టి, అనునయంగా చెప్పాడు .

అతను వెళ్ళిన వైపు చూస్తూ,.....

“ధను క్రమం తప్పకుండా రక్త దానం చేసేవాడు. మా అందరిని ఆ క్రతువులో భాగస్థులని చేసాడు. ఐదు వందలమంది ఒక గ్రూపుగా ఏర్పరచి, ఎవ్వరు ఏ క్షణాన రక్తం అడిగినా ఇచ్చేటట్టు, మమ్మల్ని సిద్ధం చేసాడు. ఈ రోజు ధన్వంతరికి రక్తం అవసరముంటుందేమోనని వేల మంది ఫోన్లు చేస్తున్నారు, వచ్చి వెడుతున్నారు. ఇతని లాగే. కానీ అతనికి ఆ స్టేజ్ దాటి పోయింది. ఇంక తీరవలసిన కోరిక ఒకటి మిగిలిపోయింది.”

“ఏమిటి ఆ కోరిక?” అని ఆతృతగా అడిగాడు ప్రకాష్. ఇంతలో, ఎవరో ‘లాయర్ గారు పిలుస్తున్నారని’ చెప్పడంతో, నాగ మోహన్ పక్కకి వెళ్ళాడు. ప్రకాష్ అక్కడే అరుగు మీద కూర్చున్నాడు అతను వచ్చే వరకు.

తిరిగి వచ్చిన నాగమోహన్ తో ప్రకాష్ ......

“మర్చిపోయాను, ఇంతకీ అతను ఎందుకు కోమాలోకి వెళ్ళి పోయాడు? హాస్పిటల్లో ఉంచక, ఇక్కడ ఎందుకు ఉంచారు?” అని ఆదుర్దాగా అడిగాడు.

నాగమోహన్ గద్గదమయిన స్వరంతో.........

“పది రోజుల క్రితం నేను ఆఫీస్ లో ఉండగా, ధన్వంతరి 'సారు ! ఊరెళ్ళుతున్నాను రేపు వచ్చేస్తాను’ అని ఫోన్ చేశాడు . ఎక్కడికి అని అడిగితే , తనకి పరిచయం అయిన ఒక చిన్న రైతు విత్తనాలు కొనడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతుంటే, తన దగ్గర ఉన్న కొంత సొమ్ము అతనికి ఇద్దామని వెడుతున్నానని చెప్పాడు.

“ఎందుకు అందరికి పంచిపెడతావు! నీ జీవితం వెళ్ళక్కర్లేదా? అని కొప్పడితే.. నా దగ్గర వుండడం కన్నా, ప్రాణవసరం వచ్చిన అతనికి ఇవ్వడం వల్ల ఈ సొమ్ము సార్ధకం అవుతుంది!’ అన్నాడు. తర్వాత మాకు తెలిసిన విషయం ఏంటంటే, వూరి పొలిమేరల్లో ఎవరో ఈ డబ్బు కాజేయ్యడానికి దాడి చేస్తే, ఆ పెనుగులాటల్లో, ఒక పెద్ద బండ రాయి పైన పడడంలో తలకి బలమయిన గాయం అయ్యింది. మేమందరం హుటాహుటిని తీసుకొచ్చి హాస్పిటల్ లో జాయిన్ చేశాం. తలకి ఆపరేషన్ కూడా చేయించాము. ఎంత ఖర్చు అయిన పర్వాలేదని డాక్టర్లని ప్రాధేయపడ్డాం! చివరిసారిగా నాతోనే మాట్లాడాడు. చాలా విషయాలు కూడదీసుకుని చెప్పి, కోమాలోకి వెళ్లిపోయాడు. ఎంత ప్రయత్నించిన `మనలోకి` రాలేదు. అందరం అతన్ని బ్రతికించుకోవడానికి సర్వ విధాల ప్రయత్నం చేసాం. డాక్టర్లు ఇంక ఆశ లేదు, తీసుకు పొమ్మన్నారు. అందుకనే అతని ఇంట్లోనే వుంచి మా కాలనీ డాక్టర్ సాయంతో రోజు వైద్యం చేయిస్తున్నాం."

“నాగమోహన్ సారు చెప్పిన ఆ చిన్న రైతును నేనే! నాకు ఇత్తనాలకి డబ్బులిద్దామని, తన పానం పొగుట్టుకున్నారు ఈ సామి!” అని భోరుమంటూ మోకాళ్ళలో తల దాచుకొని కుమిలిపోతూ అరుగు మీద కూలబడిపోయాడు విశ్వం.

చీకటి పడుతోంది. అక్కడ కూర్చున్నా కాలనీవాసుల్ని ఇళ్ళకి పంపి, నాగమోహన్ హాల్లో లైటు వేశాడు. ఈ ధన్వంతరి బెడ్ దగ్గరకు వెళ్ళి అతని దుప్పటి సరిచేసాడు. గదిలోంచి బయటకి వచ్చి...... “ధనుతో నాకు కూడా విడదీయరాని అనుబంధం ఏర్పడింది ప్రకాష్ ! కాలనీలో మొట్ట మొదటసారి అతన్ని కలిసినప్పుడు, అతని కన్నుల్లో ఒక విధమైన కరుణని కనిపెట్టాను. ఒక సంఘటనతో అతని ప్రేమకి దాసోహం అయ్యాను" అన్నాడు.

“ఎలా ?"

“ఆ రోజు మన ఆఫీసులో ఆడింటింగ్ జరుగుతోంది. చాలా టెన్షన్ గా ఉంది. ఇంత ఒత్తిడిలో అమ్మకి హార్ట్ ఎటాక్ వచ్చిందని ఫోను. వెంటనే నేను పరుగెత్తాలి. కానీ నేను ఊరికి దూరంగా యూనిట్ ఇనస్పెక్షన్లో ఉన్నాను. నా భార్య కంగారుగా అంబులెన్స్ కోసం ఫోన్ చేసింది. వచ్చే లోపు ఏం చేయాలో తెలియని స్థితి. ఎలాగ తెలిసిందో ధనుకి! అన్నం మధ్యలో చేయి కడుక్కొని గబగబ వచ్చి మా అమ్మ గుండెలమీద చేతులతో ఫస్ట్ ఎయిడ్ చేసాడుట. నోటితో గాలి పీల్చి, ఆమె ఊపిరి అందుకునేలా చేసి, అంబులెన్సు రాగానే తాను కూడా వెళ్ళి, హాస్పటల్లో జాయిన్ చేశాడు. డిశ్చార్జ్ అయ్యేవరకు అమ్మకు తోడుగా ఉన్నాడు. 'అన్నగారు! మీరు ఆడిటింగ్ హాజరవ్వండి. కంగారు పడకండి.. నేనున్నాను!' అని భరోసా ఇచ్చాడు. అప్పటినుంచి మా కుటుంబ సభ్యుడై పోయాడు. నన్ను అన్నా.. అని ఆప్యాయంగా పిలిచే దేముడిచ్చిన తమ్ముడు ఈ ధను!"

“నేను ట్రైనింగ్ కి వెళ్ళినప్పుడు జరిగిందా గురువుగారు.. ఈ సంఘటన? '

“అవును ! ప్రకాష్ !"

“నాగమోహన్ గారు! ఈ రోజు నేను ఇక్కడకు రాకపోయి ఉంటే, ఒక దేముడి దర్శన భాగ్యం కోల్పోయే వాడిని. గుప్పెడంత మనిషి! సముద్రమంత హృదయమున్నవాడిని చూపించారు. `దైవం మానుష రూపేణా! అనే దానికి నిలువెత్తు రూపం ఈ ధన్వంతరి !” అని అప్రయత్నంగా అతని కాళ్ళకు దణ్ణం పెట్టాడు ప్రకాష్.

“అతని సహృదయానికి తార్కాణాలు కొన్నే నీకు ఉదహరించాను ప్రకాష్ ! ఒక్క మనిషి ఇంత మందిని ఎలా ఆదుకోగలడు అని సందేహం రావచ్చు. మనిషిగా ఆలోచిస్తే, ఎవరైనా ఇలా చేయచ్చు అని నిరూపించాడు... ధను!” అంటూ బయటకి నడిచాడు నాగమోహన్.

“చిన్న మాట గురువుగారు! ఇందాకా మీ మాటల్లో ధన్వంతరి చివరి కోరిక మిగిలిపోయింది అన్నారు. అదేంటి?” అని అడిగాడు ప్రకాష్.

“ తర్వాత  చెప్తాను! పొద్దు పోయింది.  వెళ్ళిరా! మళ్ళీ మాట్లాడుకుందాం.”  అన్నారు.

***

డిసెంబర్ నెల వెళ్లిపోయింది. చలి మాత్రం తన టైమింకా పూర్తిగాలేదని అలాగే వణికిస్తోంది. ధన్వంతరి మరింత కృశించిపోయాడు. అతని సంరక్షణ చూడడానికి కాలనీ వాసులందరు ఒకరి తర్వాత ఒకరు వంతులు వేసుకుని దగ్గర  ఉంటున్నారు. జనవరి నెల.  పుష్య మాసం పెద్ద పండగ ఐన సంక్రాంతి సంబరాలు జరపడం ఈ సారి మానేద్దమని కాలనీ వాసులు అనుకున్నారు.

పిల్లలందరు పేచీ పెడితే  భోగిమంటలు వేసారు. సంక్రాంతి పండగ వచ్చింది. ఉత్తరాయనం వచ్చింది. ఈ లోగా, అస్సలు వదలకుండా ధన్వంతరిని అంటిపెట్టుకుని, కంటికి రెప్పలా చూసుకుంటున్న విశ్వం పరుగెత్తుకుంటూ వచ్చి అతనికి స్పృహ వచ్చిందని చెప్పగానే అందరూ ఎక్కడి పనులు అక్కడ వదిలేసి పరుగెత్తారు. అతను  ఒక్క క్షణం అందరి కేసి బరువుగా కన్నెత్తి చూసాడు. మొహంలో విచిత్రమైన తేజస్సు, చెరగని చిరునవ్వు, అంతలోనే చిరు విషాదం ఆవిరించింది.  నాగమోహన్  అతని దగ్గర కు వచ్చి......
“ధను! నువ్వు కోరినట్టే జరిపించాను. ఇవిగో కాగితాలు!” అని చూపించాడు.  అవి చూడగానే తృప్తిగా నెమ్మదిగా తలాడించాడు. చేయి ఎత్తడానికి  ప్రయత్నం చేసాడు. కాని స్వాధీనమవ్వలేదు. అందరి వైపు ఒకసారి చూసి, మరలా నిద్రలోకి  జారుకున్నాడు శాశ్వతంగా. కాలనీ అంతా కలిసి ఒక పెద్ద ఊరేగింపుగా వెళ్ళి  అతనికి దగ్గరుండి  అంతిమ సంస్కారాలు జరిపించారు. కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. విషాద వార్త తెలిసిన ప్రకాష్  ఆఖరి సారి ఆ పుణ్యాత్ముని దర్శనం చేసుకున్నాడు.

***

"ప్రకాష్ ! ధనుకి మిగిలిపోయిన  చివరి  కోరిక అడిగావు కదా! అతనికి ఎవరూ లేరని అనుకున్నాం! కానీ ఒక తమ్ముడు ఉన్నాడుట. కొంత కాలం క్రితం వచ్చి ధనుని కలిసాడుట.  ఎంతో విలువ చేసే ఈ ఇంటిమీద అతని కన్ను పడిందిట. నా దగ్గర చెప్పుకుని ఏడ్చాడు. తోడపుట్టిన వాడు నా కోసం రాలేదు. నా ఆస్తి కోసం వచ్చాడు. ఈ ఆస్తి నా స్వార్జితం  కాదు కదా!  అందుకనే తనకి ఒక సాయం చేసి పెట్టమని అడిగాడు.”
“ ఏంటది సర్!”
“ఈ ఇంటిని ఒక అనాధ శరణాలయంకి  విరాళంగా ఇచ్చినట్టు నన్ను రాయించమన్నాడు. తన బ్యాంక్ లో ఉన్న తాను సంపాదించిన  డబ్బులన్నీ,  తమ్ముడి  పిల్లల పేర మార్చేయ్యమన్నాడు . హాస్పిటల్ ఖర్చుకీ, అంతిమ సంస్కారాల ఖర్చుకి కూడా  తన డబ్బులే వాడమన్నాడు.  నేను అభ్యంతరం పెడితే, అది నేను

ఎప్పుడో నా చివరి దశ కోసం ఉంచుకున్నవే! నేను ఎవ్వరికి ఋణ పడడం ఇష్టం లేదు అన్నాడు!" అని నాగమోహన్ నిట్టూర్చాడు.

"కోమాలోకి వెళ్లిపోతూ, అతను చెప్పిన అభ్యర్థనలన్నీ లాయర్ చేత రికార్డు చేయించి, రిజిస్ట్రేషన్ చేయించాను. అది కాక, అతను తన అవయవ దాన పత్రాలు ఎప్పుడో రాసేశాడు. అవి కూడా ఎవరికో ఉపయోగపడతాయి.!" అంటూ నాగమోహన్ ఒక్కసారి ఆగాడు.


"నా చిన్నప్పుడు ఒకసారి సందేహం వచ్చి, మా అమ్మని 'పైన ఉన్న ఈ ఆకాశం.. ఏ ఆధారం లేకుండా ఎలా ఉంది? పడిపోదామ్మా!" అని భయపడుతూ అడిగానుట. 'ఈ భూమ్మీద మానవత్వం మూర్తీభవించిన మనుషులే ఈ ఆకాశానికి గుంజలు. అలాంటి వాళ్ళు ఉన్నంత వరకు, మనకి ఏ భయం లేదురా' అని చెప్పింది.. అప్పుడు ఆ మాటలు నాకు అర్థం కాలేదు, కాని ఇప్పుడు ధన్వంతరి గురించి విన్నాకా నాకు పూర్తిగా బోధ పడింది సర్!" అన్నాడు ప్రకాష్.

"గర్వం, ధన మదం. ద్వేషం, స్వార్థం లాంటి రోగాలతో బాధపడుతున్న మమ్మల్ని.. తన మంచితనం, ప్రేమ, సాయం అనే మందులతో నయం చేసిన ధన్వంతరి స్వరూపుడు మా ధను! అలాంటి వాళ్ళకి కొరత రాకుండా చూసుకుంటూ, మేము కూడా ఆ దిశగా ప్రయాణం సాగిస్తున్నాము. అదే మేము ధన్వంతరికి ఇచ్చే నివాళి!" అని నాగమోహన్ ధృఢ నిశ్చయంగా కాలనీ మధ్యకి నడక సాగించాడు ., అతనిని తో పాటు ఎందరో !

***0***

# నాలుగక్షరం ముక్కలు

## కృపాకర్ పోతుల




వాతావరణం వేడిగా ఉండడంతో, కిలోమీటరు దూరం నడిచేసరికే చెమటలు పట్టేసాయి అబ్రహాంగారికి. గమ్యస్థానం చేరుకున్నాక, నడుంమీద చేతులు రెండూ ఉంచుకొని, తల పైకెత్తి, ఎదురుగా కనిపిస్తున్న తెల్ల రంగు సైన్ బోర్డు వేపు చూసారు. "మత్తయ్య మెమోరియల్ హాస్పిటల్" అన్న ఎర్ర రంగు అక్షరాలూ, దానికి అటూ ఇటూ 'రోగుల్ని స్వస్థపరుస్తున్న యేసుక్రీస్తు బొమ్మలూ' చూసి ఆయన కళ్ళు ఆనందంతో మెరిసాయి. చిన్నగా నవ్వుకుంటూ లోపలికి ప్రవేశించారు.

హాస్పటల్ ఆవరణ రోగులతో కిటకిటలాడుతోంది. డాక్టర్ రూములోకి తొంగిచూస్తే ఆయన పేషెంటుతో బిజీగా కనిపించాడు. కూర్చుందామంటే ఎక్కడా ఖాళీ కుర్చీ ఒక్కటి కూడ కనిపించలేదు. ఇంతలో అబ్రహాంగారిని గుర్తుపట్టిన నడి వయసు వ్యక్తి ఒకడు లేచి నిలబడి, తను కూర్చున్న కుర్చీ ఆయనకి ఇవ్వడంతో, బ్రతుకు జీవుడా అంటూ అందులో కూలబడ్డారు. "ఉష్...అని నిట్టూర్చి, వీలైనంత వెనక్కి, అలసటగా జారబడి కళ్ళు మూసుకున్నారు. కొద్దిసేపటికి నెమ్మదిగా ఆలోచనల్లోకి జారిపోయారు.

***

"పడుకోలేదూ, ఇంకా దాని గురించే ఆలోచిస్తున్నారా" తువ్వాలుతో చేతులు తుడుచుకుంటూ వంట గదిలో నుంచి బయటకు వచ్చిన జెస్సీ అడిగింది అబ్రహాంని. నిరాసక్తంగా పైకప్పు వేపు చూస్తూ, మంచంమీద వెల్లకిలా పడుకున్న అబ్రహాం భార్య వేపు నిర్లిప్తంగా చూసి, తల ప్రక్కకు తిప్పుకొని, కళ్ళు మూసుకున్నాడు.

"ఏమీ బెంగపడకండి. అన్నిటికీ ఆ ప్రభువే ఉన్నాడు. అంతా మంచే జరుగుతుంది" అంటూ, భగవంతుడ్ని తలంచుకొని, రెండు చేతులూ జోడించి దండం పెట్టుకుంది. తరవాత భర్త ప్రక్కనే నడుం వాల్చి, పది నిమిషాల్లోనే గాఢమైన నిద్రలోకి జారిపోయింది.

అబ్రహాంకి మాత్రం కునుకు పట్టట్లేదు. ఆలోచనలతో తల పగిలిపోతోంది. వాళ్ళబ్బాయి శ్రీహర్ష చదువుతున్న కాలేజీ నుండి వచ్చిన ఫోనుకాలే చెవిలో గింగురుమంటోంది. ప్రిన్సిపాల్ మాటలు గుర్తొచ్చి, అంతులేని ఆందోళనకు గురౌతున్నాడు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న హర్ష, రెండు వారాలుగా కాలేజీకి ఎగనామం పెడుతున్నాడన్న విషయం .. ఆ రోజు వరకూ తెలియనే తెలీదు అబ్రహాంకి. స్వయంగా

ప్రిన్సిపాల్ నోటినుండే విన్న దగ్గర నుండీ మనశ్శాంతి కరువైంది. విషయం భర్త చెప్పగా విన్న జెస్సీ ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టింది.

***

మరసటి రోజు ప్రిన్సిపాల్ని కలిసాడు అబ్రహాం. 'మీవాడు కాలేజీకి రెగ్యులర్గా రాడు. వచ్చినా క్లాసులో విపరీతమైన అల్లరి చేస్తాడు. అలాంటివాడు మా కాలేజీలో ఉంటే మాకు చెడ్డ పేరు. వుయ్ డు నాట్ వాంట్ హిమ్ హియర్. టేక్ టి.సీ. ఎండ్ గో అవే!' అని గట్టిగా అరిచిందావిడ. రెండు వారాలు టైం ఇమ్మని బ్రతిమాలి అతికష్టం మీద ఒప్పించాడావిడని. అవమానభారంతో ఇంటికి చేరుకున్నాడు. జెస్సీ కూడా, స్కూలుకి వెళ్లకుండా, భర్త కోసం ఎదురు చూస్తోంది ఆతృతగా.

భార్యకి విషయం అంతా వివరంగా చెప్పాడు. కొడుకుని ఎలా దారికి తీసుకురావాలో తెలియక, తీవ్రమైన ఆందోళనకి గురయ్యారు ఇద్దరూ. రెండు గంటల పాటూ జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. తరవాత జెస్సీ హర్షకి ఫోన్ చేసి, అరగంటలో ఇంటి దగ్గరుండాలని గట్టిగా చెప్పి ఫోను కట్చేసింది.

***

ఈల వేసుకుంటూ హుషారుగా ఇంటికి వచ్చిన హర్ష అమ్మనీ, నాన్ననీ ఇంటి దగ్గర చూసి ఆశ్చర్యపోయాడు.
"ఇద్దరూ ఇంటి దగ్గరే ఉన్నారు. ఆఫీసుకి వెళ్ళలేదూ?" అని ప్రశ్నించాడు ఉల్లాసంగా.
"లేదు నాన్నా. మీ ప్రిన్సిపాల్ ఫోన్ చేసింది కాలేజీకి రమ్మని. ఆవిడతో మాట్లాడి వచ్చానిప్పుడే!" అన్నాడు అబ్రహాం కొడుకు కళ్ళలోకి సూటిగా చూస్తూ.
వాడి మొహంలో నెత్తురు ఒక్కసారిగా ఇంకిపోయింది. భయంతో తెల్లగా పాలిపోయింది. అపరాధ భావంతో తలదించుకున్నాడు.
"కూర్చో. తెలియక తప్పు చేస్తున్నావనుకోడానికి నువ్వు చిన్న పిల్లాడివి కాదు. తెలియక తప్పు చేసినవారు దండిస్తే మారతారేమోగాని, తెలిసి చేసేవారు మారరు. అందుకే నిన్ను తిట్టడంగాని, కొట్టడంగాని చెయ్యదలచుకోలేదు. కొన్ని విషయాలు మాత్రం చెప్పదలిచాను. జాగ్రత్తగా విను. సరేనా!" అంటూ, కొడుకు సమాధానానికి ఎదురు చూడకుండానే చెప్పడం ప్రారంభించాడు.
"హర్షా, మా తాత ఒక క్రిస్టియన్ మిషనరీ దగ్గర తోటమాలీగా పని చేసేవాడనీ, చదువు లేకపోయినా లోకజ్ఞానం ఉన్నవాడు కావడంతో, పేదరికం నుండీ, సామాజిక వివక్ష నుండీ బయటపడాలంటే, చదువు తప్ప వేరే మార్గం లేదని గ్రహించి, చదువుకోవడానికి మా నాన్నని, మిషనరీలు నడిపే బోర్డింగు స్కూలుకి చిన్నవయసులోనే పంపేసాడనీ, ఆయన టీచరు ట్రెయినింగు వరకూ అక్కడే చదువుకున్నాడనీ చెప్పాను గుర్తుందా!" అడిగాడు. గుర్తుందన్నట్టు తలాడించాడు హర్ష.

“ఓకే. ఆ బోర్డింగ్ స్కూళ్ళలో జీవితం ఎలా ఉండేదో ఇంతవరకూ నీకు ఎప్పుడూ చెప్పలేదు. ఎందుకంటే నిన్ను భయపెట్టడం ఇష్టంలేక. ఇప్పుడు చెప్తాను విను. అక్కడ  విద్యార్థులకి, రోజుకి ఒక పూట .. రాత్రి మాత్రమే అన్నం పెట్టేవారట. ఉదయం, మధ్యాహ్నం  చోడి అంబలి పోసేవారట.  అన్నంలో పురుగులూ, కూరల్లో బొద్దింకలూ, అంబలిలో రాళ్లూ .. ఇవి మాత్రం కావలసినన్ని ఉండేవట.  ఇళ్ళ దగ్గర ఆ మాత్రం తిండికూడా దొరకని మా నాన్నలాంటి వారికి అదే పరమాన్నంలా ఉండేదట. వాళ్ళ నివాసం రేకుల షెడ్లలో కావడంతో, చలికాలంలో చలికీ, ఎండాకాలంలో ఎండకీ అల్లాడిపోయేవారట. తలలో పేలూ, వంటిమీద కురుపులూ… చాలా దయనీయంగా ఉండేదట వాళ్ళ స్థితి.  అలాంటి పరిస్థితుల్లో కూడా .. మా నాన్న ఎందుకంత కష్టపడి చదువుకున్నాడో తెలుసా హర్షా?” అడిగాడు కొడుకు వేపు నిశితంగా చూస్తూ.

సమాధానం చెప్పలేదు వాడు. నేల చూపులు చూస్తూ నిలుచున్నాడు. సమాధానం కొరకు  క్షణం పాటు చూసి చెప్పడం కొనసాగించాడు అబ్రహాం.

“చదువుకోవడానికి పంపించేటప్పుడు మా తాత, ఒక విషయం చాలా గట్టిగా చెప్పాడట. ‘నాలుగక్షరం ముక్కలు నేర్చుకొని, చిన్న ఉద్యోగమైనా సంపాదించుకో.  నీకూ, నీ పిల్లలకీ ఐదు వేళ్ళూ నోటికి వెళ్ళడం మాత్రమే కాక, పిల్లలు కూడా నీలాగే  చదువుకొని బాగుపడే అవకాశం దొరుకుతుంది. చదువుకోలేదనుకో, నువ్వూ నాలాగే తోటమాలిగా మిగిలిపోతావు. నీ పిల్లలు చదువూ సంధ్యా లేకుండా రిక్షా లాక్కుంటూనో, రోడ్లు తుడుచుకుంటూనో బతుకుతారు. ఈ పేదరికం, ఆకలీ, వివక్షా వీటి నుండి ఎప్పటికీ బయట పడలేవు. అందుకే వెనక్కి తిరిగి వచ్చెయ్యకు. అక్కడే ఉండు.  ఎంత కష్టమైనా భరించు. జాగ్రత్తగా చదువుకో’ అని.  ఆ మాటల విలువ గ్రహించిన మా నాన్న, ఎన్ని కష్టాలైనా భరించాడు గాని, చదువు మాత్రం మానలేదు. మన కుటుంబంలో మొట్టమొదటి అక్షరాస్యుడు మానాన్నే. టీచర్ అయ్యాడు. నాకూ మా చెల్లెళ్ళకీ కాలేజీ చదువులు చెప్పించగలిగాడు. ఆ చదువు పుణ్యాన, నేనింకొక అడుగు ముందుకి వేసి, బేంకులో ఒక కింది స్థాయి ఆఫీసర్ని అవ్వగలిగాను.  ‘పల్సర్” మీద నిన్ను కాలేజీకి పంపగలుగున్నాను. వింటున్నావా?” అడిగాడు కొడుకు దగ్గర్నుండి సమాధానం ఉండదని తెలిసికూడా.

“అదే మా నాన్న కూడా చదువెగ్గొట్టి రోడ్లమ్మట బలాదూరుగా… ఇప్పుడు నువ్వు తిరుగుతున్నావు చూడు… అలా తిరిగుంటే, ఈ రోజు మన పరిస్థితి ఎలా ఉండేదో ఊహించగలవా? ఎలా ఉండి ఉండేదో చెప్పనా? మా నాన్న రిక్షా లాక్కునేవాడు. నేను మార్కెట్టులో మూటలు మోసుకునేవాడిని. నువ్వేమో, ఇప్పుడు నువ్వు తిరుగుతున్నావు కదా “పల్సర్” అలాంటి మోటార్ సైకిళ్ళకే పంచర్లు వేసుకుంటూ బతికేవాడివి. ఎందుకు ఇంత కచ్చితంగా చెప్తున్నానంటే, నీలాగ గాలికి తిరిగి,  చదువు నిర్లక్ష్యం చేసిన, మన బంధువులు చాలామంది ఇప్పటికీ అలాగే బ్రతుకుతున్నారు మన ఊర్లో!” అని ఆవేశంగా చెప్పి, భార్య వేపు చూసాడు.

“ఇప్పుడు అసలు విషయానికి వద్దాం హర్షా” అంది జెస్సీ ఎలాంటి ఆవేశమూ లేకుండా కూల్ గా. “నువ్వు కాలేజీ ఎందుకు ఎగ్గొడుతున్నావు, ఎగ్గొట్టి ఏం చేస్తున్నావు, ఎక్కడ తిరుగుతున్నావు  అని అడగదలచుకోలేదు. కష్టపడి చదువుకొని వృద్ధిలోకి వస్తావా లేదా అనేది పూర్తిగా నీ నిర్ణయం.  నీకు నెల

రోజులు గడువు మాత్రం ఇస్తున్నాం.  ఈ నెల రోజుల్లో, నువ్వు పూర్తిగా మారినట్టు మాకు నమ్మకం కుదిరితే సరి. లేకపోతే ఏం చెయ్యాలో  నిర్ణయించుకున్నాం. దాన్ని మాత్రం, ఏసు ప్రభువే అడ్డొచ్చినా సరే, అమలుచేసి తీరతాం."

 "ఒక్కటి మాత్రం గుర్తుంచుకో హర్షా! అక్షరం ముక్క రాని మీ ముత్తాత తోటమాలి. నాలుగు అక్షరాలు నేర్చుకున్న మీ తాత స్కూలు టీచరు. ఇంకాస్త పైకి చదివిన మీ నాన్నొక చిన్న బేంకాఫీసరు.  నువ్వు ఇంకా బాగా చదువుకొని డాక్టర్ అవ్వాలనీ, మీ తాత పేరు మీద హాస్పటల్ పెట్టి, పేదవారికి సేవ చెయ్యాలనీ మా కోరిక. అది తీరుస్తావా లేదా అన్నది నీ చేతుల్లోనే ఉంది.  ఏం చేస్తావో చెయ్యి!" అని చెప్పి అక్కడ నుండి లేచి, లోపలికి వెళ్ళిపోయారు ఇద్దరూ.

***

 "ఎంత సేపైంది నాన్నా వచ్చి. ఇక్కడ కూర్చున్నారేంటి. వేడిగా లేదూ.  రండి లోపటికి!" అన్న కొడుకు మాటలతో ఈ లోకంలోకి వచ్చి పడ్డారు అబ్రహాంగారు. కళ్ళు తెరిచి చూసారు. మెడలో స్టెథస్కోపుతో, ఎదురుగా, నవ్వుతూ నిల్చున్న ఆరడుగుల అందమైన కొడుకు... డాక్టర్ శ్రీహర్ష ఎమ్.డీ.

"అచ్చం నాన్నే వీడు. అన్నీ ఆయన పోలికలే!" అనుకున్నారు అబ్రహాంగారు, కొడుకు చెయ్యి పట్టుకొని లోపలికి నడుస్తూ...గర్వంగా!!

***0***



# ఋణం

## డా. లక్ష్మి రాఘవ

రామారావు వంటింట్లోకి వచ్చి "ఏమిటీ, ఇంకా కాఫీ ఇవ్వలేదు. నేను లేచిన అలికిడి నీకు వినిపించలేదా?"

అన్నాడు భార్య దేవమ్మతో,

వెనక్కి తిరిగి చూసి "కలుపుతున్నా" అంది. ఆమె తీరు చూసి దగ్గరగా వచ్చి, భుజం మీద చెయ్యి వేస్తూ "ఇంకా రాత్రి మాట్లాడినదే ఆలోచిస్తున్నావా" అంటూ అడిగాడు.

"లేదు" అని ఆమె చెబుతున్నది అబద్ధం అని ఆయనకు స్పష్టంగా అనిపిస్తున్నా, అంతకన్నా రెట్టించ లేకపోయాడు. రాత్రి నుండీ మనసంతా గందర గోళంగా వుంది. దాని గురించి మాట్లాడుకున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఇంతలో సాగర్ వచ్చాడు.

"కాఫీ ఇవ్వనా సాగర్!" అడిగింది దేవమ్మ

"అమ్మా, మీరు కూర్చోండి నేను కలుపుకుంటా ...." అంటూ వంటింట్లోకి వెళ్ళాడు.

కాఫీ కలుపుకుని సాగర్ వచ్చేదాకా దంపతులు ఇద్దరూ మౌనంగానే వున్నారు. సాగర్ ఎదురుగా వచ్చి కూర్చుని, కాఫీ తాగుతూ వుంటే మాట్లాడాలని వున్నా మాట రాలేదు.

"అమ్మా రాత్రి లేట్ అయ్యింది. ఇంకా కొంచెం వర్క్ పెండింగ్ వుంది. చూసుకుని స్నానం చేస్తా .." అని ఆగి వెనక్కి చూస్తూ "ఈ రోజు బిల్ల్స్ కట్టేస్తాను నాన్నగారూ ఆన్లైన్ లోనే. ఏవున్నాయో మీరు చెప్పండి" అన్నాడు సాగర్.

"కొన్ని బిల్ల్స్ కట్టడానికి వున్నాయి. చూసి చెబుతాను సాగర్. ముందు నీవు పని చూసుకో!" అన్నారు రామారావు.

"అమ్మా, నేను వచ్చి ఉప్మా చేసేస్తాను!" అన్నాడు దేవమ్మను చూస్తూ.

"సాగర్, నీవు వంటింటి వరకూ రాకూడదు అని చెప్పాను కదా.. నీకు అనుమతి కాఫీ కలపడం వరకే!" అంది నవ్వుతూ

"నీవు స్నానం చేసి రాగానే నేను ఉప్మా రెడీ చేసేస్తా. వెళ్ళు వెళ్ళు!!" అంది చెయ్యి ఊపుతూ. సాగర్ టవల్ తీసుకుని బాత్ రూమ్ లోకి వెళ్ళాడు.

***

సాగర్ వచ్చినప్పటినుండీ చాలా హాయిగా వుంది ఇద్దరికీ. కొడుకు రవీంద్ర అమెరికా వెళ్ళి పోయాక ఒంటరిగా మిగిలారు ఇద్దరూ. ఒకటి రెండుసార్లు అమెరికా వెళ్లి వచ్చినా, అక్కడే ఉండటానికి గ్రీన్ కార్డ్ ఉన్నా, వద్దు అన్నారు. ఇండియాలోనే వుండాలని నిర్ణయించుకున్నారు. ఆరోగ్యాలు బాగానే వున్నాయి కాబట్టి, బాగానే వుండేది.

ఆరు నెలల కిందట కొడుకు రవీంద్రకు తెలిసిన ఒక స్నేహితుడి ద్వారా హైదరాబాదుకు ఉద్యోగరీత్యా వచ్చిన సాగర్ కు, వీరింట్లో ఉండటానికి అనుమతి లభించింది. ముందు వెనుకలు ఎవరూ లేరని, కాబట్టి ఇక్కడే ఉంటాడు అనేసరికి వీరిద్దరికీ సంతోషం కలిగింది. అనుకున్న దానికంటే ఎక్కువగా కలిసి పోయాడు సాగర్. "నాకు ఎవరూ లేరు అనుకునేవాడిని. ఇప్పుడు మీరే నాకు అమ్మ, నాన్నలు. అందుకే అలానే పిలవాలనుకుంటున్నాను.. అభ్యంతరం లేదు కదా అమ్మా!" అంటూంటే ఎంతో సంతోషపడ్డారు ఇద్దరూ! అలా వారికి అర్థాంతరంగా వచ్చిన కొడుకు సాగర్. అన్ని పనులూ చేసిపెట్టేవాడు. ఎప్పుడైనా వంట కూడా చేసేవాడు. సాగర్ రాకతో కొడుకు దగ్గర లేని లోటు తీరిపోయింది.

నిజానికి కొడుకు రవీంద్ర అమెరికా వెళ్ళాలనే కోరిక తల్లిదండ్రులదే. ప్రతి ఇంట్లోనూ ఒకరు అమెరికా వెళ్లిపోతుంటే తమ కొడుకు కూడా వెడితే బాగుండునని ఆశపడ్డారు. ఇంజనీరింగ్ అవగానే యం. ఎస్. కోసం అమెరికా పంపారు. రవీంద్ర అక్కడికి వెళ్ళడం, ఉద్యోగం సంపాదించుకోవడం ఎంతో గర్వంగా అనిపించేది. మంచి సంబంధాలు కూడా వచ్చాయి.
పెళ్లి చేసుకున్నాక కొడుకుది అమెరికా కాపురం అయ్యింది. అప్పుడు చాలానే సంతోషపడ్డారు. సొసైటీ లో తమకు ఒక ప్రత్యేక స్థానం వుంది అని గర్వంగా అనిపించేది. కానీ అబ్బాయి పూర్తిగా అమెరికావాసుడైనాక కొన్నేళ్ళకి కానీ తెలియలేదు రామారావు దంపతులకి.. జీవితం పిల్లలకు దూరంగా ఉంటే ఎలా వుంటుందో! ఒకటికి రెండుసార్లు అక్కడకు వెళ్ళినాక, ఆ దేశంలో ఉండటం ఈ వయసులో ఎంత కష్టమో అర్థం అయ్యింది. అయినా ఇప్పుడనుకుని ఏమి లాభం ? తాము కోరుకున్నదే కదా అని ఏమీ చెయ్యలేక నిరాశగా ఉంటున్నప్పుడు .. సాగర్ వారి జీవితంలోకి వచ్చాడు. అందుకే సొంత కొడుకు కన్నా ఎక్కువగా చూసుకుంటున్నారు.

కొద్ది రోజుల క్రితం కరోనా రావటంతో ఎన్నో విషయాలకు తోడుగా నిలిచి ధైర్యాన్నిచ్చాడు సాగర్. ఇంట్లో అన్ని అవసరాలనూ తీరుస్తూ వున్నాడు. బయటకు వెళ్లి ఏమీ కొనలేని పరిస్థితి. అరవై ఏళ్ళు దాటిన వారిని బయటకు రావద్దు అన్న ఆంక్షలు వున్నాయి. అన్నిటికీ సాగరే...

కానీ కరోనా దెబ్బతో సాగర్ పని చేస్తున్న కంపెనీ ఫైనాన్స్ కట్ మీద చాలామందిని తీసేసింది. దానిలో సాగర్ ఉద్యోగం పోయింది. కరోనా వలన పెద్ద ఉద్యోగులకే జీతాలు ఇవ్వలేక ఇంటికి పంపే పరిస్థితి వున్నప్పుడు సాగర్ లాటి ఉద్యోగస్తులకి మాట్లాడే హక్కే లేదు .. అన్నట్టుగా తయారైంది పరిస్థితి.

రామారావుగారు కూడా తన స్నేహితుల ద్వారా సాగర్ కి ఉద్యోగం ఇప్పించాలని చూసారు కానీ కుదరలేదు. ఒక నెల రోజులు గడిచాయి. రవీంద్ర ఫ్రెండ్ సాగర్ కోసం బెంగళూరులో ఉద్యోగం చూసాడు. వారు ఆన్లైన్ ఇంటర్వ్యూ చేసి సాగర్ ను రమ్మన్నారు.

రాత్రి సాగర్ వెళ్ళిపోవడం గురించే రామారావు దంపతులు ఆ రాత్రి మాట్లాడుకున్నారు. అన్నిటికీ తోడుగా వున్న సాగర్, ఇప్పుడు వెళ్ళిపోతే ఎలా? అని దిగులు పట్టుకుంది ఇద్దరికీ.

“వద్దని చెబుతామా!” అంది దేవమ్మ.

“మనం అలా చెబితే బాగుంటుందా. వాడి భవిష్యత్తు పాడు చేసిన వాళ్ళం కాదా?

“మన అబ్బాయే అయితే వెళ్ళమని చెప్పమా?” ఎదురు ప్రశ్న వేశాడు రామారావు.

నిజమే రవీంద్ర అమెరికా వెళ్లి బాగుపడాలని తాము కోరుకోలేదూ? ఇప్పుడు తమకు తోడుగా ఉండటానికి సాగర్ ని వెళ్లనీకుండా చెయ్యవచ్చా? అన్న ఆలోచనలతో సతమతమయ్యారు రాత్రంతా.

***

పొద్దున్న సాగర్ నార్మల్ గానే అన్నీ చేస్తుంటే.. ఏమనుకుంటున్నాడో అడగడానికి ఇబ్బందిగా వుంది ఆ రోజు. రాత్రి లేటు అయ్యింది అంటే ఎందుకు? పైగా వర్క్ పెండింగ్ అన్నాడు. కొత్త కంపెనీకి వెళ్ళే ప్రయత్నమేమో ..

సాగర్ రూమ్ లోనుండీ బయటకు రాకపోతే బట్టలు సర్దుకుంటూ వున్నాడేమోనని అనుమానం వేసింది.

కాస్సేపయ్యాక సాగర్ వచ్చాడు.

“అమ్మా., కొంచెం సేపు బయటకు వెళ్ళి వస్తా!“ అని చెప్పి వెళ్ళాడు.

ఎక్కడికి? ఏమిటీ అని అడుగుదామని వున్నా అడగలేక పోయారు. ఇద్దరిలో ఎవరికైనా కరోనా వస్తే .. సాగర్ కూడా లేకపోతే .. ఏమైనా అయితే .. అనాధలుగా ఉండాల్సిన దేనా?

కన్న కొడుకు వచ్చే చాన్స్ లేదు. దగ్గరగా వున్న తోడూ, ఆలంబన అంతా సాగరే .. ఇప్పుడెలా? వెళ్ళవద్దని చెప్పలేము .. వెళ్ళమని అనలేము .. ఈ ఆందోళన కొనసాగుతుండగానే సాగర్ వచ్చాడు.

"అమ్మా, నాన్నా ఈ కుంకుమ తీసుకోండి .. ప్రసాదం కూడా" అని కొబ్బరి చిప్ప, దానిలో వున్న చక్కెర పొంగలి ఇస్తూ "గుడికి వెళ్ళి వచ్చాను" అని కూర్చుంటూ
"మీతో ఒక విషయం చెప్పాలి" అన్నాడు ఇద్దరూ ఆత్రుతగా సాగర్ ని చూశారు .. ఎప్పుడు వెళ్ళిపోతాడో చెబుతాడా..!

"రాత్రి నా ఫ్రెండ్స్ ద్వారా ఇక్కడ వివిధ కంపెనీలలో ఉద్యోగాల సంగతి కనుక్కున్నాను. పొద్దున్న ఒక కంపెనీకి నా వివరాలు ఇచ్చాను. అమ్మా నేను బెంగళూరు జాబుకు వెళ్ళను .. నేను చేసే ఉద్యోగం ఇక్కడనే దొరకకపోదు. జీవితంలో నాకు దొరికిన అపురూప కానుక మీరు. మీకు దూరంగా వెళ్ళాలని లేదు!" అంటూన్న అతనిని పట్టుకుని ఏడ్చింది దేవమ్మ అప్రయత్నంగానే.

రామారావు నవ్వుతూ ముందుకు వచ్చి సాగర్ తల నిమిరాడు ఆప్యాయంగా!

పిల్లల ఉన్నతిని కోరుతూ, దూరప్రాంతాలకు ఇష్టంగా పంపుతాము. కానీ వయసు మీరాక గానీ అర్థం కాదు ఒక తోడూ, ఆలంబనా ఎంత ముఖ్యమో!
కాలక్రమేణా జీవితంలో మనం కన్న పిల్లలు తోడు ఉంటారని కూడా ఎక్స్పెట్ చేస్తాము. జీవిత సత్యం ఏమంటే ఎక్కడ, ఎవరితో ఋణం వుంటుందో వారే నిలుస్తారు ఎప్పటికీ తోడుగా ..

ఇలా మనం పీడించడానికి వచ్చింది అనుకున్న కరోనా మనుషుల మనస్తత్వాలకు ఎంతో నేర్పలేదూ??

***0***

# ఓ విజ్ఞప్తి

కథాస్వాదన చేయగల

మంచి పాఠకులను

కథా మంజరి కి

పరిచయం చేయండి

# ధన్యవాదాలు

